

ఇంకిపోయిన నెత్తుటిమరకల మధ్య

మరణించిన కొంతమంది, బతుకుతున్న కొంతమంది,
ఇంకా పుట్టని కొంతమంది స్మృతికి

ప్రస్తుతానికి సృష్టికర్త ఇంకా బలహీనుడుగానే వున్నాడు.

ఇంకొకడికి తెలియకుండా స్వర్గాన్నీ భూమినీ మార్చివేస్తాడు గాని ప్రపంచాన్ని నాశనంచేసే సాహసం చేయడు. ఇంకొకడికి తెలియకుండా సజీవప్రాణుల్ని చంపి వేస్తాడుగాని వాటి మృతశరీరాలను తరలించే సాహసం చేయడు. ఇంకొకడికి తెలియకుండా మానవరక్తాన్ని చిందిస్తాడుగాని రక్తంమరకలతడి ఆరకుండా వుండేట్టుచూసే సాహసం చేయడు. ఇంకొకడికి తెలియకుండా మానవజాతిని బాధలకు గురిచేస్తాడుగాని వాటిని ఎల్లకాలమూ జ్ఞాపకంలోవుంచే సాహసంమాత్రం చేయడు.

తనలాంటివాళ్ళను – మనుషుల్లో బలహీనులను – మాత్రమే ఆయన తయారు చేస్తాడు. ఆయన విలాసవంతమైన భవనాల నిర్మాణంకోసం పాడుబడ్డ శిథిలాలనూ, ఒంటరి సమాధులనూ వాడుకుంటాడు. బాధనూ రక్తం మరకలనూ చెరిపేయడానికి కాలాన్ని వాడుకుంటాడు. ప్రతిరోజూ తియ్యటి పూతపూసిన చేదుసారా కప్పెడు–

119
సెప్టెంబర్ 1981

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 20
ఈ సంచిక రు. 2

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాస పత్రిక

ఆదిలాబాద్ గిరిజన సహాయ నిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 001

అగస్టు సంచికలో ప్రకటించిన విరాళాలు
ఒక బంగారు ఉంగరం, వెండిమట్టెలు, 1500-00 విలువగల మందులు

		+ 12571-17
1.	ఎస్. ఉష, హైదరాబాదు	25-00
2.	కె. వి. రమణారెడ్డి, కావలి	100-00
3.	కార్యదర్శి, పోస్టల్ రిక్రియేషన్ క్లబ్, కర్నూలు	76-00
4.	పి. సత్యనారాయణ, హైదరాబాదు	50-00
5.	ఎం. రామిరెడ్డి, కలికిరి	10-00
6.	చలసాని, కరీంనగర్ ద్వారా	100-00
7.	ఆర్ వై ఎల్, పైడిపల్లి వసూళ్ళు	75.00
8.	ఎం. వి. బాబు, అనకాపల్లి	5-00
9.	ఆండ్రి శంకరరావు, అనకాపల్లి	10-00
10.	రైతుకూలిసంఘం, ఎలిగేడు	75-00
11.	ఎస్. వెంకటరమణ, తిమ్మరాజుపేట	5-00
12.	కార్మికవర్గ మిత్రమండలి, బొంబాయి వసూళ్ళు	120.00
13.	ఎల్. వి. రమణ, అనకాపల్లి	5.00
14.	పి వెంకటరమణ, సంపతిపురం	10 00
15.	సి. పి. డి. ఆర్. బొంబాయి వసూళ్ళు	800.00
16.	శ్రీకాకుళంజిల్లా ఆర్ వై ఎల్ వసూళ్ళు	500-00
17.	సృజనదగ్గర వసూళ్ళు	43-71
	మొత్తం రూ.	14580-88

+ ఒక బంగారుఉంగరం, 4 వెండి మట్టెలు, 1500-00 విలువగల మందులు.

గత సంచికలో పి కె. శంకర్ అండ్ పార్టీ, అనంతపురం అని ప్రకటించిన విరాళం - అనంతపురం బదులు అనకాపల్లి అని చదువుకోవాలి.

ఆదిలాబాదు గిరిజన సహాయనిధి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, వరంగల్ బ్రాంచిలో పి. వరవరరావు పేరవుంది. అకౌంట్ నంబర్ 2730.

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

119
సెప్టెంబర్ 1981

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక

కవర్ & బ్యాక్ కవర్ : లూసున్ వచన కవిత : 'వైల్డ్‌గ్రాస్' కవితాసంపుటి నుంచి
[జపాన్, బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల రెచ్చగొట్టే చర్యల్నివ్యతిరేకిస్తూ పెకింగ్‌లో 1925 మార్చి 18న విద్యార్థులూ, శాంతికాముకులైన పౌరులూ ప్రదర్శన జరిపారు. ఉత్తరప్రాంత యుద్ధప్రభువు టువాన్-చి-జుయి ప్రదర్శన మీద కాల్పులు జరపవలసిందిగా పోలీసులను ఆజ్ఞాపించాడు. ఆకాల్పుల్లో నలభై ఏడుగురు మరణించారు, 150 మంది గాయపడ్డారు. ఆ సందర్భంగా రాసినదీ వచనకవిత.]

ఏది హింసా సాహిత్యం

మార్క్సిజాన్ని ఎదుర్కోవడానికి ఇతర ఆయుధాలన్నీ అసహాయమైపోయి శత్రువుకూడ మార్క్సిజం ముసుగులోనే వస్తున్నట్లుగా సాహిత్యంపై విజ్ఞానశాస్త్ర ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కుహనా వైజ్ఞానిక రచనలు వస్తున్నాయి.- ఈ రచనలు ఫ్యూడల్ దోపిడీవిధానానికి సామ్రాజ్యవాద సంస్కృతి మేలికెరలుకద్దాయి. దేవదాసీల సంప్రదాయాన్ని శంకరాభరణం టెక్నికలర్‌లో పునరుజ్జీవింప చేయజూస్తాయి.- తులసీదళంలోవున్న ఈనెల్ని, పత్రహరితాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నట్లుగానే కనిపిస్తూ భక్తి తులసినాటి పారవశ్యంతోపాటు భయాన్నీ, గగుర్పాటునూ కలిగింపజేస్తాయి. రచనల్లో ఎంత బాధ్యతారాహిత్యమో, పాఠకుల్తోనూ అంతేనిర్లక్ష్యంగా వ్యవహరిస్తాయి. సామ్రాజ్యవాద యుద్ధోన్మాదంలాగా ఈ ఉన్మాదరచనలు యువతీ యువకులకు పిచ్చెక్కించి శాంతిలేకుండా చేస్తున్నాయి. యువతాజ్యోతులను జీవితవాస్తవాలనుంచి మళ్ళించడానికి, మత్తునుంచి బలమైనమత్తుకు, నల్లమందు, చరస్‌లనుంచి ఎల్ ఎస్ డీలకు పరుగెత్తుతున్న సామ్రాజ్యవాద సంస్కృతిలో భాగంగానే భ్రమా ప్రేమలోకాలు సెక్స్, క్రైమ్, సెన్సేషన్, షాక్, థ్రిల్లర్‌లనుంచి సూడో సైంటిఫిక్ అద్భుతాల దాకా రేసుగుర్రాల్లాగా పోటీపడి పరుగెత్తుతున్నారు నవలా రచయితలు. వీళ్ళ రేసు గుర్రాల శరీరాలమెరుపుచూసి కొందరు, పరుగుచూసికొందరు, గాలిసోకి కొందరు, చివరకు వాటిగిట్టలకిందపడి కొందరు మనసుకు కళ్ళాలులేని మనుషులు బలైపోతున్నారు. రేసు పందాలుపెట్టి, లాటరీటికెట్లుపెట్టి ప్రజలజేబులు కత్తిరిస్తున్న ప్రభుత్వాలది తప్పుకాదు, వాటికి ఎగబాకుతున్న ప్రజలది తప్పంటుంది ఈ ప్రభుత్వ దుర్మార్గ స్వభావాన్ని అర్థంచేసుకోలేని అమాయకత్వం. అమాయకత్వం అక్షరాలా అక్షరాల్లో గుప్పిస్తూ ఆకర్షించే రచయితలతప్పుకాదు, ఆకర్షింపబడే యువతీయువకుల తప్పంటుంది అమాయకత్వం లేదా ధూర్తత్వం.- ప్రజలకు నిజమైన చైతన్యం ఇవ్వగల సాహిత్యానికి మాత్రం ప్రజలమీదభరోసాతో ప్రభుత్వం స్వేచ్ఛ యిచ్చిచూడదు. ఆకలిచావులకు మాత్రమేకాదు 'ఎన్‌కౌంటర్' మరణాలకుకూడ సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం లేనంత 'స్వాతంత్ర్యాన్ని' పొందింది ఈ ప్రభుత్వం. మనోవికారాలకో, వైకల్యాలకో, వైక్లబ్యాలకో సరిగదా ఆత్మహత్యలకు, హత్యలకు, సామూహిక రాక్షసరతికీ, హింసాదౌర్జన్య ప్రవృత్తికి దోహదంచేస్తున్న రచనలు ఏవర్గంనుంచి వస్తున్నాయి? మానవత్వాన్ని అధోగతికి అణచివేసే పాశవిక విలువలను ఇవ్వాళ సంపన్న వర్గాల సంస్కృతి కళలూ సాహిత్యంద్వారా ఆకాశానికెత్తుతున్నది. ఎందుకంటే ఆ సంస్కృతికి కావలసింది మ్యాకరెటూ, లాభాలేకాని మానవత్వంకాదు.- వాళ్ళకుకావలసింది డబ్బు టుదిపవర్‌ఆఫ్ డబ్బు. మరి స్నేహం, ప్రేమవంటి విలువలుకోరుకునే మానవులు తమను 'సరుకు'కు బానిసనుచేసిన పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద సంస్కృతిని మట్టుపెడితేకాని నూతనమానవులు కాలేరు.

31-8-1981

— సంపాదకుడు

చైనా విప్లవచరిత్రలో లూసూన్‌స్థానాన్ని మొదట మనం అర్థంచేసుకోవాలి– ప్రముఖ రచయిత మాత్రమే కాకుండా జాతీయ విమోచనలో ముందుభాగాననిలిచి విప్లవ పోరాటానికి ఆయన తన శక్తినంతా ధారపోసాడు– కమ్యూనిష్టు పార్టీ నిర్మాణానికి చెందకపోయినా ఆయన ఆలోచనావిధానం, రచనలు, ఆచరణ అన్నీ మార్క్సీయంగానే ఉండేవి– ఆయన జీవిత చరమాంకంలో చైనా విప్లవ యువతతో మరింత మమేకమయ్యాడు– భూస్వామ్య శక్తులకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎడతెగకుండా, పట్టువదలకుండా పోరాటం సాగించాడు– శత్రువు కల్పించిన నిర్బంధం, శిక్షలు, నీచాతినీచమైన పరిస్థితులు తట్టుకొని ఎదుర్కొని ఆయన పోరాడాడు.

లూసున్ క్షీణదశకు చేరుకున్న భూస్వామ్యసమాజంనుంచి బయల్పడ్డాడు– తను జీవించిన కుళ్ళుసమాజంలోను దోపిడి సామ్రాజ్యవాద శక్తులతోను ఆయనకున్న అనుభవాన్ని పురస్కరించుకొని వాటిపై ఎట్లా ఎదురుదెబ్బలు వేయాలోకూడ ఆయన మెలకువతో గ్రహించాడు– ఆ దుర్మార్గ సామాజికశక్తిని ఎదుర్కొనేందుకు ఆయన అవహేళన, హాస్యము, వ్యంగ్యము కలగలిసిన పదునైనకలాన్ని వినియోగించాడు– ఆయన నిజంగా సిద్ధహస్తుడైన "చిత్రకారుడు" చివరిరోజుల్లో జాతీయవిమోచన దృక్పథంనుంచి, శ్రామికవర్గదృక్పథంనుంచి సత్యంకోసం, స్వేచ్ఛకోసం పోరాడాడు.

లూసున్ మొట్టమొదటిలక్షణం ఆయనకుగల స్పష్టమైన రాజకీయదృష్టి– సమాజాన్ని సూక్ష్మదర్శినితోనూ, దూరదర్శినితోనూ ఆయన పరిశీలించాడు– అందుకే ఆయన రచనల్లో అంత యథార్థత, అంత దూరదృష్టి 'ట్రాట్స్కీయైట్ల', ప్రమాదకరమైన ధోరణులను ఆయన 1936లోనే ఎత్తిచూపాడు–

లూసున్ రెండోలక్షణం తీవ్ర క్రియాశీలత – (మిలిటెన్సీ) దాడుల దౌర్జన్య శక్తుల విజృంభణకు ఎదురొడ్డి తొణుకుబెణుకులేకుండా మహావృక్షంలా నిలిచాడాయన. ఒక్కసారి స్పష్టంగా రాజకీయగమ్యాన్ని కనుక్కున్నాడంటే ఇంక ప్రయాణంలో మధ్యన లొంగుబాటుగానీ రాజీగానీ లేదు– గమ్యాన్నిచేరుకునే ప్రయత్నమే– అర్థమనసుగల విప్లవకారులు ఎందరో వుండేవారు యుద్ధరంగంలో ప్రవేశించి కాసేపు పోరాడి అలసిపోయేవారు– యుద్ధరంగాన్ని వదిలిపెట్టేవారు– ప్లెఖనోవ్, ట్రాట్స్కీ ఇందుకు మంచి ఉదాహరణలు. చైనాలోనూ ఇలాంటి వాళ్ళు తక్కువేమీకాదు. ఆరంభంలో వీళ్ళందరూ 'వామపక్షీయులే', విప్లవకారులే– కాని ఒత్తిడివచ్చిందో లేదో వీళ్ళు మారిపోయి తమ కామ్రేడ్‌లను విరోధికి కానుకగా సమర్పించారని లూసున్ ఒకమారన్నాడు– ఇలాంటివారంటే లూసున్‌కు తగనిద్వేషం. వీళ్ళతో పోరాడుతూ

తన అనుచరులైన యువరచయితలను ఆయన సుశిక్షితుల్ని చేశాడు- దృఢంగా నిలిచి పోరాడమని తమ స్వంతదారి ఏదో కనుక్కోమని ఆదారిలో అగ్రగాములుకమ్మని ఆయన యువకులకు బోధించాడు-

లూసున్ మూడో లక్షణం ఆయన ప్రదర్శించిన స్వార్థ త్యాగ సంసిద్ధత- విరోధి బెదిరింపులకు, బాధలకు ఆయన ఏమాత్రం భయపడలేదు- విరోధిచూపే ఎరలకు ఆయన ఏమాత్రం ప్రలోభపడలేదు- నిర్దాక్షిణ్యమైన తీవ్రతతో ఆయన కత్తిలాంటి కలం ఆయన అసహ్యించుకున్న వారందరినీ చీల్చిచెండాడింది- విప్లవ యోధుల నెత్తుటి మరకలనడుమ పట్టువదలని ధిక్కారాన్నివహించి తననునుసరించి రమ్మని ఇతరులను ప్రభోదిస్తూ ఆయన ముందుండి నడిచాడు.

లూసున్ నాలుగో లక్షణం ఆయన నూటికినూరుపాళ్లు వాస్తవవాది- రాజీ పడ్డతేలేదు- నిర్దయం సడలటమేలేదు- నీటిలోపడిన తర్వాతకూడా కుక్కనుకొట్టడం సాగించాలని ఆయన తన వ్యాసాలలో ఒకచోట అన్నాడు- "అలా కొట్టవనుకో ఆ కుక్కనిన్ను కరవడానికైనా, లేదా నీమీద కనీసం మురికినీటిని చిమ్మడానికైనా పైకి దూకుతుంది- అందువల్ల కొట్టేదేదో పూర్తిగా కొట్టాలి"- హృదయ దౌర్బల్యం కపటము లూసున్‌లో లేశమాత్రమైనా లేవు-

లూసున్ ఐదో లక్షణం ఆయన స్పిరిట్- (చైతన్యం) ఆయన స్పిరిట్ గొప్పది- నిజానికి అందులో భాగాలే పై లక్షణాలు- జీవించినన్నాళ్లూ లూసున్ ఈ స్పిరిట్ నుంచి ప్రక్కకు మళ్లలేదు- అందువల్లనే సాహితి పరుల్లో అత్యంత ప్రముఖుడు, విప్లవకారుల్లో మెరికలాంటి భేషైన అగ్రగామి కాగలిగాడు.

ఆయనను స్మరించుకుంటున్నాం కాబట్టి ఆ స్పిరిట్‌ను మనం అలవర్చుకోవాలి- మన పోరాటంలో దీన్ని వినియోగించుకోవాలి,

[జెరోమ్‌చెన్ ఎడిట్‌చేసిన 'మావో పేపర్స్' ఆధారంగా]

మావో

సి. సి.

నీ ఆలోచనా విధానం
మా ఆచరణకు పదును పెట్టి
మనసుకు ఆనందాల్ని పంచుతుంది

చలిలో ఆకలితో కారడవులమధ్య
క్రూరమృగాలమధ్య వుంటున్నామని బాధలేదు
కష్టజీవుల ఋణం తీర్చుకుంటున్నామనే స్థైర్యం

ఎన్ని పేర్లవో, పేర్లులేనివెన్నో
పక్షులు గుండెలోపలికే నాదాలు
నెమళ్ళనాట్యాలు, జింకలనడకలు
అడవిప్రాణుల అందాల అడుగులు
మారేడుచెట్ల చల్లగాలినీడల్లో పేద
ఎండకూ వానకూ మమ్మల్ని కడుపులో
దాచుకునే కొండగుహలు
మేం ఒంటరిగా లేమనడానికి యీ
నిదర్శనాలు చాలవా ! ?

మమ్మల్ని చుట్టుముట్టిన శత్రుసేనలకు
చీకటైతే మళ్ళీ ఉదయం చూడలేమనేభయం
తుపాకిబరువు మోయలేక ప్రతిక్షణం
పిరికితనంతో చస్తారు
జీవితానికి జీవించడానికిమధ్య నలిగిపోతారు
అడవుల్లోని ప్రతిశబ్దం వాడి గుండెల్ని
యింకా దిగజార్చుతుంది
నీవు చెప్పినకాగితంపులిని యిక్కడ
అక్షరాలా చూస్తున్నాం

తప్పటడుగుల్తో పడుతూలేస్తూ
నడక నేర్చుకున్నాం

పరుగెత్తుతున్న మమ్మల్ని
అడ్డుకునే శక్తివేదీ!?

కంపూచియా పోరన్నల వెన్నుతడ్తూ
లావ్ విముక్తి ప్రాంతాల్లో విహరిస్తూ
బర్మా ఎర్రసేనతో చేయికలిపి
నవభారతానికి నడుంబిగించి
అగ్రరాజ్యాల ముట్టడిని తుదముట్టించ
పిడికిళ్ళు ఎత్తినాం

నీ ఆలోచనల్లోంచి ప్రపంచాన్ని
ఒక్కమారు దర్శించి మమ్మల్ని మేము
పునరంకితం చేసుకుంటాం-
కార్యోన్ముఖులమౌతాం

వ్యక్తులేకాదు ఆశాకేంద్రాలే
దిగజారిపోతున్నా దిగులుచెందం
చరిత్రగతిని తిరుగదోడం
మానవ ఇతిహాస్యంకోసం చివరికంటా
పోరాడుతాం

[సెప్టెంబర్ 9 మావో ఐదో వర్థంతి]

అంకితం

గుడిహాళం రఘునాథం

అందాల కోసం
రంగు రంగుల దృశ్యాలకోసం
నీ ఎదుటిగోడపై బొమ్మల్లో
లలిత లలితంగా కదిలే తటాకాల కోసం
కెరటాల మధ్య పరుగెత్తే గుర్రాల కోసం
తొక్కిసలాడే కన్ను!?

ఇంకా ఎంతకాలమెంతకాలం జ్వాలకాలేని బతుకు ?
మంచు బూట్లతో చలికాలం నడుస్తున్నప్పుడూ
వేయికళ్ళతో - వర్షం
కిటికీలోంచి తొంగిచూస్తూ జారుతూ తొంగిచూస్తూన్నప్పుడూ
బ్రాందీనీ, విస్కీనీ, బీరుబుడ్లనీ
పిల్చి
హాయిగా, సుందరస్వప్నంలా ఊగే 'మత్తుదెబ్బై'
ఇంకా ఎంతకాలమెంత కాలం ?
రా, అన్నా, రా !
ఇల్లొదలి, బారొదలి
తడి తడి వెన్నెలల చంద్రబింబాల్నొదలి
ఆశల భ్రమల్నొదలి
సాయంత్రాల్ని కార్చుకొనే ఆదివారాల్నొదలి
మురికి మురికి ఆకాశాల్నొదలి
విరిగి విరిగి పడుతున్న వచన కవిత్వాల్నొదలి
రా, భాయీ, రా !!
మన సముద్రంలో కలుద్దాం
మన సముద్రం- కోపంలో కలుద్దాం
మన సముద్రం- పగలో కలుద్దాం
తరతరాలుగా మన మేధావులు చేసిన వంచనకి
మనం పడే పశ్చాత్తాపంలో కలుద్దాం
జనాల్లో అల్లుకుంటున్న గహనాటవుల్లో కలుద్దాం
రా, తమ్మీ, రా ! రా !!
మనమూ గడ్డకట్టక ముందే
ఆ సముద్రందాకా ప్రవహిద్దాం
ఇక విరామమేవిఁటి ! విశ్రాంతేవిఁటి !!
జ్వాలా సముద్రంలో హోరర్పంటూ ఉండదురా పిచ్చాడా !
ఒక్కసారి మన సముద్రంలో పడ్డామా
మంటల కెరటాలమై కదలాల్సిందే
దిగంతాల్దాకా !
అనంతాల్దాకా !!

['భారతి సౌజన్యంతో']

ఏందిరో

వంగపండు

ఏందిరో - ఓ రేందిరో !
నువ్వొల్లకుంద వేందిరో-
రన్నాకూలోడా !
నువుకచ్చగట్టి కదలరో -
రన్నారైతోడ ॥ఏందిరో॥

ఎండతగులు - తున్నదన్న
ఎండతగులు తున్నాది
కొండ పగల కున్నదన్న
కొండ పగల కున్నాది
అది నల్లరాయి కొండ
నీవల్ల గాని కొండ
గునపాము జొరని కొండ
అది గుమ్మ, గుమ్మల కొండ
ఆ కొండ పగల గొటెందుకు
తిండిలేదు కడుపునింద ॥ఏందిరో॥

కారు మరగకున్నదమ్మ
కారు మరగకున్నాది
కారు కదలకున్నదమ్మ
కారు కదలకున్నాది
అది కాంట్రాక్టరు కారు
భలే ఖరీదైన కారు
తగ్గింది దాని జోరు
పిరెత్రి నాడు సారు
ఆడు బారుకెళ్ళు కెల్లాలని
ఒక్కలాగ - ఎక్కుతుండు ॥ఏందిరో॥

ధూలి రేగుతున్నదన్న
ధూలి రేగుతున్నాది
(కూ)స్కూటరెల్ల కున్నదన్న
(కూ)స్కూటరెల్ల కున్నాది
ఆస్కూట రెక్కినోడు
కాలేజి జీతగాడు
సూటేసు కొచ్చినాడు
బూటేసు కొచ్చినాడు
ఆడూ సినిమ టిక్కటు తియాలని
దూలి దులిపి తిడతండూ ॥ఏందిరో॥

రాలు తగులుతున్నయమ్మ
రాలు తగులుతున్నాయి
'లారి'నడుపు తున్నదమ్మ
'లారి'నడుపుతున్నాడు
అది షావుకారి లారి
సామాన్లు దెచ్చిన లారి
ఆ బ్యాంకులోను దూరి
దాసింది డబ్బురోరి
సిమ్మతున్న మీనెత్తురు
సెక్కుబుక్కు జేసుకుండు ॥ఏందిరో॥

దారిలేని బతుకు కల్ల
ధైర్యమొక్కటున్నాది
పేతగాని మనిషి కల్ల
సంఘమొక్కటున్నాది
ధూలల్ల దూపమేసి !
ఎండల్ల ఎరుపుజేసి !
కొండల్ల కాపుకాసి !
రాలల్ల కుప్పబోసి !
ఆ రాజ్యమల్ల మారెదాక
రగులుకొండి - భగ భగమని

ఈ పాట జెముకల వాడు పాడిన "కాటికెళ్టుకున్నదమ్మ కాటికెళ్టుకున్నాది" అనే 'బాని'గల పాటని ఆదారంగా రాసిన పాట-

ఎవరేమన్నారు ?

భూపాల్

ఏమన్నారు ఏమన్నారు పెంద్రుడ – నీ
న్నెవరేమన్నారయ్యా పెంద్రుడా ? ॥ఏమన్నారు॥

కుసుమ పువ్వు మనసునీది పెంద్రుడ – నువు
కుమిలి కుమిలి ఏడ్వకోయి పెంద్రుడ
ఇంద్రవెల్లిలోన గాలి పెంద్రుడ – నువ్
గాయపడగ జూసినావ పెంద్రుడ ॥ఏమన్నారు॥

నెత్తురు కొంతూకె పోంది పెంద్రుడా – ఏ
తల్లిగనదు పసిపాపను పెంద్రుడా
వెక్కివెక్కి ఏడ్వకయ్య పెంద్రుడ – పగ
వానెక్కిరించ నీయకోయి పెంద్రుడ ॥ఏమన్నారు॥

ఈ గోండుల త్యాగమంటె పెంద్రుడ – అది
నీ శిరసున తురాయోయి పెంద్రుడా !
ఉల్లిపువ్వు నవ్వునీది పెంద్రుడ – నువ్
ఉలికి ఉలికి పడకయ్యా పెంద్రుడా ! ॥ఏమన్నారు॥

ఆ పారిన నెత్తురులో పెంద్రుడా – ఏ
రాకాసుల అడుగులోయి పెంద్రుడా !
పేదగుండె లవిపిపోయి పెంద్రుడా – నీ
ఎన్నె లెర్ర బారెననా పెంద్రుడా ॥ఏమన్నారు॥

నీ గిరిజన బతుకులపై పెంద్రుడా ! – ఏ
గరకపోన విషంగక్కె పెంద్రుడా !
జువ్విపువ్వు నవ్వునీది పెంద్రుడ – నువు
నీ వాళ్ళను ఓదార్చవ పెంద్రుడా ! ॥ఏమన్నారు॥

మల్లెపువ్వు మనసునీది పెంద్రుడ – నువు
తుళ్లి తుళ్లి ఏడ్వకోయి పెంద్రుడా !
మా కసి ఇక మాసిపోదు పెంద్రుడా ! – ఇది
ఆరిపోని అగ్గిధార పెంద్రుడా !
ఏడ్వకోయి ఏడ్వకోయి పెంద్రుడ – మరి
ఏ త్యాగం ఊకెపోదు పెంద్రుడా ! ॥ఏడ్వకోయి॥

సమ్మె

కార్మిక

రెండవషిఫ్టు కార్మికులు గుంపులు గుంపులుగా పనిలోకి పోతున్నారు. నెత్తి మీద టోపి, ఓ చేతిలో చమ్మాసు మరోచేతిలో తట్టలతో నీరసంగా నడిచి వచ్చేవారు కొందరైతె డ్యూటికిలేటు అయిందేమోనన్న తొందరలో ఆదరాబాదరాగా నడిచి వచ్చేవాళ్ళు మరికొందరు. సైకిళ్ళున్నవారు రివ్వున బావిమీదికి దూసుకపోతున్నారు లైటు ఆఫీసుముందు లైటుతీసుకోవటంలో తొందరపడేవాళ్ళు మరికొందరు.

అలా బావిమీదికి చేరిన కార్మికులు గుంపులు గుంపులుగా చీకటి గుహలాంటి మ్యాన్‌వేగేటుముందాగి పోయిండ్లు.

"ఈ షిఫ్టుసుత లెఆపు ఉంటుందంటవా" పక్కనేఉన్న కార్మికున్ని అడిగాడు రాజం.

"మనువు నిత్తెంలేదు మా అవ్వను ఏకులురాట్నం దెమ్మన్నట్టున్నది పని వరస. ఎమ్మొ బాయిమీద ఎమన్నాబోర్డు ఏసిండ్లా" కారుతున్న ముఖంమీదిచమటను రుమాలుతో తుడుచుకుంట జవాబిచ్చిండు వెంకటేశం.

"మొదటిషిఫ్టులో కరెంటులేక లేఆపుయిచ్చిండ్లు యిప్పుడెందుకుంటది కరంటు బుగ్గలెలుగుతున్నయిగదా !" కాసిం చేతిలోనిచుట్టను గట్టిగా ఆకరిదమ్ములాగి బుస బుస పొగవదులుతూ అన్నాడు.

ఎండ లగాయించికొడ్తాంది. రొప్పుతు గునుస్తు మ్యాన్‌వేగేటు హాజరుచెప్పి వచ్చి నిలుచున్న గ్యాంగోళ్ళను పిలిచి వర్కు డిస్ట్రిబూషన్ చేసెందుకు ఒక్కొక గ్యాంగువాళ్ళనె పిలుస్తాండు వోవరుమెన్ జోషయ్య కానీ కార్మికులు గా వోవర్‌మెన్ మాటలు యింటున్నట్టులేదు.

గప్పుడె వచ్చిన మల్లయ్య సైకిల్‌ను షెడ్డులోపెట్టి గబ గబా కార్మికులముందు కొచ్చి రేగిన జుట్టును వెనక్కితోస్తు ఎండిపోయిన ముఖంలో పొడుచుకొచ్చిన ఎముకలు వికృతంగా కదలగా నోరంత ఎల్లబెట్టి "వెంకటయ్యను పోలీసులు పట్టుకపోయిండ్లు" అన్నడు

గామాట గక్కడున్న కార్మికుల దృష్టిని మల్లయ్య దిక్కుతిప్పింది.

"వానవ్వల........ మళ్ళేమి ముంచు కొచ్చిందిరా" వెంకటేశం.

ముసలి కార్మికుడొకడు మొఖమంతా ముడుచుకొని చూసిండు. ఒకరిద్దరు పట్టి పట్టనట్లు చూసిండ్లు. దూరంగా ఉన్నోళ్ళు దగ్గర దగ్గరగా వచ్చిండ్లు.

మల్లయ్య మళ్ళి చెప్పకుంటాపోయిండు "ఇయ్యల పొద్దుగాల ఎంకటయ్య దావఖానకు పోయిండట ....పోయేటాలకు ఏముంది వానవ్వసుప్పనాతి డాక్టర్‌గాడు పిట్ లెటర్ చేతికిచ్చి రేపటినుండి పనిలకు బొమ్మన్నడు...."

మల్లయ్య మాటలకు మధ్యనె ముసలి ముత్యాలు "అదేందిరా వానికి అప్పుడె తగ్గిందా! మొన్ననేగాదు బొగ్గుపెల్లపడి వానికాలు సితలు సితలయ్యింది ... గానొప్పి అప్పుడె తగ్గిందా...." అని గట్టిగానె అన్నడు.

"వాన్ని చెప్పనియి నీవు నోరుమూసుకో ముసలోడా" కసురుకున్నాడు ఎవడో.

"గ పెద్దయ్య అన్నట్టుగానె ఎంకటయ్య అన్నడు అయ్యా నా నొప్పింకా తగ్గ లేదు.... గి నొప్పి గిట్లాపెట్టుకొని పనెట్లా చెయ్యను.... బాంచెను అని బతిమాలిండు కాని గా కోతిమొఖం డాక్టరు దొర గా మాట యినకుంటనే.... నొప్పి తగ్గిందీ లేంది నాకు తెల్వదా పనిచేయకుండా పైసలు దీస్కోను సీకిదో ఎత్తుఅయిపోయింది. బాయిల చిన్న దెబ్బతాకిచ్చుకోను.... దాన్ని మానకుంటా ఎక్కువ చేస్కుంటరు కూసుండి జీతం రావాలనుకుంటరు అని డాక్టరు కసురుకున్నడు.

"గప్పుడు ఎంకటయ్య గట్లంటరు బాంచెను గీకాలు సూడిండ్లి ఎట్లావాసిపోయిందో గీకాలు గిట్లపెట్టుకొని తట్టెత్తుకొని ఎట్లనడవగల్ను దొర" అని కాలెత్తిసూయించిండు.

'నన్ను వొర్రియకు నీవెళ్ళు' అని డాక్టరు కసురుకున్నగాని వాడు అక్కన్నుంచి కదలకుండా గట్లనే నిలుసున్నడు కాలంత నొప్పిపెట్టంగ. డాక్టరుకు కోపమొచ్చి 'పోతవా? పోవా? లేకుంటె మెడలుపట్టి గెట్టించమంటవా?' అని కుర్చీలనుండి లేచి ఎంకటయ్యను దొబ్బుకుంటా వచ్చిండు. ఆ దొబ్బుకు ఎంకటయ్య కూలబడిండు కూలబడ్డోడికి కోపంవచ్చింది.... కోపంలో వాడు "బాయిల పనంటే గాలిపంక కింద కూసోని కలంపట్టుకొని రాసినట్లు అనుకుంటానవా తట్టెత్తుకొని చదాబులనడుసు డంటే.... అప్పట్నించి సూత్తాన, గీ కాలిట్లాపెట్టుకొని పని చేయలేనంటే...." వాడింకా ఏదో వదురతనే ఉన్నడు.

డాక్టరోడు అంతట్ల ప్యూన్నుపిలిచి 'వీన్ని బయటికి తోసే'యన్నడు 'గాప్యూను గాడొచ్చి కిందపడ్డోడి గల్లందుకొని గుంజిండు ఎంకటయ్యకు కోపమొచ్చి చెడామడా తిట్టిండు డాక్టర్ను.

డాక్టరోనికి యింకేమిచెయ్యాలో తోచలే. గబ గబా పోనుకలిపిండు. గంతలకే పోలీసులొచ్చిండ్లు. యింకా దావఖానకు వచ్చినోళ్ళు బీరిపోయి అట్లా సూత్తుండంగనే

ఇన్‌స్పెక్టరు డాక్టరు రూములోకొచ్చి కిందపడున్న ఎంకటయ్యను జబ్బపట్టిలేపి డొక్కలో ఒక పోటుపొడిసిండు. "మాదెర్‌చోత్ డాక్టరుకే ఎదురు తిరుగుతవుబే-నడుపు బంచెత్" అని ఒక్కతోపు తోసెసరికి బొక్కబోర్లపడ్డడు. పడంగనె ముక్కుబెదిరి బొట బొట నెత్తురుకారంగ గల్లనె తన్నుకుంట పోలీసుస్టేషన్‌కు తీస్కపోయిండ్లు ఎంకటయ్యను"

అక్కడ జరిగింది మల్లయ్య చెప్పడం అయిపోంగనే కార్మికుల్లో కలకలం బయలుదేరింది.

అంతవరదాన్క బాయిమొఖంమీదున్న రాలచెట్టునీడలో గుమిగూడిఉన్న కార్మికుల్లోంచి "బాయింకాడ రోజురోజుకు పోలీసోళ్ళజులుం ఎక్కువైపోతాంది." ముఖంజెవురుగడ్డలా చేసుకొని పోశాలన్నడు.

"బాయిలపనంటే మజాకా! బొగ్గుపెళ్ళలు కీళ్ళు కీళ్ళు ఇరువకుంట ముద్దు పెట్టుకుంటయా? ఊరుగాలొకదేడిత్తె పేలాలేరుక బుక్కతన్నడట వెనకటికి ఎవడో; దెబ్బలో దెబ్బలని మనమేడిత్తె పనోపనని కంపినోడు గునత్తడు ఎద్దుపుండు కాకికి ముద్దా" వెంకటేశం చేతులుతిప్పి అసహనంగా అన్నాడు.

"కాకిబటలోల్లకు అదోపనైపోయింది. ఉఁఅన్నా ఉప్పురాయన్న ఉరికత్తండ్లు" కాసిం.

"ఇవ్వాళ ఎంకటయ్య, నిన్న యాకుబ్ రేపు నువ్వోనేనో" రాజం

"నోరుమూసుకోండ్లి. రేపు గుడిసెలకగ్గిబెడ్తరు" భయంభయంగా సూసిండు బీరయ్య.

"ఇంతకూ అనేదేందిరా"

"ఏమంటడు- ఊకుండద్దంటడు"

గిట్లా కార్మికులకు ఎవలకుతోసింది వాల్లనుకుంటాండ్లు, గింతలోకి వోవర్ మెన్ జోషయ్యవచ్చి "మీటింగుబెట్టిండ్లు యింతకుఇవ్వాళ బాయిలదిగేది ఉన్నదా! లేదా?" అని నిర్లిప్తంగా అడిగిండు.

"మేము దిగిన దిగకున్నా మీ మస్టరు మామూలేనాయె.... గీ సంగతెందో తేలెవరకు బాయిలకు దిగేదెలేదు" తెగేసినట్టు జవాబిచ్చిండు వోవర్‌మెన్ పక్కనె ఉన్న కార్మికుడు.

వోవర్ మెన్ మళ్ళీ మాట్లాడకుండా మేనేజరు గదికేసి పరిగెత్తిండు. గట్ల పరిగెత్తినోడు ఎత్తైన గుబురుచెట్లనుదాటి, పూలచెట్లనడమ తెల్లటిబంగ్లాలో అడుగు పెట్టి చల్లటి మేనేజరు రూములోకిపొచ్చి సంగతెందో చెప్పిండు.

బుక్కనిండాపాన్, నున్నటిబట్టతల, పల్చగా అతికించినట్టున్న చేతులను ఊపుకుంటా బాయికాడికి వచ్చిండుదొర. మిగతా వోవరుమెన్లు, సర్దార్లు మేనేజరు చుట్టు గుమికూడిండ్లు.

"పిట్టలదొరత్తండు... సంగతేందో అరుసుకోండ్లెహె" ? మందిలకెల్లి ఎవడో అన్నడు.

మేనేజరుచుట్టు గుమికూడిండ్లు కార్మికులు.

నల్లటి కార్మికుల్లో తెల్లటిబట్టల్లోదొర, నోట్లో ఊరినఉమ్మిని తుపుక్కున ఉంచిండు. ఊంచిననోరును వయ్యారంగా వేలితో తుడుచుకుంటు "ఏమిటీ? ఏమైంది ? వాట్ హాపెండ్" దొర.

దానికి జవాబుగా బక్కపల్చటి రంజాన్ "దెబ్బ రిపోర్టులోఉన్న ఎంకటయ్యను యివ్వాళ దావఖాన్ల ఎందుకు అరెస్టు చేసిండ్లు" అడిగిండు.

మేనేజరు ఆ కార్మికున్ని అప్పుడే చూస్తున్నట్టు పరీక్షగా పట్టిపట్టి చూసుకుంటా "ఏమో- ఎందుకో ? అయినా దానికి పన్లోకి పోకపోవటానికి సంబంధమేమిటి ? మీరు పన్లోకిపొండి ఆ తరువాత విషయమేందో నేను తెలుసుకుంటా.

"మాకేమి సంబంధము లేదు.... బాయిల దిగెందుకు తంతెలు కొట్టించమంటె కొట్టించరు.... తప్పెత్తుకొని జారి బొక్కబొర్ల పడితె మీకేమి సంబంధము లేదు. గాలి సప్లయిలేక వర్కింగ్‌స్పాట్‌లో ఊపిరి ఆడక కొంకర్లుపోతే మీకేమి సంబంధము లేదు.... తాగెందుకు కూడ గుక్కెడునీళ్ళు సప్లయి చెయ్యరు.... గొంతు పిడ్చగట్టుక పోయి తెల్లగుడ్లు ఏత్తె మీకేమి సంబంధము లేదు.... కుక్కిన పేనులా పడుండక ఇదేందని అడుగుతే మీకేమి సంబంధము మీరు మాత్రము పన్లోకి పొమ్మంటరు.... మీఅటువంటి ప్రాణాలు మావికావా మేం మాత్రం మనుషులం కామా ?" రాజం

మేనేజరు బట్టతలమీద చెమటూరింది. ఎర్రటి ముఖంలో నెత్తురు పేరింది కండ్లు చిట్లించుకొని దొర కోపంగా ఏదో అనబోయినోడు ఎదురుగా సూపర్‌డెంట్ దొర తెల్లటి కారు అగుపడంగనే పెద్దొర కెదురెళ్ళిండు.

సూపర్‌డెంట్ (SME దొర) దొర తెల్లటికార్లో వయ్యారంగా దిగిండు.... చేతిలో ఎప్పుడు వెలిగే సిగరెట్టును గట్టిగా పెదాల మధ్య యిరికించుకొని ముక్కులకేలి, మూతిలకేలి పొగవదులుకుంట కార్మికులకేసి నడిచిండు.

వచ్చె పెద్దొరను జూసి అటు యిటు దారిచ్చిండ్లు మేనేజరు, వోవరుమెన్లు సర్దార్లు. వచ్చిన పెద్దొర మళ్ళి గదే మాటన్నడు. "వాటుహాపెండ్"

మేనేజరు ఏదో ఇంగ్లీసులో చెప్పిండు. అది అర్థంకాని కార్మికుడు అదే విష యాన్ని మళ్ళి చెప్పిండు.

"నాకు అ విషయం తెల్సు డాక్టరును యిష్టమొచ్చినట్టుతిట్టి కొట్టబోతే అరెష్టు చేయించడా ?" పెద్దొర.

"మొగన్ని కొట్టి మొత్తుకున్నట్టున్నది పనివరుస. చాతకాక మావోడుంటే వాడె డాక్టర్ను కొట్టబోయిండా ? అక్కడ చూసినోళ్ళు లేరా ?.... వెంకటేశం.

"ఉత్తుత్తగ ఎవడుతిట్టడు" వోశాలు.

"దెబ్బపూరగా తగ్గలేదాయే.... పిట్‌చేస్తిరి.... గిదేందని వాడు అడిగినందుకే అరెష్టు చేయిస్తిరి" పుల్లయ్య

పెద్దొర మొఖం ముడ్తలుపడ్డది. ముడ్తలుపడ్డ మొఖం ఎర్రబడ్డది. ఎర్రబడ్డ ముఖం మీద మరో సిగిరెట్టు ఎలిగించి ఫ్యాక్టరి గొట్టంలా పొగవదిలిండు.

"అదేమన్నా బాయిమీద జరిగిందా ? చిన్నదానికి పెద్దదానికి బాయి బందు పెట్టుడు బాగా అలవాటయింది" పెద్దొర చిరుబురులాడ్తు అన్నడు.

"బయటేంది.... దావఖాన కంపినిదికాదా ? వాడు బాయిల పన్జేస్తలేదా కంపినికి సంబంధము లేకుండా బయటేదో జరిగితే కంపినిలో డిస్మిస్‌లు చేస్తరు.... దావఖాన్ల జరిగిందానికి మీకు సంబంధము లేదంటరు.... మీ ఇష్టరాజ్యంగా నడిపిస్తాండ్లు" కాసిం కోపంతో అన్నడు.

"అయినా మావోనికి తగ్గకుండానే పిట్ఎందుకు చేసిండ్లు" రంజాన్

"ఆ విషయంమేందో డాక్టరుకు తెలియాలి" పెద్దొర

"ఆఁ చాల రోజులైతే దెబ్బపైసలు యియాల్సివత్తది అందుకని దెబ్బమాన కుండానే పిట్ చేయించి ఉంటరు" చలపతి.

"అది కంపినోళ్ళకు బాగాఅలవాటేనాయే" కాసిం.

"అందుకేకావచ్చు వాన్ని అట్ల పిట్‌చేసిఉంటరు" రాజం.

పెద్దొర తల తిరిగిపోతాంది. ఆగకుండా పొగతాగుతాండుదొర. దొర పక్కనున్న వెలిఫేర్ ఆఫీసరు తనపూచిన పెదవులనిప్పి కార్మికులకు ఏదో నచ్చజెప్పబోయినోడు మళ్ళెందుకో నోరు దగ్గరపెట్టుకున్నడు. ఆఖరికి పెద్దొర "ఇంతకుమీరివ్వాళ బాయిలకు దిగుతారా ? లేదా ? " అడిగిండు కోపంగా.

గా మాటకు టక్కున జవాబిచ్చిండు రంజాన్ "మావోన్ని ఇడిపిస్తరా లేదా?" అని.

"అది నాచేతిలోలేదు- ఆ విషయము గురించి డాక్టర్ను తెల్సుకొని విడిపించేందుకు ప్రియత్నము చేస్తగాని మీరు ముందుపన్లోకి దిగండి" పెద్దొర శాంతాన్ని తెచ్చుకొని మాట్లాడిండు.

"సత్తాంనాప్రి బాంచెనుఅంటె చెప్పులపోగులకు ఏడ్చినట్టున్నది. ఆ యిడిపించుడు సంగతేందో ఈయన చేతిలోలేదంటా మీరుమాత్రం పన్లోకి దిగంటాండు. ఈనకు తెల్వకుంటేపోయి ఆ డాక్టర్నే అడుగుతం పదండెహే" వెంకటేశం.

"ఎంకటయ్యను ఇడిపించుకొని వచ్చేంతవరకు ఎవరు పన్లోకి పోయేదిలేదు. ఊకుంటే ఊరందర్ని అరెస్టుచేత్తరు" ముసలి జకరయ్య.

"పాండ్లెహే పాండ్లి" మందిలోనుండి ఎవరో అరిచిండు.

కార్మికులు అట్ల డ్యూటికిపోకుండనే నిలబడ్డోళ్ళు నిలబడ్డట్టుగనె కదిలిండ్లు చేతిలో చమ్మాసులు, తట్టలు చేతిలో అట్లగనెఉన్నాయి. పైన సూర్యుడు నిప్పులు చెరుగుతాండు.

"ఇదంత ఏందో గందరగోళంగానేఉంది" బక్కయ్య మందిలో కదిలిపోతూనే అన్నడు.

'ఎవలో ఒకలిద్దరుపోయి అడుగుతేపోలే అందరెందుకని' బీరయ్య జవాబిచ్చిండు.

"గిట్లనె నీకైతే నువ్వేమిచెద్దువురా- గిమాటేఅంటవా" ముసలిజకరయ్య బొక్కనోరెళ్ళబెట్టి అడిగాడు.

బీరయ్య మారుమాటడలేదు.

యూనియన్లతిరిగే రాజయ్య "లీడరోనితోని చెప్పుతేసరి వాళ్ళేచూసుకుంటరు, గింతదాన్కి గంతదాన్కి పనెందుకు బందుపెట్టాలె"

"చూసెటోళ్ళయితె ముందేసూద్దురు చందాలకైతే ముందుకొత్తరుగాని మనసమస్యల గురించి మనమడగందే ముందుకొత్తండ్లా.... అదైనా బాయిబందు అయ్యేట్లున్నదంటే

మనదగ్గరికీవచ్చి మాయమాటలుచెప్పి బాయిలదించి గుట్టుసప్పుడుకొకుండా మల్లమొఖం చాటుచేసుకొంటాండ్లు మొన్నటి బందుసంగతేమైందిసారు అంటె ఇగ్గొకన్నులేషన్ల పెట్టినం లేబరాపీసరొత్తాండు. అయిపోద్ది అయిపోద్దంటడు కాని అయ్యేడలేదు బొచ్చ పొయ్యేదిలేదు" రాజం రుసరుసలాడ్తు.

అంతల్లకే యూనియన్ లీడరు పిట్ (బావి) సెక్రెటరి అలీ వచ్చిండు. వచ్చినోడు కార్మికులముందుకెళ్ళి "కామ్రేడ్స్ మీరు ఆవేశపడకండి సంగతేందో నేను తెల్సుకుంటా ఎంకటయ్యను పోలీసులనుండి విడిపిచ్చుకొచ్చే పూచీనాది- కామ్రేడ్స్ దయచేసి మీరంతా పన్లోకి ఎల్లండి.

తెల్లబట్టల కమ్యూనిష్టు లీడరు మాటకు అడ్డొచ్చిన కార్మికుడు "గీ మాయ మాటలు సాలులేవయ్యా పోయినసారి ఖాళీటబ్బుల సప్లయి సరిగాలేదని లాడీసోళ్ళు సమ్మెచేస్తే.... సమ్మెమీరే చేయించిండ్లని యిద్దరు కార్మికులకు డిస్మిసల్ చార్జిషీటు లిస్తె మళ్ళీ సమ్మెఅయితె గప్పుడొచ్చి గిదెమాటన్నరు వాళ్ళకు ఏమి కాదు....కాకుండా సూశేపూచి నాది అన్నవు.... గప్పుడు నీ మాటమీదికెల్లి బాయి నడిచింది.... డిస్మిసల్ లెటరు యిచ్చినోళ్ళిద్దర్ని కంపినోడు ఊడబీకిండు గప్పుడు నీ మాటలన్నీ ఏమైపోయే మళ్ళొచ్చి గదే పాతపాటే పాడుతానావు...." చేతులు తిప్పుతు కొండయ్య లీడరు ముందుకుపోయి అన్నడు.

ఆ మాటలకు లీడరు అలీ అదిరిపోలే "శాంతించండి సోదరులారా.... ఆవేశపడకండి గతం ఏం జరిగిందో జరిగింది.... ఇప్పుడు నాతోటి నలుగురువెరాండ్లి మీముందే పోయి ఎంకటయ్యను నేను జమానతు యిచ్చి ఇడుపించుకొస్త" పరమశాంతంగా అన్నడు అలీ.

"వాడేమైనా లంజతనం చేసిండా.... దొంగతనం చేసిండా జమానతుయిచ్చి యిడిపించుక రావటానికి బేషరతుగా విడిచిపెట్టాల్సిందే...." వెంకటేశం....

"అయినా మేము నల్గురం వచ్చినంత నీవు విడిపించెదేంటి అపని మాకు చేత కాదా" మల్లయ్య.

యూనియన్ లీడర్ అలీ ఇప్పుడేమి పరిస్థితి బాగలేదనుకున్నడు మనసులోనే. యిప్పుడు రెండడుగులు వెనక్కి-వేస్తెనే మంచిదనుకున్నడు- అట్ల అనుకున్నోడు కార్మికులమీద అలిగిపోతున్నట్టుగా "సరె మీ యిష్టమొచ్చినట్లు చేసుకోండ్లి, చెప్పితే వినకుంటాపోతాండ్లు ఈ దుడుకుమోతుతనం ఎన్నాళ్ళుంటదో చూద్దం"అని వెనక్కి తగ్గిండు.

"చూస్కో బాగాచూస్కో" ఎనకనుండెవడో వ్యంగ్యంగా అరిచిండు.

కార్మికులు హాస్పటల్‌వైపు దారితీసిండ్లు యూనియన్‌లీడరు గుడ్లప్పగించి సూత్తాఉండిపోయి మనసులోనె గునుసుకుంట "చెడిపోయిండ్లు ఎవనిమాటింటలేరు. చూసినావు ఆ మాట్లాడెటోల్లందర్ని అంతా రాడికలోల్లు- ఉత్పృతగలబెట్టి ప్యాలాలు ఏపుకబుక్కుతరు- మొన్న ఏంజరిగింది ఇంద్రవెల్లిలో గిట్లనే గోండోల్లను ఎగదోసిండ్లు వాళ్ళ 60 మంది సచ్చిండ్లు- ఒక్క రాడికలోడుసచ్చిండా- వీళ్ళంట ఏదో విప్లవంతెస్తరంటా విప్లవం- ఒక్కొక్కన్ని బొక్కలిర్గ టానలేసి తంతెతెల్వద్ది. మేముచేసినం ఎనకట తుపాకిబట్టి నిజామోనికి వ్యతిరేకంగా కాని మేంగిట్ల చెయ్యలేదు" యింకా ఏదో చెపుతనేఉన్నడు లీడరు సుట్టుగుమికూడిన ఇద్దరు ముగ్గిరితోని

సూపర్‌డెంట్ దొర ఆపీసురూములో కంగారుగా పోనెత్తిండు. పోలీసుస్టేషన్‌కు పోను చేసేందుకు.

మార్కెటుకుపోయే రోడ్డుమీన కంపిని కట్టించిన స్కూలుంది. స్కూలు గ్రౌండ్లో పిల్లలు ఆడుకుంటున్నరు. గా ఆడుకునే పిల్లల్లోగాని, గాస్కూల్లో చదువుకునే పిల్లల్లోగాని ఒక లేబరు పొల్లగాడు చదువుకుంటలేడు. అంతా కంపిని దొరల పిల్లలే.... వాళ్ళ పిల్లలకె సీట్లులేవాయే మరింక లేబరోళ్ళ పిల్లగాల్ల కెట్లుంటది. గాస్కూలు పక్కనే కంపిని కట్టించిన వెంకటేశ్వరాలయముంది.... పకడ్బందిగా గందులో దుపతి ఎంకన్న బొమ్ముంది.... జీతంమీద ఓ పూజార్ని కూడ పెట్టింది కంపిని.... గా గుళ్ళెకు కూడ లేబరోళ్ళు ఎవరుపోరు అదంత దొరలకే.... గా గుడినానుకొని పెద్దగా పూలతోటున్నది గా తోటను చూసేందుకు ఇద్దరు కూలోల్లున్నరు గుడి కంపౌండు చాల పెద్దది గా కంపౌండ్ల రెండువ్యాన్ల పోలీసులున్నరు. గా పోలీసోళ్ళు వచ్చెలేబరొళ్ళను చూసిండ్లు తుపాకులు లాటీలు సరిచేసుకుంటాండ్లు. గా గుడి కెదురుగా హాస్పటల్ ఉంది.

గక్కడున్న ఇద్దరు ఎస్ ఐలు తమ బలగాలకేసి మర్రి మర్రి చూసుకుంటాండ్లు మాటి మాటికి.... పోలీసోళ్ళ పైఆపీసరు మూతిలకేసి సూత్తాండ్లు ఎప్పుడు ఏ అర్డరు వత్తదేమోనని.

గంతమంది పోలీసోళ్ళున్నా గాలేబరోళ్ళు బయపడ్డట్టులేదు. చేతిలో చెమ్మాసు తట్టలు, నెత్తినటోపి బొగ్గుపట్టిన బట్టలతోని హాస్పటలుగేటు ముందు కొచ్చిండ్లు.

గేటుకు అడ్డంగా పోలీసులున్నరు వాళ్ళముందట ఇన్‌స్పెక్టరున్నడు "ఎవరు లోపలికి పోయేదిలేదు" "ఎందుకు" మందిమాట్లాడిండ్లు.

"ఇక్కడ ఎవరుండద్దు" బాగాబలిసిన మొఖంలో కండరాలన్నీ కదలంగా అరిచిండు యస్ ఐ.

"మేము డక్టర్ని కలువాలి" శాంతంగా ఖచ్చితంగా అన్నడు రంజాన్.

"కల్వెందుకు వీల్లేదు" యస్ ఐ

మీరెవ్వరు మమ్మల్నిఆపెందుకు ? ఎండిపోయిన రొంబచ్చె ముందుకుబెట్టి అడిగిండు బంగారయ్య.

వాలిపోయిన మీసాలు లోతైనకన్నుల కార్మికుడు ముందుకొచ్చి "మేము డాక్టర్నుకల్సి మా ఎంకటయ్యను ఎందుకు అరెస్టు చేయించిండో తెలుసుకోవాలి" దృఢంగాఅన్నాడు.

"మీరెవ్వరు డాక్టర్ను కల్సుకోవడానికి వీల్లేదు మర్యాదగ యిక్కన్నుంచి వెళ్ళిపోండి" యస్ ఐ.

సంగతేందో తెలుసుకునేంతవరకు ఇక్కడనుంచి కదిలేదిలేదు ఎనకనుంచి ఎవరో అన్నరు.

"పోలీసులజులుం నశించాలి" ఆవేశంగా అరిచిండొకడు. వందలగొంతులు వంతపాడాయి— చేతిలో చమ్మాసులతో, నెత్తినటోపీలతో ఆవేశంగాఅరుస్తున్న కార్మికులను చూచేసరికి పోలీసుల్లో కొంతభయం పుట్టుకొచ్చింది.

చివరికి యస్ ఐ "సరె డాక్టర్ను యింతమందిపోయి కలుస్తామంటె కుదరదు మీలో ఓ యిద్దరురండి వాళ్ళపేర్లుచెప్పి పోయి డాక్టర్నుకల్సి మాట్లాడవచ్చు" రాజీ ధోరణిలో అన్నాడు.

"పేర్లెందుకు వాళ్ళనుకూడ అరెస్టుచేసెందుకా" రంజాన్.

"అల అయితే అందరిపేర్లు రాసుకొమ్మను" యింకొకడు.

"అందరైతే కుదరదు" ఎస్ ఐ

"మా పేర్లు కావాలంటే పోయి బాయిమీదడుగు వాళ్ళె చెప్తతరు"

మరికాసేపు వాదులాట

కార్మికుల్లో ఆవేశం పెరుగుతుంది— పోలీసుల్లో భయం పెరుగుతుంది.

కార్మికుల వివాదాలు ఎక్కువ అవుతున్నాయి

పరిస్థితి చేయిదాటెట్టుందని ఎస్ ఐ "సరె మీలో నలుగురుపోయి డాక్టర్ను కల్సిరండి పేర్లు చెప్పాల్సిన అవసరములేదు"

కార్మికులు అందుకు సమ్మతించారు.

నలుగురు కార్మికులు డాక్టరు రూములోకి వెళ్ళారు. డాక్టరు మొఖంలో కత్తి వాటుకు నెత్తురుచుక్క లేదు. కార్మికులతోపాటు పోలీసులు కూడ డాక్టరు రూములోకి వచ్చారు. ఆ నలుగురి కార్మికులచుట్టు వలయాకారంలో పోలీసులు ఆయుధాలపై చేతులు నిలుపుకొని నిలుచున్నారు.

కార్మికుడు : ఎంకటయ్యను ఎందుకు అరెస్టు చేయించిండ్లు

"ఫిట్ లెటర్ యిస్తే తీసుకోకుండా బండబూతులు తిట్టాడు...." డాక్టరు.

వట్టిగానే మావోడు ఎందుకు తిడుతడు మేమెంతో కోపంతోని వచ్చినం గాని ఏమన్నా తిడుతానమా

"అయినా అప్పుడు చూసినోడు ఇగ్గొయిక్కన్నే ఉన్నడు వాన్ని అడుగరాదు ఏం జరిగిందో చెప్తడు"

మల్లయ్య చెప్పడానికి పెదవులు కదిపిండు కాని డాక్టరు మధ్యలోనే "అతనేంటి చెప్పేది నేనే చెపుతాను పేషంట్సు గొడవలో నేనుంటే అతను ఫిట్ లెటరు తీసుకోకుండా అల్లరిపెట్టాడు."

"వానికి తగ్గకుండానే ఫిట్ ఎందుకు చేసినవ్" కార్మికుడు.

తగ్గినదిలేనిది మాకు తెల్వదా. దెబ్బ మానకుండా యింకా పెద్దది చేసుకొని ఇంటి వద్దనే జీతం తీసుకోవాలని చూస్తున్నారు అందుకే ఫిట్ చేసినం డాక్టరు.

ఎవ్వనికైనా దెబ్బమానాలని సూత్తరుగాని నువ్వయితెగట్లనే చేత్తవా కార్మికుడు "ఎందుకు చేసుకోరు మస్తుగాచేసుకుంటరు" ఒక పోలీసోడు మధ్యలో జోక్యం చేసుకొని మాట్లాడిండు.

"మీరు చెసుకుంటరు గావచ్చు పనిచేసుకుంటెనే బ్రతికెటోళ్ళం ఒకళ్ళ ముంచి తినెటొళ్ళం కాదు పందుల్లాగా...."

"మర్యాదగ మాట్లాడు" లావాటి మెడను ఆకార్మికునిపై పులిప్పి అన్నడు ఎస్ఐ

మా జోలి మీరు రాకుంటే మీ జోలికి మేమెందుకు వస్తము డాక్టరుతో మేము మాట్లాడుతుంటె మధ్య మీరెంది కలిపించుకొంటరు కార్మికుడు

ఇవన్ని మాటలెందుకు అరెస్టు చెయించినోడవి మళ్ళా ఇడిపిస్తవా లేదా? మల్లయ్య సూటిగా అడిగిండు డాక్టర్ని

డాక్టరు "నాచేతిలో ఏముంది."

"అరెస్టు చేయించటము మాత్రం చేతనవును కాని విడిపించటము మాత్రం కాదు" కార్మికుడు.

"ఏం.... ఇక్కడ జబర్దస్తీ చేయటానికి వచ్చినావ్రా అడిగిపోవటానికి వచ్చినావ్రా" గురుర్రుగా అన్నాడు ఎస్ ఐ

"జబర్దస్తీ చేస్తున్నది ఎవరో తెలుస్త లేదా పోలీసులు ఉన్నరని నీ ఇష్టమొచ్చినట్టు చేస్తె నడుస్తది అనుకోకు పోలీసులు గాని వాళ్ళ జేజమ్మలు కాని ఏంచేయలేరు.... రెపటి వరకు మావోడు ఒకవేళబయటికి రాకుంటే.... జరిగెపరిణామానికి మీరె బాధ్యతవహించాల్సి ఉంటుంది జాగ్రత్త...."

ఆ కార్మికుని దృఢమైన మాటలకు ఒకక్షణం డాక్టరు, యస్ ఐ ఇద్దరు నిశ్చేష్టులైనారు స్థాణువుల్లా- వెళ్ళిపోతున్న కార్మికులకేసి చూస్తుండిపోయారు ఒక్క-క్షణం.

ఆ తరువాత కార్మికులంతా ఇండ్లలోకిపోయారు. ఆరోజు నైటుషిఫ్టుకూడ సమ్మెజరిగింది.

* * * *

రెండవరోజు ఫస్టుషిఫ్టులోకి పోతున్న కార్మికులు మ్యాన్‌వే ఆఫీసుకాడ హాజరు వేసుకొని వచ్చిన కార్మికులకు నోటీసు బోర్డుమీద అంటించిన కొత్తనోటీసులకాడ గుమికూడారు.

"బోర్డుమీద ఏవోకాగితాలు అంటేసిండ్లు ఏందట" లబ్బపెదవులు అదురుతుండగా అడిగిండో కార్మికుడు.

"ఏమో ! సదివేటోళ్ళు ఎవరో బాగాసదువుండ్లి" అన్నడు ఇంకోకార్మికుడు.

అంతలోకె సైంటుతొడుక్కున్న కార్మికుడు 'నేసదువుతానుండు' అంటు ముందుకొచ్చిండు.

"ఇంతకు ఎంకటయ్యను వదిలిపెట్టిండ్లా" అడిగిండో కార్మికుడు పక్క-నున్న అతనితో-

"రాత్రేవదిలిపెట్టిండ్లు"

"డ్యూటీకివచ్చిండా"

ఎక్క-డొచ్చిండు- వానినొప్పింకతగ్గలేదాయె- అప్పుడే వాడేమివస్తడు- ఖింకో సిక్కులోనె ఉంటడు.

అంతలోకే....

యువకార్మికుడు ముందుకొచ్చి నోటీసుబోర్డును బిగ్గరగా చదువుతున్నాడు.

ఇందుమూలంగా కార్మికులకు తెలియజేయడము ఏమనగా నిన్న కార్మికులు చట్టవిరుద్ధమైన సమ్మె చేసినందున కార్మికుల జీతమునుండి 8 మస్టర్ల కోతపెట్టబడును.

ఆ మాటలువిన్న కార్మికుల్లో కలకలం బయలుదేరింది.

నా సర్వీసుల గిటువంటి చట్టంగురించి విన్లేదు ముసలికార్మికుడు.

ఆ పతివత్తైనో ఆగి అడగంది ఎల్లదాయే ఆగి అడుగుతెనో జీతం కోతబెట్టబట్టిరి మల్ల ఎమర్జెన్సీకన్న ఎక్కువే చెలాయించుకోబట్టిరి.

"ఇంక రేపు ఏ ఆపది వచ్చినా కిక్కురుమనకుండా చెయ్యాలె మరి"

"యివ్వాల జీతం కోతంటరు రేపు డిస్మిస్‌లు చేత్తరు ఊకుంటాంటే మేనేజ మెంటోళ్ళు నెత్తిలమీది కెక్కుతాండ్లు.

అంతలోకె జనరల్ మజ్దూరు కార్మికుడొకడు ముందుకొచ్చి ఏమైనా గాని ఈ చట్టానికి వ్యతిరేకంగా ఐక్యంగా మనమంత కల్సిపోరాడవల్సిందే.... ఈ చట్టాలు బూచిపెట్టి మేనేజుమెంటు మనమీదింకా పనిభారం పెంచడమేకాకుండా అణిచివేతకు పూనుకుంది. యూనియన్ వాళ్ళేమో నిన్నటి సమ్మెతో మాకేమి సంబంధములేదని తప్పుకుంటాండ్లు అది కాకుండా మేనేజుమెంటుతో యూనియన్ వాళ్ళు చేసుకున్న విద్రోహపు ఒప్పందమువల్ల వాళ్ళు మేనేజుమెంటుతో కుమ్మక్కయి పోయినారు.... మనమంతా ఒక తాటిమీద ఉండి దీన్ని వ్యతిరేకించాలి. అతను ముగించగానే కార్మికులంతా ఒకపెట్టున నినాదాలు చేసారు.

"మస్టర్లకోత చట్టాన్ని మేనేజుమెంటు విరమించుకోవాలి"

"మేనేజుమెంటు దౌర్జన్యం నశించాలి"

"కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి"

"ట్రేడ్ యూనియన్ల శిఖండిపాత్ర నశించాలి"

మస్టర్లకోత చట్టానికి వ్యతిరేకంగా సమ్మె మొదలయింది.

స్కెచ్ :

మిషిని

ఎన్నారెస్

రాత్రి నైటుజేసినగన్క తెల్లారి కొద్దిగలేటయినా పర్వాలేదు. ఆడికి పొద్దుగాల పది గానేలయితాంది. పనికిబోదామని నేను నా డొక్కు సైకిలెక్కిన.

"పైలెంబిడ్డో! రోడుమీన మోటర్లు బస్సులు." బరువైన ముక్కుచీది గోడకు రాసుకుంట ముడుతబడ్డమూతి కొంచెం పొడుగుబెట్టి బయంజెప్పింది ఇంటిపక్క పెద్దవ్వ.

"ఏ! యేంగాదే మాగబోత." పెద్దవ్వచెప్పిన మాటలినుకుంట సైకిలెక్కసంక యెన్క అంగిసవరిచ్చుకుంట చెప్పిన.

"అగోఅగో పోరడుబచ్చె! నేంజెప్తనేఉంటి. పోరకు గాడ్దికొడుకు ఒక్క కాడుంటెన. అవ్వో! అయింత మన రాయేశడయెపటికె జెప్పనఆపిండు. లేకుంటె ఇయాల పోరన్ది కాలోచెయ్యో యిర్గేదే!" సైకిలుకు అడ్డమచ్చిన ఇంటిపక్క గొల్ల పోరన్ని లేబట్టి మోకాల్లుగిన దులిపి రెక్కబట్టి గుంజుకపోయింది పెద్దవ్వ.

"ఇయ్యాల యాకాశిపండుగ గాదుర. పనికిబోతానవ." మా అక్క పొయిల కట్టెలు గొసుక్కొని రొండుచేతుల్లనింత బిడ్డనెత్తుకున్నట్టు బెట్టుకొని పోవుకుంట అడిగింది. మా ఇంటికి కొద్దిగదూరంల ఉంటది.

"దీనికి బందులేదే. పోతాన" అనుకుంట గేటు కదిలెటాల్లకె మా పెద్దన్న "లసుమని దగ్గెర్నుంచి యేమన్న ఉత్తరమచ్చినాదిర, మరటుమొకాన వానలు వరదలంటాండ్లు. నువ్వన్న వోటి రాయబోయినవ్" అన్నడు. మా పెద్దన్నంటె నాకు చాన బయం. అయినె కనబడితెనె నేను లట్టగువ్వోలె అయిపోత. గందుకనె అన్న నామొకానజూసి మాట్లాడ్తాంటె నేను అయినె పక్కకొంట సూసుకుంట "రాత్త రాత్త" అన్న. మా చిన్నన్న లస్మన్న బీడీల పజ్జెత్తడు. యిగ రోడెక్కిన.

లోయ్‌లోయ్‌మని లొల్లిబెట్టుకుంట ఉశిల్లు పుట్టలకెల్లెల్లినట్టు బడిపిలగాల్లంత పయ్యిలు కాపీలు దొర్కుతలెవ్వని, వచ్చినకాడికి సదువుకునె పుస్తకాలుగూడ అయిపోయినయనిజెప్పి దుకాన్దార్లు బ్లాకుజేత్తాన్రని రోడ్లెంబడి బొండిగెలుబ్బంగ చెయి పిడికిల్లెత్తుకుంట నినాదాలిచ్చుకుంట బోతండ్లు. యెన్కకోపారి ముంగటికోపారి పోలీసోల్ల మోటరు దిరుగుతాంది. రోడంత అగమాగమున్నది. చానసేపు తొవ్వే బందయింది. అటెన్క కొంచెం కొంచెం అటిటుసూసుకుంట మెలెగ రోడుదాటిన.

అది చిన్నసందు. గీ నడుమ అది సిమెంటురోడు అయినకాన్నుంచి ఆటో రిక్షాలు స్కూటర్లు రంయ్యి రంయ్యిన ఒకటేపోతద. పాపం ఆ గల్లీలున్నోళ్లు దిన దిన గండంగ గడుపుతాండ్లు. గండ్లకెల్లి ఒగ ఆటోరిక్షా జోరుగ బోవుకుంట ఓ పెద్ద పందికిబెట్టింది. ఆటోరిక్షాగూడ పట్టుదప్పి ఒగలింటి తొక్కుడుబండకుగుద్ది వాళ్లింటి కద్వెక్కి దర్వాజల ఆగింది. ఓపారి యెనక్కుమర్రిచూసి నాతోవనేంబోయిన.

పల్లె పెద్దరోడచ్చింది. అక్కడ అందరు గుంపుగూడిన్రు. ఇద్దరు కోడెపోరగాండ్లు ఒగనిమీదొకొగడు పైదూల్తాండ్లు. మంది అగబడ్తాండ్లు. అసలు సంగతేందటాంటె. (అప్పటిదాక నిలబడిచూసి పల్లె సైకిలెక్కి నాతోనివచ్చుకుంట ఒగాయినె జెప్పిండు.) రాత్రి గోడలమీన మున్సిపాల్టి ఓట్లోళ్లయి రాసుడుకాడ ఒగలపేరుమీన ఒగలపేరు రాసిండ్లట. గది పంచాతి. ఇడిసిపెడితె పోరగాండ్లు ఉచ్చితార్థంగ ఒగని కొగడు పొడుసుకునేటట్లేవున్నది. యెందుకచ్చిందిదంత. వాడేమన్నబెట్టెనా, వీడేమన్న బెట్టెనా. గొర్రెపోతుల కొట్లాటోల్గున్నది. వాడ్దేంబాయె వీడ్దేంబాయె. నడుమ వీళ్లతల్కాయలె బలిగె. బాగనేవున్నది అనుకుంట పనికిబోయిన.

పనికాడికి బొయ్యేటాల్లకు కొద్దిగంత లేటైఅయింది. పనిమీదికెక్కినట్టేగని ద్యాసంత ఇంటిమీన్నేవున్నది. పో సంటిది ... పదమూడేండ్లుంటయిదానికి. అది చినిగిపోయిన లంగ అవ్వకు జూపెట్టుకుంట నాయినసడుగుమని ఇంట్ల అవ్వతోని పోరుపెడ్తాంది. నేను యినీ యిననట్టుగనేవున్న. పెద్దోనికి తొమ్మిదేండ్లుంటయి వాడు నాకు నాలుగో తరగతి పుస్తకాలంటూ నేలమొఖంబెట్టి కడుపకు కాలురాస్తాండు గల్వాల. నా అయిదుపైసలెవ్వి అని సైకిలుకాడికచ్చి జారిపొయ్యే చెడ్డిని మీదికను కుంట చెయిజాపిన ఆరేండ్ల చిన్నోడు. "ఇంటానవఅన్ని. అయితెమాయెగాని అప్పటికేమన్న పైసలు తెత్తెనె రాత్రికేమన్నజేత్త. లేకపోతె నేనెంతకని బదల్లుదెత్త నాకేమద్దవ్వ ఈ సంసారం. నీ సంసారం నల్లగుండ. వో పొయికిందికిలెవ్, పొయి మీదికిలెవ్వు. పోరగాండ్లలొల్లి. పోరి గప్పెత్తాంది. ఇంట్లజూత్తె గిట్లున్నది. యేమో నవ్వ ఇగ నేనేడనన్నబోత. మీరేవుండుండ్లి. ఈ సంసారం నాతోనిగాదు." అని అది అంటాంటెగూడ నేను యిన్పిచ్చుకోకుంటనే అచ్చిన. గిట్ల అన్ని గునాయించు కుంట మిషినిగొడ్తాన. గదె అచ్చుగొట్టెమిషిని. మంచిగ రుపాడిమీన బోతంది. కాయిదం బెడ్తాన తీత్తాన. పెట్టంగ తెల్లకాయిదం తియ్యంగ అచ్చుకాయిదం. మరి నా బతుకేంది? తెల్లార్తాంది పొద్దుగూకుతాంది. ఎన్నడు బుద్దిదీర మంచిగదిన్నదిలేదు. పొలగాండ్లకు దినిపిచ్చిందిలేదు. రోజురోజుకు ఇంకింత తిప్పలే అయితాందిగని మెరుగైతె అయితలేదు. మరి గిట్లైతెన్నాల్లు? ఇగ మరి మంచిగ బతుకుడులేదా? ఎట్లగావాలె. ఎవలుజేతరు? గిట్ల ఎటుదోత్తె అటు గునాయించుకుంటాన, అంత

రాత్రి నైటుజేత్తిని- కండ్లు మూసుకపొయినట్టయి పెయిదిరిగినట్టయింది- ఇంకే మున్నది, చెయి మిషిన్లబడ్డది- ఒక్కపారే బగ్గుమన్నది- మూతలుబడ్డ కండ్లల్ల జెకముక గొట్టినట్టయింది- "అబ్బా!" అని బాగవొర్రిన- "యేమైందె, యేమైందె రాయెశన్న!" అనుకుంట మా ప్రెస్సుల పనోల్లంత వురికచ్చిండ్లు- మిషిని దిరుగుతనె వున్నది- చెయి గుంజుకొని యేల్లు నోట్లెబెట్టుకున్న- మూడేల్లు కమిలిపొయినయ్- ఒగలచ్చి బెరేకు దీసిండ్లు- ఒగలు మిషిని బందుజేసిండ్లు- ఒగలు తడిగుడ్డదెచ్చిండ్లు- (మా దగ్గెర పట్టేడు బాకసున్నదిగని గండ్లేమిలేదు) యేల్లకుజుట్టిండ్లు- అట్టబట్టుకొని గాలిసురుతాండ్లు- నేను గట్టిగఓర్చుకుంట పండ్లతోని పెదుముకొరుక్కుంట బాదను మింగుతాన- గింతల సేటచ్చి "యేందయ్య యేంది, యేమొ అందరు పనిడిసిపెట్టచ్చి గీడ బాగోతం జూత్తండ్లు! యేంది, గింతంత యేల్లు ఒత్తకపోయినందుకేమొ అందరు పానంబొయినట్టుగనె జమగూడిండ్లు- వీల్లతోని గిదేగోస, తాగచ్చిండొ యేమొ- పోండ్లిపోండ్లి పన్జూసుకోపోండ్లి!" అందర్ని గొర్రెలగెదిమినట్టు గెదుమబోయిండు- "యేందిసేటు, గట్ల మాట్లాడ్తానవ్! తోటోడు మిషిన్లచెయిబడి తండ్లాడ్తాంటె మేము మాకేం దెల్వనట్టుగ చూసుకుంటవుంటమా- మేం మనుషులమె సేటు, యేమొ పురాంగ మమ్ముల గొడ్లకింద జమకట్టబడ్తివి-" కొంరన్న కొద్దిగదైర్నంజేసి మాట్లాడిండు- అందరుగూడ గప్పుడు 'మరికాదా' అన్నట్టుగ సూత్తాండ్లు- ఇంతల నేను వాల్ల మాటలినుకుంట కొద్దిగ కండ్లుదెరిచిన- గీ సేట్లకు యెంతజేసినా ఇమానంలేదు, పనోల్ల పానాలుబోయినా పట్టిచ్చుకోరు- పాపబీతిలేదు వీల్లకు- మనసుల అనుకుంట, కూసున్నోన్ని మెల్లెగలేచి మిషినిబట్టుకొని నిల్సున్న- మిషినిమీదున్న కాయిదాలు జూత్తాన బాదతోనే- గవ్వి పాటలపుస్తకాలయి- ఇదువరకు ఆ పాటలపుస్తకాలు మేమే గొట్టినం- అవ్వి అయిపోయినయట- మల్లగొడ్తానం- దాండ్లపాట మిషిన్ల చెయిబడక ముందు సదువుకుంటనె కొట్టిన, గని గప్పటిదాక గదేందొ దెల్వలె- నేను గిట్ల నా యింటిగురించి గునాయించుకున్నదానికి, గిట్ల వీల్లందరు నా నొప్పిగురించి పట్టిచ్చుకున్నదానికి, సేటును ఎదిరిచ్చి మాట్లాడిందానికి దీనికి యేదో కలిసినట్టనిపిచ్చింది. ఇంక నొప్పివున్నది- అయినా మల్ల మిషిని చాలుజేసి మెల్లెగ నడుపుకుంట మల్లొక్కపారి ఆ పాట సదువుకుంటాన "పొడల పొడల గట్లనడుమ పొడిసెనొక్క సందమామ, కొమిరెల్లి కొండల్లోన ఓ రాజయ్య- కొలిమంటుకున్న జాడరొ ఓ రాజయ్య"- మనసుకు దీరె అనిపిచ్చింది. నిర్సత్తువల బడిపెయిన నాకు మెలెమెల్లెగ యెన్నుపూస బొక్కల్ల బలమచ్చినట్టన్పిత్తాంది- నడుమ నడుమ నాకు దెల్వకుంటనె పిడికిల్లు బిగుసుకుంటానయ్. మిషిని స్పీడెక్కింది- మిషినిమీద చెయ్యెత్తె అగ్గి దుంక్కతాంది- మిషిని గీరె గిర్ర్‌రున దిరుగుతాంది సూర్యునోలె.

కవిసేన మానిఫెస్టో — ఒక పరిశీలన

కె. బాలగోపాల్

ప్రాచీన భారత ఆలంకారికులకు, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతకర్తలకు, మార్క్సిస్టులకు సాహిత్యం విషయంలో 'ఆశ్చర్యకరమయిన భావైక్యత' వుందని, వీరందరు చెప్పినదే కవిసేన మతంగూడానని– ఇది ఈ మానిఫెస్టో సారాంశం. దీన్ని నిరూపించుకోవడం కోసం, ఆ ఆలంకారికులను సిద్ధాంతకర్తలను ముక్కలు ముక్కలుగా నరికి కొటేషన్ల తోగులు పెట్టారు. ఈ క్రమంలో ఆనందవర్ధనుడికి ఐ.ఏ. రిచర్డ్సుకూ జరిగిన న్యాయమెంతో వారి వారి అభిమానులు నిర్ణయించుకోవాలి. మార్క్సిజానికి పట్టినగతేమిటో, కవిసేన దృక్పథమేమిటో, చూడడం మాత్రమే ఈ సమీక్ష వుద్దేశ్యం.

సామాజిక చైతన్యం

'ఈ ముఖ్యమయిన విషయం మీద ఆలోచనా బాణం సంధించండి' అంటూ మొదలుపెట్టి సామాజిక చైతన్యాన్ని గురించి మొదటి నుండి చివరిదాక చాలవిషయాలు చెప్పారు. కాని దాని అర్థమేమిటో గూడ గ్రహించలేదు. సామాజిక చైతన్యం అంటె పక్కవాడి గురించి పట్టించుకోవడం, 'లోకం కోసం శోకం', యివన్ని కావు. ఒక నిర్దిష్ట భౌతిక స్వరూపం (ఉత్పత్తి విధానం) గల సమాజం తనను గురించి తాను చేసుకొనే ఊహ, ఆలోచన, దర్శనం, సామాజిక చైతన్యం. ఉత్పత్తి విధానం సమాజానికి పునాది. అది సామాజిక 'పదార్థం'. ఈపదార్థం నుండి పుట్టేచైతన్యం సామాజిక చైతన్యం. కాబట్టి సామాజిక చైతన్యమన్న మాటకు పైన చెప్పిన తప్పుడు అర్థం యిచ్చి విశ్వనాథ సత్యనారాయణకు, అభినవగుప్తుడికి గూడ సామాజిక చైతన్యం వుండేది, ఆధునిక కమ్యూనిస్టు రచయితలకు మాత్రమే కాదు, అని వాళ్లను వెనకేసుకు రావడానికి శేషేంద్ర పడ్డప్రయాస అంతా అశాస్త్రీయమూ, నిరర్థకమూను. ఎవ్వడికీ సామాజిక చైతన్యం వుండదు. తనస్వంత చైతన్యమే వుంటుంది. ఈ చైతన్యం సామాజిక చైతన్యంలో నుండి పుడుతుంది. దీనికి ఆ వ్యక్తి అభ్యుదయ కాముకుడా ప్రగతి నిరోధకుడా అన్నదానితో సంబంధం లేదు. సమాజంలోని వైరుధ్యాలు సామాజిక చైతన్యంలో ప్రతిబింబిస్తాయి, అందులో నుండి పుట్టే వ్యక్తుల చైతన్యంలోనూ వుంటాయి. అందుచేత భరతముని కావ్యం ధర్మోపదేశం చేయాలన్నా భామహుడు కావ్యం ధర్మ ధర్మ విచక్షణ యివ్వాలన్నా, మరొకడు కావ్యప్రయోజనం విశ్వశ్రేయస్సన్నా, చూసావా! కమ్యూనిస్టులకే గాదు, మావాడికీ 'సామాజిక చైతన్యం' వుంది, అనడం కాదు చేయాల్సింది. ఆ వ్యక్తుల చైతన్యం, వారి ఆలో

చనలు, ఆనాటి సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబిస్తాయని తెలుసుకొని, ఆ ధర్మం ఏమిటో, సమాజంలో అది నిర్వహించేపాత్ర ఏమిటో, ఆ ఉపదేశం ఏమిటో ఎవ్వరికి చేయాలో, విశ్వశ్రేయస్సంటే ఎవరిశ్రేయస్సో - ఇవి నిర్ణయించాలి. భూస్వామ్య దోపిడీని నిలిపే ధర్మోపదేశం, ఈ విప్లవాలయుగంలో ప్రజలకు సాహిత్యం ద్వారా చేసే విప్లవ 'ఉపదేశం' ఒకటే ఎట్లా అవుతాయి?

'సామాజిక చైతన్యం' అన్నమాటను కొంతమంది అభ్యుదయ భావాలుగల యువకులు సమాజం గురించి పట్టించుకోవడం అన్న అర్థంలో వాడడం కద్దు, అదేమంత మహాపాపం కాదు. కాని తెలుగు దేశంలో మార్క్సిస్టులెవరూ 'కాపిటల్' గూడ చదవలేదని ఆరోపించి మాకు మార్క్సిజం బోధించడానికి ఉపక్రమించిన శేషేంద్ర గూడ ఇంత అల్పమయిన పొరబాటు చేయడం ఆశ్చర్యకరం.

'కవిత్వం ఆత్మకళ'

కవిసేన సాహిత్యసిద్ధాంతానికి కీలకమయిన సూత్రం యిది. దీని అర్థం 'కవిత్వం జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం' అంటే 'మూఢునివలె జీవితంలో బుడుంగున మునిగిపోయి శవమై పైకి తేలకుండ' అనుభూతిని కళగా అభ్యసించడం 'సచేతంగా సబుద్ధికంగా సంకల్పసహితంగా జీవితాన్ని ఆచమనం చేయడం'. అంటే బాహ్యవిషయం ('జగత్తు') తనలో కలిగించే అనుభూతిని ఒక వరంగా పరిగణించి మైమరచి 'స్వకీయ ఆత్మజలాల్లో జలకాలాడడం'. ఈ మానస సాగరంలో జలకాలాట నుండి పుట్టేది కవిత్వం.

పైగా యిదే మార్క్సిస్టు దృక్పథం గూడానట!

మార్క్సిజం అటుంచి ఈ ఆత్మీకరణ గురించి కొంచెం చెప్పుకోవాలి. 'జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం' అన్నది ప్రతివ్యక్తికి - కవిగాని కాకపోనీ- అనునిత్యం జరుగుతూనేవుంటుంది. ఎవ్వరూ జీవితంలో బుడుంగున మునిగిపోయి పైకితేలరు. బాహ్య విషయానికి వ్యక్తిచైతన్యానికి అన్యోన్యక్రియ నిరంతరం జరుగుతుంది. దీనిఫలితమే ఆ విషయం యొక్క ఆత్మీకరణ (ఇంగ్లీష్‌లో దీనిని internalisation అంటారు). ఈ క్రమంలో వ్యక్తిచైతన్యం ఎంతో కొంత మారుతుంది. మనిషి వ్యక్తిత్వం (personality) ఈ విధంగానే ఏర్పడుతుందని అందుకే దానిమీద ఆ సమాజం తాలూకు ముద్రవుంటుందని సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్తల (social psychologists) అభిప్రాయం. ఈ ఆత్మీకరణ సాధారణంగా గుప్త చేతన

స్థాయిలో జరిగిపోతుంది. కాని వృత్తిని ప్రవృత్తిని సందర్భాన్ని అనుసరించి అందరికీ గూడ అప్పుడప్పుడు సచేతనంగా సబుద్ధికంగా' జరుగుతుంది.

సార్వజనీనమయిన ఈ చర్యను కవులకు పరిమితంచేయడం ఒకతప్పు. దానికి తమ చాపల్యంచేర్చి ఆత్మీకరణఅంటే అనుభూతిలో జలకాలాట అని తీర్మానించడం రెండవతప్పు. ఇదే మార్క్సిజంఅని చూపించడానికి మార్క్సిస్టు రచయితల్ని వక్రీక రించడం క్షమించరానితప్పు.

స్పేర్కినాఅనే సోవియట్ రచయిత్రి "Where as the basic Principle of cognition is the repetition of phenomena. ... the basic principle of art is the individualisation of phenomena" అనంటే, ఇక్కడ చెప్పిన individualisation of phenomena అన్నదే జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం అని తమ భాష్యం చెప్పారు. కాబట్టి మార్క్సిజం ప్రకారం కవిత్వం ఆత్మకళ అని తీర్మానించారు. అసలు స్పేర్కినా అన్నదానికి అర్థంఏమిటి ? మాటకుమాట అనువాదం దేనికీగాని భావం చెప్పుకుందాం. బాహ్యప్రపంచంలోని విభిన్నమయిన విషయాలలోని సామాన్యగుణాలు ఆ విషయాలను మనం (అంటే మనుష్యులేకాదు, జంతువులుగూడ) గుర్తించడానికి అర్థంచేసుకోవడానికి (Cognize చేయడానికి) అత్యవసరం. ఏ రెండుచెట్లు ఒకరకంగావుండవు. కాని అన్నిచెట్లలోని 'చెట్టుత్వం' అనే సామాన్య గుణం (అన్నిచెట్లూ మొదలు వేళ్ల కొమ్మలు ఆకులు కలిగివుండడమనే repetition of phenomena) వాటిని ఒక జాతిగా గుర్తించడానికి పనికివస్తుంది. ఇది నిత్య జీవితానికి సంబంధించిన విషయం. అయితే కళాకారుడు విషయాల్లోని సామాన్య గుణాల్ని కాకుండ విశిష్ట, వైయక్తిక గుణాలనుచూస్తాడు. విషయాన్ని వైయక్తీక రిస్తాడు (individualisation of phenomena అంటే అర్థం యిది). చెట్టులోని 'చెట్టుత్వం' కాదు కవికికావలసింది. విషాద కవితలో ఎండిపోయిన చెట్టును ప్రతీకగా వాడుతోంటే అది చెట్టు అనేకన్నా అది ఎండిపోయింది అన్నది కవికి ముఖ్యం. స్పేర్కినా మాటల అర్థం యిది. దీనికి జగత్తును ఆత్మీకృతం చేసుకోవడానికి సంబంధం ఏమిటి ?

అయితే కేవలం స్పేర్కినాతో ఆగిపోతే మాస్కో కవులు భయపడతారేమోగాని ఇతరులు భయపడరు. కాబట్టి 'బహుముఖీన ప్రజ్ఞాశాలి, ద్రష్ట' అయిన లెనిన్ నుండి ఒక కొటేషన్ ఇచ్చారు: 'The universal exists only in the indivi dual and through the individual' (పే. 62) ఇచ్చి, 'ఇలాంటి ఆత్మకూ జగత్తుకూ ఉన్న అవినాభావసంబంధాన్ని జాగృతం చేసుకోవడమే, ఇలాంటి అద్వైత

స్థితిని పొందటమే, ఆత్మకళ' అని తేల్చారు. అసలు లెనిన్ వాక్యంలో universal - individual అంటే జగత్తు - ఆత్మ అనికాదు అర్థం. ఇది తాత్విక ప్రత్యయాల విశ్లేషణకు అతిమౌలికమయిన విభజన. 'కుక్క' అనేది universal, అంటే సార్వత్రికమయిన ప్రత్యయం. ఫలానాకుక్క individual - వ్యక్తి. 'మనిషి' universal కేమేందర్శి ఈ మనిషి అనే సార్వత్రికప్రత్యయం తాలూకు వైయక్తిక రూపం. అక్కడ లెనిన్ ఏమంటున్నాడంటే మనిషి, కుక్క, చెట్టు మొదలయిన సార్వత్రికాలు ఎక్కడో స్వతంత్రంగా వుండవు, ఫలానా మనిషి, ఫలానా కుక్క, ఫలానా చెట్టు అనే వైయక్తికాల రూపంలోనే వుంటాయి అంటున్నాడు. ఇది తత్వ శాస్త్రానికి చాల ప్రధానమయిన విషయం, తాత్వికులు అనాదిగా ఎరిగిన విషయం. లెనిన్ కనిపెట్టింది కాదు. ఈ విషయమే చెప్పదల్చుకున్నా లెనిన్‌ను కోట్ చేయాల్సిన అవసరం లేదు (రాడికల్ ప్రెస్టీజ్ కోసం కాకపోతే). అంతకంటె ముఖ్యంగా, దీనికీ 'ఆత్మకూ జగత్తుకూవున్న అవినాభావ సంబంధానికి' ఏరకమయిన సంబంధం లేదు.

ఆత్మీకరణ (internalisation)కు, వైయక్తీకరణ (individualisation) కు తేడాతెలీదు. జగత్తు (universe) కు సార్వత్రికం (universal)కు తేడాతెలీదు. ఈ మాత్రం ఆంగ్ల పాండిత్యానికేనా తెలుగు దేశంలో కమ్యూనిస్టులు ప్రజల్ని ఇంగ్లీష్ చదువుకోవద్దంటున్నారని గోలపెడుతున్నారు ?

వేరే సందర్భాలలో గూడ ఈ రకమయిన వక్రవ్యాఖ్యానాలు చేసారు. ఒక సోవియట్ రచయిత, 'while embhasising the interdependence subsisting between art and other forms of social consciousness... Marxist - Leninist aesthetics notes simultaneously the relative independence of art'' అనంటే 'మార్క్సిస్టు సాహిత్య దృక్పథం సౌందర్యశాస్త్రాన్ని కళా సాహిత్యాల్ని సమాజంతో అవినాభావ సంబంధ బద్ధంగా భావిస్తూ, వాటిని సంపూర్ణ స్వతంత్ర ప్రక్రియలగా పరిగణిస్తుంది' అన్న తమ తీర్మానానికి దాన్ని సమర్థింపుగా వాడుకున్నారు. పైగా 'సర్వులూ దీన్ని ముఖ్యంగా గుర్తించాలి' అన్నారు. ఏమిటి సర్వులూ గుర్తించాల్సింది ? - 'relative' అన్న పదానికి 'సంపూర్ణం' అన్న కొత్త అర్థాన్నా ? అయినా, తాము చెప్పదలచుకున్నదేమిటో, తమ దృక్పథం ఏమిటో, స్వంతమాటలలో చెప్పుకోవచ్చుగా- ఈ అరువు కొటేషన్ల వక్రవ్యాఖ్యానాల వ్యాపారం దేనికి ?

సాహిత్యం - ప్రచారం

సాహిత్యంలో ప్రచారం, శిల్పం, శబ్దం మొదలయిన చాలవిషయాలగురించి చర్చించారు. తమ దృక్పథమే మార్క్సిస్టు దృక్పథమని చూపడానికి లూనషార్స్కీని మయాకోవ్‌స్కీని చాల విరివిగా వాడుకున్నారు (వాళ్లకు 'లూనా' 'మాయా' అని ముద్దుపేర్లుపెట్టి మరీ వాడుకున్నారు). ఈ విషయాలన్నింటినీ వివరంగా చర్చించడం యిక్కడ సాధ్యపడదు, అనవసరం గూడ. వీటికి సంబంధించి మార్క్సిస్టు అవగాహన ఏమిటో లూనషార్స్కీ తన Theses on the problems of Marxist criticism అనే వ్యాసంలో స్పష్టంచేసాడు. ఒక్క ప్రచారం సంగతి మాత్రం ఇక్కడ చూద్దాం.

సామాజిక చైతన్యమంటే నిర్దిష్ట భౌతిక స్వరూపంగల సమాజం తన్నుతాను దర్శించుకునే విధం అనిచూసాం. ఈ దర్శనానికి సాధనాలు వివిధ సామాజిక చైతన్య రూపాలు (forms of social consciousness) - సాహిత్యం, రాజకీయం, మతం, మొదలయినవి. ఇక్కడే వీటికి గల ప్రత్యేకత, అప్రత్యేకత యొక్క పరిమితులు, అన్నీ వున్నాయి. సాహిత్యం రాజకీయం విభిన్న సామాజిక చైతన్య రూపాలు కాబట్టే సాహిత్యంలో 'అనాచ్ఛాదితమయిన ప్రచారం' ఉండకూడదని ప్లెఖనోవ్ అన్నాడు. రచయిత తన అభిప్రాయాన్ని ప్రత్యక్షంగా కాకుండ పరోక్షంగా చెప్పాలని ఎంగెల్స్ అన్నాడు. కాని 'ప్రచారం' అంటే ఏమిటి, అభిప్రాయాలను ప్రత్యక్షంగా చెప్పడం అంటే ఏమిటి, అన్నది గూడ దృక్పథాన్ని అనుసరించి మారుతుంది. దృక్పథం మారితే మాటలకర్థం గూడా మారుతుంది. ఈ మధ్య ఒక కవి

దొరల గద్దె దించె దన్క
ధరలు తగ్గెటట్టు లేవు

అన్నాడు. ఇది ప్రచారమా కవిత్వమా? ఇక్కడ అనాచ్ఛాదితమయిన ప్రచారం వుందని ప్లెఖనోవ్ అభ్యంతరం చెప్పేవాడా? ఎంగెల్స్ ఇక్కడ కవి మరీ బాహాటంగా దొరలగద్దెదించమన్నాడనీ, ఇట్లా ప్రత్యక్షంగా కాకుండ 'సంస్కారవంతులకు' గాని అర్థంగాని పద్ధతిలో "ఊహాభుజార్గళముల్ విప్పిన విశ్వమూర్తులయి శంఖారావమున్ జేయుడో దళితశ్రామిక జీవులార భువన ద్వారంబు భేదిల్లగన్" (పే. 252) అనమండెననేవాడా? 'దళితశ్రామిక జీవులకు' మత్తేభంలో ఉపదేశించడం కవిసేనకు చెల్లుగాని దీని గురించి ఎంగెల్స్ ఏమనేవాడో వివరించాల్సిన పనిలేదు.

ఇక్కడొక విషయం చెప్పాలి. ప్రజాసాహిత్యం అంటే ఏమిటన్న విషయం చాల క్లిష్టమయినది. అది లూనచార్స్కీగాని మయాకొవ్‌స్కీగాని తేల్చి పారేసేదికాదు. బౌద్ధిక శ్రమకు భౌతికశ్రమకు గల భేదం పోనంతవరకు సాహిత్యకారులెక్కువగా బౌద్ధికశ్రమ చేసే వర్గం నుండి వచ్చేవారే కాబట్టి ప్రజాసాహిత్యాన్ని గూర్చి చర్చ అన్వేషణ సాగుతూనే వుంటాయి. ప్రతి తరం ఆ చర్చ తత్కాల పరిస్థితుల ననుసరించి కొనసాగించాలి. అంతేగాని మయాకోవ్‌స్కీ రొమాంటిక్ కవితరాస్తే అది ప్రజా సాహిత్యమయిపోదు (మార్క్స్ గూడ విద్యార్థిగావున్న రోజుల్లో ప్రేమ కవిత్వం రాసాడు. శేషేంద్రకీవిషయం తెలిసినట్లులేదు. తెలిసుంటే ఇంతెంత రభసచేసే వారో- చూసారా యీ దొంగ కమ్యూనిస్టులు మన విద్యార్థులకు ప్రేమకవిత్వం రాయొద్దని చెబుతున్నారంటూ).

శాస్త్రీయదృక్పథం

'వైజ్ఞానిక ఉద్యమం' నడపదలచుకున్న వారికి కనీస శాస్త్రీయదృక్పథం ఉండాలి. చైతన్యం ఆత్మసంభూతం కాదని, అది పదార్థం నుండి పుడుతుందని తెలియాలి.

సాహిత్యానికీ సమాజానికి గల సంబంధాన్ని చర్చిస్తూ శేషేంద్ర తనకీ కనీస శాస్త్రీయదృక్పథంలేదని నిరూపించుకున్నారు. 'సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది' అన్న వాక్యాన్ని ఒక ఆజ్ఞగా అర్థంచేసుకొని దాన్ని ఖండించడానికి చాల ప్రయాసపడ్డారు. అసలర్థం అదికాదు. జాలర్ల పాటను జాలర్ల భాషలో రాసి వారి బాణీలోనే పాడితే అది వారిజీవితాన్ని ప్రతిబింబిస్తుంది. అదే పాటను ఎవ్వరూ అంటని ఎవ్వరూ ముట్టని పదజాలంతో రాసి (ఇలా రాయడం కవిసేన ఆశయాలలో ఒకటి) త్యాగయ్య గూడ ఎరగని రాగంలో ఆలపిస్తే అదిగూడ సమాజాన్ని ప్రతిబింబిస్తుంది- జాలర్ల జీవితాన్ని కాదు, అభ్యుదయం ఆశయం అన్నీకోల్పోయి కేవలం చాపల్యం మాత్రం మిగిలిన మన పాలకవర్గాలను ప్రతిబింబిస్తుంది. అదే పాటను అధివాస్తవిక పద్ధతిలో రాస్తే అప్పుడుగూడ అది మన సమాజానికి అద్దం పడుతుంది- పెట్టుబడి, సాంకేతికపరిజ్ఞానంతోబాటు సామ్రాజ్యవాద సంస్కృతిని గూడ దిగుమతి చేసుకునే మన అర్ధవలస వ్యవస్థను చూపిస్తుంది.

కాబట్టి సాహిత్యం సమాజానికి ప్రతిబింబమంటే అది విజ్ఞప్తికాదు, నివేదన కాదు, ఆజ్ఞ అంతకంటె కాదు. అది సామాజిక జీవితానికి సంబంధించిన ఒక సత్యం. బహదూర్ షాజఫర్ 'నూరేళ్లఆయుస్సు అడిగితే నాలుగు రోజులు దొరికాయి, అందులో

రెండు కోర్కెల్లో గడిచాయి, రెండు నిరీక్షణలో' అనంటే అందులో చూడవలసింది కేవలం 'అనుభూతి యిచ్చిన వక్రోక్తి' కాదు. అది పతనమవుతున్న భూస్వామ్య సమాజపు పాలకవర్గాల నోటినుండి వచ్చిన మాటగా గుర్తించాలి. ఆ పతనం జఫర్‌తో మొదలుకాలేదని ఈ నాటికీ అంతంకాలేదనీ తెలిస్తే అప్పటినుండీ నిన్న మొన్న 'గుజర్ గయావో జమానా....' అంటూ శోకించిన పంకజ్ మల్లిక్ వరకు ఉర్దూ-హిందీ సాహిత్యలోకాల్ని ఏలుతున్న సంస్కృతి యేమిటో, ఆ సాహిత్యమంటే అంత మక్కువ ఉన్న తన దృక్పథమెటువంటిదో గ్రహించేవారు.

ఈ మానిఫెస్టోకు ఉపోద్ఘాతంగా తాను చెప్పిన మాటల్లో శేషేంద్ర ఒకచోట 'ఈనాడు చరిత్రలో మనిషి ఎక్కడున్నాడన్న స్పృహలేనివాడు ఆధునిక కవి ఎట్లా అవుతాడు' అన్నారు (పే. 8) కారుచీకటిలో కాంతి రేఖలాంటిది కవిసేన మానిఫెస్టోలో యీ మాట. జంతువులలో ఒక జంతువుగా మొదలయిన మానవజాతి మహాప్రస్థానం ఎక్కడిదాక వచ్చిందో తెలియనివాడు ఆధునిక కవిగాని మరొకటిగాని ఎట్లా అవుతాడు? కానీ ఏదీ మీ అవగాహన? ఏదీ మీ చారిత్రిక మానవుడు? ఎక్కడిదాక వచ్చాడు? అసలు మానవుడనే వాడులేడని చారిత్రిక మానవుడే వున్నాడని అర్థంఅయివుంటే, విభిన్న సామాజిక వ్యవస్థలలోని మనుష్యుల ఆలోచనలకు భావాలకు భాషకు ఆయా వ్యవస్థల తాలూకు వాసన వుంటుందని తెలిసివుంటే, 'వ్యక్తి' అనడానికి బదులు 'ఆత్మ' అని, 'అధ్యయనం' అనడానికి బదులు 'తపస్సు' అని, 'వర్తమాన సామాజిక వ్యవస్థ'ను 'విధి' అని అనడం జరిగివుండేదా? 'ధర్మార్థకామమోక్షాలను కవిసేన సోషలిస్టు సమాజతత్వాంశాలుగా వ్యాఖ్యానిస్తోం'దనడం జరిగి వుండేదా? భాష సమాజంలో పుడుతుంది. ఆ సమాజం స్వరూపం భాషలో నిక్షిప్తమయి వుంటుంది. సామాజిక వ్యవస్థమారితే మాటలకు అర్థంగూడ మారుతుంది. ఒకప్పుడు సామంతుడంటే పక్కదేశం రాజన్న అర్థం వుండేది. ఒక ప్రాంతంలోని రాజులందరినీ ఒకడు లోబరచుకొని తన రాజ్యాన్ని విస్తరించుకోవడం ద్వారా మన దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాణం జరిగింది కాబట్టి ఫ్యూడల్ కాలం నుండి (దాదాపుగా గుప్తరాజుల కాలంనుండి) సామంతుడంటే ఒక చక్రవర్తికిగాని రాజుకుగాని కప్పం గట్టుకునే సంస్థానాధిపతి అన్నఅర్థం వచ్చింది. వ్యవస్థ మారడంతోబాటు మాటకు అర్థంగూడ మారింది. అయితే ఇది చరిత్ర క్రమంలోనే సహజంగా జరగాలి. అంతేగాని బలవంతంగా ఆర్థికవిముక్తిని నేను మోక్షం అంటాననడం మూర్ఖత్వం. చరిత్రతో పరాచికాలాడే హక్కు ఎవరికీ లేదు.

మానిఫెస్టో 323వ పేజీ నుండి 352వ పేజీ వరకు శేషేంద్ర తన చారిత్రిక దృక్పథం ఏమిటో వివరించారు. ఈ పుస్తకానికి అసలు ఉపోద్ఘాతం అదే. అంతకు ముందిచ్చిన లెనిన్ కొటేషన్లు ఐ. ఎ. రిచర్డ్స్ కొటేషన్లు దేనికి ముసుగో తెలియాలంటే ముందు ఈ వివరణ చదవాలి. 'సమాజాన్ని వ్యవస్థీకరించడానికి ఆదిమ విజ్ఞానులు చేసిన మహోద్యమంలో వేదము పురాణము కావ్యము అనేవి మూడుశాఖలు. మానవులందరి లక్ష్యం, అంటే సమాజలక్ష్యం, ధర్మార్థకామమోక్షాలు అని నిర్దేశించబడ్డాయి', వగైరా వగైరా. చరిత్ర కవిసేన వంటి సంస్థకాదు, నలుగురు గడ్డాలమునుల కార్యనిర్వాహక వర్గం దాన్ని వ్యవస్థీకరించడానికి. ఈ రకమయిన తద్దినపు బ్రాహ్మడి విజ్ఞానమా కవిసేన నడపబోయే వైజ్ఞానిక ఉద్యమానికి ప్రాతిపదిక? ధర్మార్థకామమోక్షాలనేవి మనదేశ భూస్వామ్య వ్యవస్థ భావజాలంలో అతిముఖ్యమయిన భాగం. అవి 'సమాజలక్ష్యం' ఏరోజూ కాదు. 'ధర్మం' అంటే వర్ణవ్యవస్థను నిలబెట్టేది. అది శూద్రుల లక్ష్యం పంచముల లక్ష్యం కావడానికి ఆస్కారం గూడ లేదు. అందుకే ధర్మవర్తనకు ప్రతిఫలంగా మోక్షం అవసరమయింది. ఎంతటి భూస్వామ్య వ్యవస్థ అయినా అందులో కొంత అమ్మకపు సరుకుల ఉత్పత్తి మారకం ఉంటాయి కాబట్టి ఎప్పుడూ ఒక వర్తకవర్గం వుంటుంది. ఇది పాలకవర్గాలకు అతిసన్నిహితంగా వుంటుంది. అందుకే 'అర్థం' ప్రధానం ఇక 'కామం' మాటకొస్తే తమ విలాసాల కోసమేగదా పాలకవర్గాలు ఇన్నిపాట్లుపడేది.

పురాణాలు గూడ ఈ భావజాలంలో ఒక భాగం మాత్రమే. ఇవి 'పురాణర్షులు' ప్రజల్ని 'బుజ్జగించడానికి' రాసినవికావు. ఆర్యేతర తెగల్లో వర్గసమాజం ఏర్పడడానికి, స్థిరవ్యవసాయం, స్వయంసమృద్ధ గ్రామీణవ్యవస్థ, భూస్వామ్యం ఏర్పడడానికి వర్ణవ్యవస్థతోబాటు పురాణాలుగూడ చాల తోడ్పడ్డాయి. హైందవేతర ప్రజలను (తెగలను) హైందవ సమాజం (అంటే, పురాణాలకాలానికి, స్థిరవ్యవసాయం మీద ఆధారపడ్డ వర్గసమాజం)లో కలుపుకోవడానికి, ఆ తెగల్లోగూడ స్థిరవ్యవసాయం వర్గవిభజన ఏర్పడడానికి, వారిదేవుళ్లను దేవతలను హిందూదేవుళ్లగా అంగీకరించడం ఇది చారిత్రికంగా పురాణాలు నిర్వహించిన పాత్ర. అంతేగాని ప్రజల్ని 'బుజ్జగించడం' కాదు.

అయినా యిదంతా కొత్తేంగాదు. మనదేశ భూస్వామ్య సంస్కృతిని దృక్పథాన్ని సంరక్షించడానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రపంచ ప్రఖ్యాతమేధావులు, భారతీయ విద్యాభవన్ వంటి సంస్థలు చేసిన కృషి అందరూ ఎరిగినదే. రాధాకృష్ణన్

మార్క్సిస్ట్ విమర్శ - కొన్ని ప్రతిపాదనలు

లూనషార్ స్కీ

1 ఇది మన సాహిత్యవికాసానికి చాల ముఖ్యమయిన, నిర్ణాయకమయిన సమయం. మన సమాజంలో ఒక కొత్త జీవితం నిర్మితమవుతూవుంది. ఈ కొత్త జీవితాన్ని మన సాహిత్యం, ఎంత అస్పష్టమయిన అస్థిరమయిన రూపంలోనయినాసరే, ప్రతిబింబించడం నేర్చుకుంటోంది. అంతేకాకుండా ఈ నిర్మాణక్రమంమీద తనకుండే రాజకీయ, నైతిక ప్రభావం తాలూకు సమస్యనుగూడ సాహిత్యం ముమ్మందు ఎదుర్కొంటుంది.

మనదేశంలో మిగిలిన దేశాలలోకన్న వర్గవిభేదాలు తక్కువగావున్నా, ఇప్పుడప్పుడే దీన్ని వర్గరహిత సమాజంగా వర్ణించలేం. పాతకొత్తలమధ్య కలహం సాగుతూనేవుంది. యూరప్ సమాజప్రభావం, గతంతాలూకు, గతంలోని పాలకవర్గాల అవశేషం తాలూకు ప్రభావం, కొత్త ఆర్థికప్రణాళిక ప్రణ్యమాలని కొంతమేరకు వ్యాపించి కూర్చున్న కొత్తపెట్టుబడిదారివర్గ ప్రభావం- యివన్నీ కనిపిస్తున్నాయి. ఇవి కొంతమంది వ్యక్తుల బృందాల ఆలోచనలలోనేకాదు, రకరకాల సంకర రూపాలలోగూడా కనిపిస్తాయి. ఉద్దేశ్యపూర్వకంగాను ప్రత్యక్షంగాను విద్వేషపూరితమయిన బూర్జువా అంశమేకాకుండ, అంతకంటె బహుశ ప్రమాదకరమయినది, ఖచ్చితంగా అంతకంటె జయించడానికి కష్టతరమయినది, మరొక అంశం ఉన్నదన్నసంగతి గుర్తుంచుకోవాలి. ఇది దైనందిన జీవితంపట్ల పెటీబూర్జువా వర్గదృక్పథం. ఇది కార్మికవర్గంయొక్క వైఖరిలోనే కాకుండ చాలమంది కమ్యూనిస్టుల వైఖరిలోనికి గూడ ప్రవేశించింది.

2 ఇటువంటి పరిస్థితులలో సాహిత్యానికుండే గణనీయమయిన పాత్రతోబాటు మార్క్సిస్టు విమర్శకు గూడ చెప్పుకోదగ్గ బాధ్యత ఉంటుంది. మార్క్సిస్ట్ విమర్శ

అధ్యక్షతన 'భవన్' వారు భారతదేశ సాంస్కృతిక వారసత్వం అనే నాలుగు వాల్యూముల మూడువేల పేజీల ఉద్గ్రంథం ప్రకటించారు. దాన్ని భారత భాషల్లోకి అనువదించడానికి అనుమతిగూడ మన ఫ్యూడల్ - వ్యతిరేక ఇందిరా గాంధీ ప్రభుత్వం యిచ్చినట్లు వినికిడి. ఆ గ్రంథంలోలేనిది కవిసేన దృక్పథంలో కొత్తగా ఏం లేదు. మరయితే ఈ నూతన ప్రయత్నం ఎందుకుచేస్తున్నట్లు ? ఎందుకంటే రాధాకృష్ణన్‌గాని 'భవన్'గాని మార్క్సిస్టు ముసుగువేసుకోలేదు. ఆ ముసుగువేసుకొని రివిజనిస్టుల రాజకీయ వ్యాపారంతో విసిగిపోయిన యువతరాన్ని ప్రజలనుండి రక్షించ

సాహిత్యంతోబాటు ఈరోజు కొత్త మానవునిని కొత్త జీవితాన్ని నిర్మించే క్రమంలో ఉత్సాహంతోను శక్తివంతంగాను భాగం పంచుకోవాల్సిన అవసరంవుంది.

3 మార్క్సిస్ట్ విమర్శకు తక్కిన సాహిత్యవిమర్శనా పద్ధతులకు ముఖ్యమయిన తేడా యేమిటంటే, మార్క్సిస్ట్ విమర్శకు సామాజిక శాస్త్రీయ(sociological) స్వభావం వుంటుంది. ఇక్కడ 'సామాజికశాస్త్రం' అన్నమాట మార్క్స్ - లెనిన్‌లు చెప్పిన శాస్త్రీయమయిన అర్థంలో వాడబడుతోంది.

కొంతమంది సాహిత్య విమర్శకుడికీ, సారస్వత చారిత్రికునికీ తేడా చూస్తారు. ఈ తేడా, వర్తమానానికి, గతానికి చెందినవన్న వ్యత్యాసం వల్ల వచ్చింది కాదు. సారస్వత చారిత్రికునికి రచన యొక్క మూలం ఏమిటి, సమాజంలో దాని స్థానం ఏమిటి, సామాజిక జీవితం మీద దాని ప్రభావం ఏమిటి అనే విషయాల శాస్త్రీయ పరిశీలన ముఖ్యంకాగా, సాహిత్యవిమర్శ రచన యొక్క శిల్పపరమయిన, సమాజ పరమయిన, సద్గుణాలను దోషాలను అంచనా వేయడాన్ని ప్రాతిపదికగా కలిగి వుంటుంది.

అయితే మార్క్సిస్ట్ విమర్శకునికి ఈ విభేదం చాలవరకు అర్థరహితమయినది. మార్క్సిస్ట్ విమర్శలో శుద్ధవిమర్శ (criticism in the strict sense of the word) అనివార్యంగా ఒక భాగమయినా, అంతకంటె మౌలికమయినది సామాజిక విశ్లేషణ.

4 మరయితే మార్క్సిస్ట్ విమర్శకుడు ఈ సామాజిక విశ్లేషణ ఏవిధంగా చేస్తాడు? మార్క్సిజం సామాజిక జీవితాన్ని ఒక అవయవి (organism) గాను అందులోని వివిధభాగాలను ఒకదాని మీద ఒకటి ఆధారపడే అవయవాలగాను పరిగణిస్తుంది, ఇందులో నిర్ణాయకమయిన పాత్రవహించేది భౌతిక ఆర్థిక సంబంధాలు, అందునా శ్రమరూపాలు. ఒక సామాజిక యుగాన్ని (epoch) స్థూలంగా విశ్లేషించేటప్పుడు, మార్క్సిస్ట్ విమర్శకుడు ఆ యుగం తాలూకు సామాజిక వికాసాన్ని పరిపూర్ణంగా చిత్రించాలి. అయితే కేవలం ఒక రచయితనో రచననో చర్చించేటప్పుడు, మౌలిక మయిన ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడం అత్యవసరంగాదు. ఇక్కడ ప్లెఖనోవ్ చేసిన ఒక సూత్రీకరణ వర్తిస్తుంది. అదేమిటంటే, కళాసృష్టి బహుకొద్ది మేరకు మాత్రమే ఉత్పత్తి రూపాలమీద ప్రత్యక్షంగా ఆధారపడివుంటుంది. ఆ సంబంధం సామాజిక వర్గ నిర్మాణంద్వారాను, వర్గాల అవసరాలననుసరించి ఏర్పడే వర్గ మన స్తత్వం ద్వారాను ప్రచ్ఛన్నంగా ఏర్పడుతుంది. సాహిత్యం ఎప్పుడూ కూడ- రచయితకు తెలిసో తెలియకో- అతను ప్రాతినిధ్యం వహించే వర్గం మనస్తత్వాన్ని

ప్రతిబింబిస్తుంది. లేదా, అతనిమీద ప్రభావంవున్న వివిధ వర్గాలకు చెందిన అంశాలను ప్రతిబింబిస్తుంది. దీన్ని చాల జాగ్రత్తగా విశ్లేషించాలి.

5 కళకు వర్గమనస్తత్వానికి లేక సామాజిక బృందాల మనస్తత్వానికిగల సంబంధం ముఖ్యంగా దానివస్తువు (content) చేత నిర్ణయించబడుతుంది. ఆలోచనకు అతిసన్నిహితమయిన కళ అయిన సాహిత్యంలో, రూపంకంటె వస్తువుకుగల ప్రాముఖ్యత మిగిలిన కళారూపాలలోకంటె అధికంగా వుంటుంది. అందునా, వస్తువులోని అన్ని అంశాలకంటె కళాపరమైనఅంశం- అంటే బింబాలరూపంలోను ప్రతీకల రూపంలోనువున్న ఆలోచనల అనుభూతుల ప్రవాహం- సాహిత్యంలో నిర్ణాయక పాత్ర వహిస్తుందన్న విషయం స్పష్టమే. ఈ వస్తువే ఒక నిర్దిష్టరూపాన్ని (from) వెతుక్కుంటుంది. వస్తువుకు సరిగ్గా సరిపడేరూపం ఒక్కటే వుంటుందని చెప్పవచ్చు. రచయిత తాను వెలువరించదలచుకున్న ఆలోచనలను చెప్పదలచుకున్న విషయాలను స్పష్టంగా వ్యక్తీకరించి పాఠకుడిని బలంగా ప్రభావితంచేసే రూపాన్ని ఎంతో కొంత మేరకు సాధించుకుంటాడు.

కాబట్టి మార్క్సిస్ట్ విమర్శకు ప్రధానమయిన విషయం రచనయొక్క వస్తువు అందులోని సామాజిక సారాంశం మార్క్సిస్ట్ విమర్శకుడు ఈ వస్తువుకు వివిధ సామాజిక బృందాలకుగల సంబంధాన్ని, సామాజిక జీవితంమీద దానికుండే ప్రభావాన్ని చూస్తాడు. ఆ తరువాతే రచనయొక్క రూపాన్ని పరిగణిస్తాడు. ఇదిగూడ, ఆ రూపం తనకర్తవ్యం ఏవిధంగా నిర్వహిస్తోందో- అంటే రచనను వీలయినంత ప్రభావయుతంగాను, ఆకట్టుకునేటట్టు చేస్తున్నదా లేదా అని వివరించే దృష్టితో చూస్తాడు.

6 అంతమాత్రాన సాహిత్య రూపాల విశ్లేషణ తాలూకు ప్రత్యేకమయిన కర్తవ్యాన్ని మార్క్సిస్ట్ విమర్శకుడు విస్మరించడానికి వీలులేదు. రచనయొక్క రూపం కేవలం వస్తువు చేతనేగాక ఇతర విషయాలచేత గూడ నిర్ణయించబడుతుంది. రచనను ప్రభావితం చేసిన వర్గాల ఆలోచనావిధానం, జీవనవిధానం, సమాజం యొక్క భౌతిక సంస్కృతిస్థాయి, పరిసరసమాజాల ప్రభావం, గతం తాలూకు జడత్వం, ఇవన్నీ మొత్తం జీవితం మీద ప్రభావం కలిగివున్నట్లే రచన యొక్క రూపం మీద గూడ కలిగివుంటాయి, దాన్ని నిర్ణయించడంలో అప్రధానమయిన (subsidiary) పాత్రను కలిగివుంటాయి. ఒక్కొకసారి రూపం కేవలం ఒక రచనకు సంబంధించింది కాక ఒక మొత్తం చారిత్రిక యుగానికి, సాంప్రదాయానికి సంబంధించి వుంటుంది.

అంతేకాక, రూపం వస్తువును విరోధించే శక్తిగూడ కావచ్చు, వస్తువు నుండి వేరుపడి అస్పష్టంగా తయారుకావచ్చు. ఇదెప్పుడు జరుగుతుందంటే ఆసాహిత్యం ప్రాతినిధ్యం వహించేవర్గాలు పుష్టిలేనటువంటివి, జీవితాన్ని చూసిభయపడి మాటలగారడీ వెనుక లేకపోతే వెకిలితనం వెనుక దాక్కునేవయినప్పుడు. ఇవన్నీ గూడ మార్క్సిస్ట్ విశ్లేషణలో భాగం కావాలి.

7 మనం ఇంతవరకు మార్క్సిస్ట్ విమర్శను కేవలం సారస్వత వైదుష్యం యొక్క వ్యాపారంగా చూసాము. ఇక్కడ మార్క్సిస్ట్ విమర్శకుడు సామాజిక శాస్త్రజ్ఞుడిగా, మార్క్సిస్ట్ విశ్లేషణా పద్ధతిని సాహిత్యానికి అన్వయించేవాడిగా కనిపిస్తాడు. మార్క్సిస్ట్ విమర్శకుపునాదివేసిన ప్లెఖనోవ్ మార్క్సిస్ట్ పాత్ర యిదేనని నొక్కిచెప్పాడు. ప్లెఖనోవ్ మార్క్సిస్టులకు, ప్రబోధకులకు (enlighteners) ఇక్కడ తేడా చెప్పాడు. ప్రబోధకుడు సాహిత్యానికి ఆశయాల్ని నిర్దేశిస్తాడని, సాహిత్యాన్ని ఆజ్ఞాపిస్తాడని, ఆ ఆశయాల దృష్ట్యా సాహిత్యాన్ని అంచనావేస్తాడని, దానికి విరుద్ధంగా మార్క్సిస్టు ఒక రచన రావడానికి ప్రకృతిసిద్ధమయిన కారణాలేమిటో చూస్తాడని ప్లెఖనోవ్ చెప్పాడు.

ఈరకంగా విషయగతము, శాస్త్రీయము అయిన మార్క్సిస్ట్ విమర్శనాపద్ధతికి సౌందర్యవాదుల చపలచిత్తుల రీతిరహితమయిన ఆత్మాశ్రయ విమర్శనాపద్ధతికి సరిగ్గానే తేడాచెప్పడమేకాకుండ, తరువాతి మార్క్సిస్ట్ విమర్శకులకు మార్గదర్శకుడయ్యాడు.

అయితే అంతమాత్రంచేత కేవలం ప్రపంచాన్ని గుర్తించడం విశ్లేషించడం మాత్రమే కార్మికవర్గం గుణమని అనుకోకూడదు. మార్క్సిజం ఒక సామాజిక సిద్ధాంతం మాత్రమేకాదు, చైతన్యవంతమయిన నిర్మాణప్రణాళిక. విషయాల్ని విషయగతంగా అంచనావేయకుండ అటువంటి నిర్మాణం సాధ్యంకాదు. మార్క్సిస్టయిన వాడు తనచుట్టూవున్న విషయాలమధ్య సంబంధాలను గ్రహించలేకపోతే ఒక మార్క్సిస్టుగా అతనికి స్థానంలేదు. కాని నిజమయిన మార్క్సిస్టు అక్కడితో ఆగిపోవడానికి వీలులేదు– అతను పరిసరాలను ప్రభావితంచేయాలి. మార్క్సిస్టు విమర్శకుడు సాహిత్యగ్రహాల గతిసూత్రాలను వివరించే సారస్వత ఖగోళశాస్త్రజ్ఞుడుకాడు. అతని కర్తవ్యం దీన్ని అధిగమించి వుంటుంది. అతనొకయోధుడు, నిర్మాణకార్యకర్త. ఈ అర్థంలో సాహిత్యాన్ని అంచనావేయడం (the evaluation factor) వర్తమాన

8. మరయితే ఈరకంగా సాహిత్యాన్ని అంచనావేయడానికి ప్రాతిపదిక ఏది? దీనికి సమాధానం చెప్పాలంటే మొదటసాహిత్యంయొక్క వస్తువునుతీసుకుందాం. ఈ విషయంలో, స్థూలంగా చెప్పాలంటే, ఎటువంటి సంశయానికి స్థానంలేదు. శైశవ దశలోని కార్మికవర్గనీతికి ఏది ప్రాతిపదికో, సాహిత్యవిమర్శకూ అదే. కార్మికవర్గ వికాసానికి విజయానికి దోహదంచేసేది మంచి, దానికి హానికలిగించేది చెడు.

మార్క్సిస్టు విమర్శకుడు రచనలోని సామాజికమయినపోకడ (trend) ఏమిటో చూడాలి. రచన ఏదిక్కుగా సాగుతుందో గుర్తించాలి- అది ఎంత అనిశ్చితంగావున్నా, తాను రచనగురించిచేసే అంచనాకు దీన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి.

అయితే ఒక రచనయొక్క వస్తువును సామాజికంగా అంచనావేయడం సులభ సాధ్యంకాదు. మార్క్సిస్టు విమర్శకుడు చాలనైపుణ్యంతోను సున్నితత్వంతోను వ్యవహరించాలి. ఇక్కడ నైపుణ్యంఅంటే మార్క్సిజానికి సంబంధించినదికాదు, ప్రత్యేకించి విమర్శకు సంబంధించింది. అది లేకుండ విమర్శ సాధ్యంకాదు. నిజంగా ఉన్నతమయిన రచనలో పరిగణించవలసినవి చాల అంశాలుంటాయి. త్రాసులో తూకం వేసినట్లు అంచనాకట్టడం సాధ్యంకాదు. మార్క్సిస్టు విమర్శకుడు కేవలం సమకాలీన సమస్యలను చర్చించే సాహిత్యాన్నే నిజమయిన సాహిత్యంగా చూడకూడదు. సమకాలీన సమస్యలకున్న ప్రత్యేకమయిన ప్రాముఖ్యతను కాదనగూడదుకాని, తాత్కాలికంగా అంత ప్రాముఖ్యతలేనట్లు కనబడ్డా, మరీ స్థూలంగాను వాస్తవానికి దూరంగాను వున్నట్లు కనబడ్డా జాగ్రత్తగా పరిశీలిస్తే సామాజిక జీవితంమీద ప్రభావంకలిగివుండే సమస్యలను నిరసనతో చూడడంతప్పు.

అయితే ఒక కార్మికవర్గ రచయితగాని కవిగాని ఈ రకమయిన సాధారణ (general) సమస్యల పరిష్కారానికి ప్రయత్నించినప్పుడే, అంటే సంస్కృతిని సంబంధించిన మౌలికమయిన విషయాలను కార్మికవర్గ దృక్పథం నుండి పునఃపరిశీలించినప్పుడే, విమర్శకుడు తికమకపడే ప్రమాదం వుంది. ఎందుకంటే ఇక్కడ విమర్శకు మనకు సరయిన ప్రాతిపదిక లేదు. అంతే కాకుండ ఇటువంటి సమస్యలకు సంబంధించి మనం ఆశించేది రచయిత పరిష్కారం యివ్వాలని కాదు, సమస్యను విశ్లేషించి కొన్ని ప్రతిపాదనలు చేయాలని మాత్రమే. అటువంటి ప్రతిపాదనలలో దుందుడుకుతనానికి సయితం విలువ ఉంటుంది. అయితే కొంతమేరకు యిదంతా సమకాలీన విషయాలకు సంబంధించిన రచనలకు గూడ వర్తిస్తుంది. మన ప్రణాళికలో ఒకస్థాయికి ఎదిగిన విషయాల్నే తన రచనలో వివరించే రచయిత మంచి రచయిత

కాదు. విలువగల రచనలు చేయాలంటే రచయిత కొత్త విషయాల్ని ప్రస్తావించాలి. ఇదివరకు అనుభవంలోలేని విషయాల్ని గురించి, తార్కిక పరిశీలనకు లొంగని విషయాల్ని గురించి, చెప్పాలి.

రచనలోని సామాజిక అంశాన్ని అంచనావేయడంలో అతిముఖ్యమయిన విషయం ఏమిటంటే, మనకు మొదట విజాతీయంగాను శత్రుత్వంతో కూడినట్లుగాను కనిపించే రచనను పునఃపరిశీలన చేయడం. మన శత్రువుల వైఖరి తెలుసుకోవడం, మనవేకాకుండా ఇతర దృక్పథాలనుండి సమాజాన్ని గురించి చేసేవివరణను ఉపయోగించుకోవడం, చాలముఖ్యం. ఇది చాల సందర్భాలలో సరయిన తీర్మానాలకు దారి తీస్తుంది; కనీస పక్షం జీవితాన్ని గురించిన మన జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఒక రచయిత కేవలం పెటీబూర్జువా రచయిత అనో మరొకటనో మార్క్సిస్టు విమర్శకుడు తోసిపుచ్చడానికి లేదు. అటువంటి రచనలనుండి గూడ చాల ప్రయోజనాన్ని పొందవచ్చు. ఈ కారణంచేత, రచనయొక్క సామాజిక బోధక దృష్ట్యా మాత్రమే కాకుండా మన నిర్మాణ కార్యక్రమానికి దానికుండగల ఉపయోగం దృష్ట్యా రచనను పునః పరిశీలించడం మార్క్సిస్టు విమర్శకుని కర్తవ్యం.

పై మాటలకొక సవరణచేయాలి. విజాతీయంగాను శత్రుత్వంతో కూడినవిగాను కనిపించేరచనలు, పైన చెప్పిన అర్థంలో కొంత వుపయోగకరంగావున్నా, చాల అపాయకరంగాను విషపూరితంగాను విప్లవ ప్రతీఘాతుక ప్రచారానికి రూపాంతరంగాను వుండవచ్చు. అయితే అప్పుడు మార్క్సిస్టు చేయవలసినది విమర్శించడంకాదని, నిరోధించడమని (censorship) వేరేచెప్పనవసరం లేదు.

9. రచన యొక్క వస్తువును అంచనావేయడంకన్న రూపాన్ని అంచనావేయడం మార్క్సిస్టు విమర్శకునికి కష్టతరమయిన పని.

అయితే యిది చాల ముఖ్యమయిన పని; దీని ప్రాధాన్యత ప్లెఖనోవ్ నొక్కి చెప్పాడు. మరయితే రూపాన్ని ఏ ప్రాతిపదిక మీద అంచనావేయాలి? రూపం వస్తువుకు సరిగ్గా సరిపోవాలి, వస్తువును సరిగ్గా వ్యక్తీకరించాలి, వస్తువు పాఠకునిమీద బలమయిన ప్రభావం కలిగించేలా చేయాలి.

అన్నిటికంటె ప్రధానమయినసూత్రం – ఇది ప్లెఖనోవ్ చెప్పింది– ఏమిటంటే సాహిత్యం బింబాల (images) కళ, అందులోకి అనాచ్ఛాదితమయిన భావాల ప్రచారం ప్రవేశిస్తే అది రచనమీదే దెబ్బతీస్తుంది. అయితే ప్లెఖనోవ్‌చేసిన ఈసూత్రీ

పించే ఇహ చక్కని రచనలు సాల్టికోవ్-ష్చెద్రిన్, ఉస్పెన్‌స్కీ, ఫర్మానోవ్‌లు చేశారు. అంటే నవలను ప్రచారాన్ని కలిపే సంకరజాతి సాహిత్యానికీ స్థానంవుంది. అయితే సాధారణ పరిస్థితులలో ఇవి చేయకుండడం మంచిది. 'సాహిత్యం' అన్న మాటను సంకుచితంగా అర్థంచేసుకోకపోతే మంచిప్రచార సాహిత్యాన్నిగూడ సాహిత్యమనే అనాలి. కాని కేవలం ప్రచారక విషయాలతోనిండిన నవల, ఆ ప్రచారం ఎంత తెలివిగావున్నా, పాఠకుడిని కదిలించలేదు. కాబట్టి సాహిత్యవస్తువు రచనలో కరిగించిన లోహంలాంటి బింబాల ప్రవాహంగాకాక కలప దుంగలలాగా తేలినప్పుడు, రచయిత తన రచనా వస్తువును జీర్ణించుకోలేదని విమర్శకుడు అనవలసి వుంటుంది.

'రూపం వస్తువుకు సరిపోవాలి' అనే ప్రాథమికమయిన సూత్రీకరణనుండే రెండవసూత్రాన్నిగూడ మనం పరిగ్రహించవచ్చు. ఇది కళారూపంయొక్క నూతనత్వానికి నవ్యతకు (Originality) సంబంధించింది. ఈ నవ్యత ఎక్కడినుండి వస్తుందంటే, రచనయొక్కరూపం వస్తువుతో ఏకత్వం కలిగివుండాలి, వస్తువు-రూపం ఒకటికావాలి అన్న సూత్రంనుండే. నిజమయిన కళాసృష్టి వస్తుపరంగా నవ్యత కలిగి వుండాలి, వస్తువులో కొత్తదనంలేని కళకు విలువలేదు. కళాకారుడు ఇదివరకు ఎవ్వరూ చెప్పనివిషయాలు చెప్పాలి. పునరుత్పత్తి కళగాదు, (కొంతమంది చిత్రకారులకు ఈ విషయం అర్థంకానట్లుంది) కేవలం వృత్తిమాత్రమే- అది ఎంతచక్కగావుండనీ. కాబట్టి కొత్తరచనలో కొత్తవస్తువుండాలి. దానితోబాటే రూపంలో నవ్యతఉండాలి.

సాహిత్యంలో ఈ రకమయిన నిజమయిన నవ్యత నూతనత్వం లోపించడం వివిధంగా జరుగుతుంది. ఒకటి, సాంప్రదాయికంగా వస్తూవుండి కొత్త విషయానికి కళావస్తువులో చోటివ్వని రూపం. రచయిత పాతరూపాల మోజులోపడి కొత్త విషయాన్నిగూడ ఆ పాత మూసలోకేపోయవచ్చు. ఈ రకమయిన లోపాన్ని సులభంగా గుర్తించవచ్చు. రెండవది, రూపం పేలవంగా ఉండవచ్చు, అంటే రచయిత ఉద్దేశ్యంలో నవ్యతవున్నా దాన్ని వ్యక్తీకరించేశక్తి- భాష, కథనానైపుణ్యం, కవితలో అయితే లయ - లోపించవచ్చు. మార్క్సిస్టు విమర్శకుడు దీన్ని ఎత్తిచూపాలి. నిజమయిన మార్క్సిస్ట్ విమర్శకుడు ఉపాధ్యాయుడు కావాలి- ముఖ్యంగా కొత్త రచయితలకు, యువ రచయితలకు.

మూడవది రూపంలో 'అతినవ్యత' ఉండడం. అతినవ్యత అంటే విషయరాహిత్యాన్ని కప్పిపుచ్చే అలంకార ప్రాయమయిన నవ్యత. కొంతమంది మంచి రచయితలుగూడ బూర్జువాపతనానికి ప్రతినిధులయిన రూపవాదుల (formalists) ప్రభావంలోపడి తమ రచనలను అలంకారపుగారడీతో పాడుచేయడం కద్దు.

సాహిత్యరూప విమర్శ తాలూకు ప్రాతిపదికలోని మూడవ అంశం సార్వత్రికతకు సార్వజనీనతకు సంబంధించింది. దీన్ని చాల జాగ్రత్తగా పరీక్షించాలి. ఈ రకమయిన సార్వజనీనత కావాలని టాల్‌స్టాయ్ అన్నాడు. మనం ప్రజాసాహిత్యాన్ని కోరుకుంటాం కాబట్టి, ఆ ప్రజలే చరిత్ర కర్తలని నమ్ముతాం కాబట్టి ఈ సార్వజనీనత పట్ల మనమూ కొంత ఉత్సాహం చూపిస్తాం. మార్క్సిస్టు విమర్శ అన్ని రకాల ప్రత్యేకతను, కొంతమంది విశిష్టులయిన రసజ్ఞులకు మాత్రమే పరిమితమయ్యే కళారూపాల్ని, కళాసాంప్రదాయాల్ని, అనవసరమయిన నగిషీలను, - వీటన్నిటినీ తోసిపుచ్చుతుంది. అటువంటి రచనలలోని సద్గుణాల్ని అంగీకరిస్తూగూడ మార్క్సిస్టు విమర్శ ఆ రచయిత యొక్క పలాయన వాద దృక్పథాన్ని ఖండిస్తుంది.

అయితే, పైనచెప్పినట్లు ఈ సార్వజనీనత అనే విషయాన్ని చాలజాగ్రత్తగా పరిశీలించాలి. మన ప్రచారసాహిత్యంలో మనం ప్రతిభావంతులయిన పాఠకుల స్థాయిలోని క్లిష్టమయిన రచనలనుండి, చాల సులభమయిన స్థాయికి వెళుతున్నాం. ఆ రకంగానే మనం మన సాహిత్యం యావత్తూ సాంస్కృతికంగా వెనుకబడ్డ కర్షకుల స్థాయికిగాని, పోనీ కార్మికుల స్థాయికిగాని తీసుకుపోవాలనుకోవడం పొరబాటవుతుంది.

ఒక క్లిష్టమయిన, సామాజికంగా విలువయిన, ఆలోచనను లక్షలాది ప్రజల నాకట్టుకునే సులభమయినరీతిలో చెప్పగల రచయిత ఘనుడే. అటువంటి రచయితకు మార్క్సిస్టు విమర్శకుడు గొప్పవిలువయిస్తాడు. దీనికి తాను సహాయంగూడ చేస్తాడు. అయితే ప్రతీ అక్షరాస్యుడయిన వ్యక్తికీ అర్థంకాని రచనలు, కార్మికవర్గం పైమెట్టులోనివారికి, కొంతచదువుకున్న పార్టీసభ్యులకు, సాంస్కృతికంగా ముందునవున్న పాఠదికుకీ ఉద్దేశ్యింపబడ్డ రచనను పూర్తిగా విలువలేనిదని కొట్టివేయడానికి లేదు. సమసమాజ నిర్మాణంలో గణనీయమైనపాత్ర వున్న ఈ బృందానికి జీవితంలో ఎదురయ్యే సమస్యలకు, ప్రజా బాహుళ్యానికి సమస్యలు కావన్ననెపంతో సమాధానం యివ్వకుండడం తప్పు. అయితే ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమిటంటే నిజానికి మనవాళ్ళు ఈ రకమయిన ప్రజలకోసమే, అంటే సాంస్కృతికంగా ముందునవున్న వారికోసమే, రచనలుచేస్తున్నారు. కాని ఈరోజు కావలసింది కార్మిక కర్షకవర్గాల కోసం నైపుణ్యంతో రాసే రచనలు.

10 ఇదివరకు చెప్పినట్లు, మార్క్సిస్ట్ విమర్శకుడు ఉపాధ్యాయుడు కావాలి. అతను రచయితకు రెండు విషయాలలో బోధచేయాలి. మొదటిది, యువరచయితలకు, శిల్పపరంగా పొరబాట్లు చేసే రచయితలకు, ఆ పొరబాట్లను ఎత్తి చూపాలి.

అంతేకాదు, సామాజికంగా గూడ మార్క్సిస్ట్ విమర్శకుడు రచయితకు బోధించాలి. కార్మికవర్గ దృక్పథంలేని రచయితల సామాజిక వైఖరి పసిపిల్లల స్థాయిలోవుంటుంది: సామాజిక జీవన సూత్రాల గురించి చాల ఆదిమకాలపు (primitive) భావాలుండడం చేతను, సమాజాన్ని అర్థంచేసుకోలేక పోవడం చేతను చాల అల్పమయిన పొరబాట్లు చేస్తారు. అంతేకాదు, మార్క్సిస్టు రచయితలలో గూడ ఈ తప్పులు కనబడుతూ వుంటాయి, ఇది వారిని అపహాస్యం చేయడం కోసం అంటున్నది కాదు, కొంతవరకు పొగడ్తగా అంటున్నదే. రచయితలలో సున్నితత్వం అధికంగావుంటుంది. అన్ని రకాల ప్రభావాలకు సులభంగాలోనవుతారు. సాధారణంగా వాళ్లకు అమూర్తము శాస్త్రీయము అయిన ఆలోచనపట్ల ప్రత్యేకమయిన యిష్టంగాని దానికి కావలసిన ప్రత్యేకమయిన నైపుణ్యంగాని వుండదు. ఈ కారణంచేతనే వాళ్లు ఒక్కొకసారి రాజకీయ ప్రచారకుల విమర్శను నిరసిస్తారు. ఇది కొంత వరకు ఆ విమర్శకులు అవలంబించే పండితధోరణివల్ల కావచ్చు. కాని రచయితకు నిపుణుడయిన సాహిత్య విమర్శకునికి మధ్యనవున్న సహకారం వల్లనే ఉత్తమ సాహిత్యం రావడం జరుగుతుంది - గతంలోనయినా రేపయినా.

11. రచయితకు ఉపయోగకరంగా బోధించాలంటే మార్క్సిస్ట్ విమర్శకుడు పాఠకునికిగూడ బోధించాలి, పాఠకునికి చదవడం నేర్పాలి. అనుభవంలేని పాఠకులు అధికసంఖ్యలో ముందుకొస్తున్న ఈరోజు వాళ్ళకు రచనలగురించి వివరించిచెప్పే మార్గదర్శకుడు విమర్శకుడు. ఈరోజు మార్క్సిస్ట్ విమర్శకుని మీదవున్న అసాధారణమయిన బాధ్యత మరొకసారి నొక్కిచెప్పాలి, ఇదంతా ఎవ్వరినీ భయపెట్టడానికి చేస్తున్న ప్రతిపాదనకాదు. మార్క్సిస్ట్ విమర్శకుడు మొదట్లో తప్పులుచేయవచ్చు. అయితే వెల్లువగా ముందుకొస్తున్న మన సంస్కృతిని నలుమూలలా ఉద్భవిస్తున్న సాహిత్య నైపుణ్యాన్ని గణనలోకి తీసుకుంటే మార్క్సిస్టు విమర్శ యిప్పటిస్థాయిలోనే ఉండిపోతుందనుకోవడం సాధ్యంకాదు.

12 అంతిమంగా రెండువిషయాలు ప్రస్తావించదలుచుకున్నాను. మార్క్సిస్ట్ విమర్శకులు పోలీసులకు 'ఇన్ఫార్మర్స్'గా పనిచేస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తారు. ఫలానా రచయిత రాజకీయంగా నమ్మకస్తుడు కాడని తేల్చిచెప్పడం విమర్శకుని కర్తవ్యమా - అని కొంతమంది అడుగుతారు. మనం ఈరకమయిన అభ్యంతరాలను నిర్ద్వంద్వంగా ఖండించాలి. తన వ్యక్తిగతమయిన విభేదాలను ఈ పద్ధతిలో తేల్చుకునే విమర్శకుడు దుర్మార్గుడు: అతని దుర్మార్గం ఏదో ఒకరోజున బయటపడుతుంది.

సమీక్ష :

సింగరేణి పాటలు

ఎ. ఎస్.

సాహితీ ప్రక్రియల్లోకల్లా అట్టడుగు జనజీవితానికి చేరిన ప్రక్రియ పాట— పాట సూటిగా గుండెల్ని తాకుతుంది— తట్టిలేపుతుంది— శ్రమ నుండి ఉద్భవించిన పాట జనాల్లో లోతుగా ప్రభావం కల్గజెయ్యడానికి, ఆలోచించడానికి ఉపయోగపడ్తుంది. పల్లెజీవితాల గురించి రైతుకూలీల సమస్యల గురించి పాటలు విరివిగా ప్రచారం పొందినాయి— కానీ కార్మికుల గురించి నేటికీ పాట వాసిలో, రాశిలో తక్కువే— "సింగరేణి పాటలు" కార్మిక జీవితాల గురించి ప్రత్యేకంగా బొగ్గుగని కార్మికుల గురించి రాయబడ్డ పాటల సంకలనం.

ప్రభుత్వం, గని మేనేజిమెంటు, పోలీసు బలగం, పెట్టుబడి, రిట్రెంచ్ మెంట్, ఛార్జిషీట్, లేఆఫ్‌లు కంపెనీవి. కంపెనీ మూడుపువ్వులు ఆరుకాయలుగా

అయితే తాను శాస్త్రీయంగా చేసిన విశ్లేషణయొక్క ఫలితాన్ని బయటపెట్టడానికి భయ పడే వాడిని మార్క్సిస్టు విమర్శనాపద్ధతిని వక్రీకరించేవాడుగాను, రాజకీయంగా జడత్వంతో వున్న వాడిగాను నిర్ణయించాలి.

ఇలాగంటే మార్క్సిస్ట్ విమర్శకుడు 'పహరా హుషార్ !' అని కేకలేయాలని గాదు. ఇక్కడ ప్రభుత్వానికి విజ్ఞప్తి కాదు చేసేది. సమసమాజ నిర్మాణానికి ఒక రచనకుగల విలువయేమిటన్న శాస్త్రీయమయిన అంచనా. దీనినుండి సరయినపాఠం నేర్చుకోవడం, తనపొరపాట్లను సరిదిద్దుకోవడం రచయిత చేయవలసినపని.

13. చివరిగా ఒకప్రశ్న: పదునైన వాగ్వివాదాలకు (polemics) స్థానంవుందా ?

స్థూలంగా పరిశీలిస్తే, అటువంటి వాగ్వివాదాలు పాఠకుడిలో ఉత్సాహాన్ని కలిగిస్తాయి కాబట్టి వాటికి కొంత ఉపయోగం వుంటుంది. అంతేకాక, మార్క్సిస్ట్ విమర్శకుని విప్లవస్వభావం అతనిచేత సహజంగానే ఘాటుగా మాట్లాడిస్తుంది. అయితే తనవాదనలో పుష్టిలేదన్న విషయాన్ని ఈరకంగా కప్పిపుచ్చుకోవడం తప్పనిచెప్పాలి.

సాధారణ సందర్భాలలో మార్క్సిస్టు విమర్శకుడు తనకార్యానికి సద్భావం తోనే ఉపక్రమించాలి. రచనలో మంచినిచూసి దాన్ని వెలికితీయడంలోనే అతనికి ఆనందంవుండాలి, పాఠకునికి రచయితకు సహాయంచేయడం అతని ఉద్దేశ్యంగా వుండాలి. అపహాస్యానికి ఘాటయిన విమర్శకు చాల అరుదుగానే స్థానం యివ్వాలి.

[లూనషార్‌స్కీ లెనిన్ సమకాలీనుడయిన సోవియట్ రచయిత, విమర్శకుడు. అతను 1928 లో రాసిన Theses on the problems of Marxist criticism అనే వ్యాసానికి సంక్షిప్త అనువాదం.]

అభివృద్ధి చెందడానికీ, పెట్టుబడిదార్ల అభివృద్ధికీ దోహదం చేసేవి- కార్మికుల సంఘటితశక్తి, శ్రమ, సమ్మె, ఘెరావో, నెత్తురొడ్డి సాధించుకోవాల్సిన కార్మిక శ్రేయోరాజ్య విశ్వాసాలు కార్మికులవి- బొగ్గుబావి రెండు వర్గాలు పరస్పరం సంఘర్షించే కూడలి- తక్కువ పెట్టుబడితో కనాకష్టమైన సౌకర్యాల్తో, పీడించి దోపిడి చెయ్యడానికి మేనేజిమెంటు ఆలోచిస్తే, శ్రమఫలితాన్ని పొందడానికి కార్మికులు పోరాటాలు చేపడ్తారు.

"సింగరేణి పాటలు" సంకలనంలో పరిచయకర్త అచ్యుతన్‌గారు పుస్తకాన్ని పరిచయంచేస్తూ పాటలు "బావి దొరలకు అలజడి కలిగిస్తాయి బ్యూరాక్రసీ బిడ్డలౌతుందని కుదుపులపాలు కాకున్నా కనీసం సిగ్గిల్లుతారు" అని రాయడం వాళ్ల రాజకీయాలకు సరిగ్గానే సరిపోయింది- పాటలు ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికిగాని బావి దొరలు సిగ్గుపడటానికి కాదని గుర్తించాలి- వాళ్లకు సిగ్గుయెగ్గులు లాంటివి ఉంటే కంపెనీలన్నీ కార్మికులపరంచేసి సన్యాసం పుచ్చుకొందురు- అలాగే "జాతశ్రీ"గారు ముందు జాగ్రత్త తీసుకొని- అద్దాలు వగైరాలనిరాసి మాపాలిటి విమర్శకులు కొన్ని విషయాలు గుర్తించుకోమని రాశారు- నిజానికి జాతశ్రీగారే విమర్శకుని భయపడి ఉండొచ్చు కానీ రాసిన కార్మికులకు మాత్రం ఈ ఉద్దేశ్యం ఉండదని అనుకోవచ్చు- నిజానికి మంచీచెడ్డా మందిలో నిర్ణయించబడంది ఏ సాహిత్యమూ అభివృద్ధి కాదు.

పాటలన్నీ సింగరేణి కార్మికుల కష్టాలను ఏ కరువుపెట్టినాయి- నీకు రక్షణ లేదు, దవాఖాన లేదు, మొదలైన కొన్ని సమస్యలను రచయితలు తమ పాటల్లో వివరించారు- కానీ అదే సమయంలో పరిష్కారం "పోరాట జండెత్తరో", "చిందులేవేయరో," "శివమెత్తి ఆడరో" అని చూయించారు- నిజానికి ప్రజాసాహిత్యం ఇదేనా ? సమస్యలన్నీ ఏకబిగిన చూయించి చివరికి జండెత్తమని రాయడం సరియైందేనా ? ఎప్పటికీ కాదు-

పాటల్లో ముక్కుతూ మూల్గుతూవున్న, బాధలుపడిపోతున్న కార్మికవర్గం తప్ప పోరాట పిడికిలి బిగించిన కార్మికవర్గం మనకు కన్పించదు అది లోపం.

ప్రశ్నగానే మిగిలిన సాహిత్యం ప్రయోజనకారి అవుతుందా ? 'సమ్మె చెయ్యమందాం సరే ఆతర్వాత- ఒక్క బొగ్గుబావి దొరలకు వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు మర్లబడితె కార్మికవర్గానికి ఏమి ఒరుగుతుంది- రైతుకూలీలతో మమేకమై జనతా ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించాల్సిన గురుతర బాధ్యత కార్మికవర్గం భుజస్కంధాలపై వుంది పాటలోనైనా కవిత్వంలోనైనా కార్మికవర్గానికి పైవిషయం గుర్తుచెయ్యకుండా బోధించకుండా ఏమీ సాధించలేము.

ఇక పాటల్లో, రివిజనిస్టులు రాజకీయాల్లో బోధిస్తున్న వర్గవిధానమూ చోటు చేసుకుంది కె. స్వామి "బొగ్గుబావి మేనేజరు" పాటలో "నువ్వూ ఓ కార్మికుడివే విర్రవీగబోకు" అంటాడు– మేనేజరే కార్మికుడైతే ఇక పోరాటం దేనికి? "సింగరేణి చిన్నోడా" పాటలో సి. హెచ్. జాకబ్ కార్మికునికి రక్షణగురించి నీతులు బోధిస్తాడు. ప్రమాదాలు ఎందుకుజరుగుతాయో ఆ కారణాలు చూయించక ప్రమాదాలు జరిగేవి జరుగుతూనే వుంటాయి– కానీ నువ్వు జాగ్రత్తగావుండు అనడం హాస్యాస్పదం "బదిలీఫిల్లర్" పాటలో కె. స్వామి కలవారూ లేనివారూ కనపడని రాజ్యముంటే ఆయనకే తెలియాలిమరి–

సంకలనకర్త జాతశ్రీగారు తనపాట "కన్నుమలగకు"లో "నువ్వూనేనూకలిసి సమ్మె హక్కు ఎక్కుపెట్టి పిడికిలించి పోరుచేస్తే, గుండెలదిరి బాయిదొరలు కాళ్లబేరం కాడికొస్తరు ఓ కార్మికన్నా" అని అంటారు నేటి ట్రేడ్‌యూనియన్‌ల బండారం జాతశ్రీగారే ఒప్పుకున్నారీపాటలో– కాళ్లబేరానికొచ్చిన మేనేజిమెంటు, యూనియన్లు ఏమిచేస్తాయో లోకవిదితమే–

పాటలు రాసినవాళ్ళు చాలామంది కార్మికులు, తమ జీవితాల్లోవున్న సమస్యల్ని బాధల్ని, దుఃఖాన్ని ఎత్తిచూయించారు– పాట వాళ్ళసాధనంగా మల్చుకొన్నారు. నిజానికి అభినందించాల్సిన విషయం కార్మికుల్నుండి పాటరావడం– ఎలా వాళ్ళ నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలు చిత్రించడంలోనూ, వాళ్ళపరిభాష, పనిముట్ల పరిజ్ఞానంలోను కార్మికులేగనుక బాగుంది– నిజానికి సరియైన అవగాహనకల్గించే తోడు ఉంటే వాళ్లు ఇంకా గొప్పపాటలు రాయగలరు. కార్మికులు నిజమైన ప్రజాసాహిత్యాన్ని సృష్టించగలరు.

సాహిత్యం సమాజానికి ఉపయోగపడేదిగా మార్పుచెందుతుంది మెజార్టీ జనాల ఆకాంక్షల్ని పలికించే సాధనంగా రూపొందుతుంది– రైతాంగ ఉద్యమాలకూ, కార్మికుల పోరాటాలకు నేపథ్యంగా పనిచేస్తున్న సంస్థలే ఇందుకు ఉదాహరణ– మార్గం దొరికింది– ఇంకా అభివృద్ధిచెంది జనానికి అర్థమయ్యేట్లు, సాహిత్యం విరివిగా వస్తుందని ఆశిద్దాం – పాటల్ని ఆహ్వానిద్దాం–

సింగరేణి పాటలు – సంకలనకర్త : జాతశ్రీ – సింగరేణి కాలరీ వర్కర్స్ యూనియన్ ఇల్లెందు బ్రాంచి ప్రచురణ (మార్చి 81) పేజీలు, 36 + iv, వెల రు. 1-50

ప్రతులకు : విఠల్‌రావ్ భవన్, ఇల్లెందు 507 123 ఖమ్మంజిల్లా

వెన్నెల కథలు

అల్లం రాజయ్య

1967కు ముందు విశాఖపట్నంలో కాలేజీ చదువుతున్న ఓ యువకుడు తన చుట్టున్న జీవితాలుచూసి తనలోతానే మథనపడుతూ కథలురాశాడు. ఆ యువకుడే రాజేశ్వరావు- రాజేశ్వరావు మధ్యతరగతి బతుకుల్లోని చీకటి కోణాల్లోకి వెన్నెల్లా తొంగిచూశాడు. తనకుతోచిన సమాధానాలేవో చెప్పతున్నాడు. అట్లా జనజీవితం యింకా చీకటి చీకటిగా ఉండగానే చీకటంతా చిక్కిపోయి వెలుగురేకలెల్లకముందే చిత్రమైన కారణాలతో విశాఖపట్నాన్నొదిలి ఎటో వెళ్ళిపోయాడు. 1967లో విశాఖ పట్నాన్నొదిలిన రాజేశ్వరావు విశాల ప్రపంచంలో ఎక్కడో ఉంటే 1981లో కూడా చీకటిగురించి గ్లూమీగా ఆలోచిస్తుంటాడా? 1967లో డార్జిలింగులో పొడిసిన పొద్దు పొడుపు గమనించాడా?

నేనైతే గమనించాడంటాను, ఈ కథలు చదివినతరువాత మీరేమంటారో?

1964 నుండి 1967 దాకా రాజేశ్వరావు రాసిన కథలే 'ఎర్రచీర' కథల సంపుటి. 1955లో తల్లిచనిపోయి బిక్కుబిక్కుమంటూ తిరుగుతున్న రాజేశ్వరావు కథలురాసే సమయానికి సాహిత్యం గడ్డుకాలంలో కూరుకుపోయింది.

1960 నుండి 1970 దాకా తెలుగు సాహిత్యానికి గడ్డురోజులు- ఒకపక్క సమాజం కుమ్మరాంలాగా కుతకుతలాడుతూనే ఉన్నది. పట్టణ మధ్యతరగతి జనం మరీను- రాజేశ్వరావు మాటల్లో "అప్పుడాకాశం (సాహిత్యం) దేశంలో అన్యాయంలా అందంగా భయంకరంగాఉంది" పెరిగేధరలు, పెరగనిజీతాలు, నిరుద్యోగం, లంచ గొండితనం, ఆకలి, అనారోగ్యం- ఇట్లాగా మధ్యతరగతి ఒకవేపు బీదవాళ్ళను, బిచ్చగాళ్లనుచూసి జాలిపడుతుంది. పై వర్గపు జమీందార్లను, డబ్బున్నవాళ్లను, షావుకార్లను ఈసడించుకుంటుంది. ఇట్లా మధ్యతరగతి తనకన్నా కిందిమెట్టు వాళ్ల గురించి, పైమెట్టు వాళ్లగురించి ఆలోచనలైతే చేస్తున్నదికాని ఇంకా దీనికి సమాజ స్వరూపం అస్పష్టమే. పట్నంలో జమీందారులు, బీదజనంఅంటే పనిమనుషులు, బిచ్చగాళ్లతప్ప పట్నంలో తమ నెత్తురమ్ముకునే కార్మికులు, విశాఖలోనైతే ఓడరేవు కార్మికులు, యజమానులు, ఓడల్లోదిగే సీమదొరలు వీళ్ళ అసలు సిసలైన రూపం గురించి అస్పష్టమే.

ఈ గడ్డుకాలపు చివరిదశలో ఎందుచేతో విశాఖనుండే చాలామంది కథా రచయిత లొచ్చి పుంఖాను పుంఖాంగా కథలు రాయసాగారు. రాచకొండ విశ్వనాధశాస్త్రి

కాళీపట్నం రామారావు, ఎన్.ఎస్. ప్రకాశరావు, శ్రీపతి, రాజేశ్వరావు చెప్పుకోదగిన వారు.

తల్లి ప్రేమ కరువైన ఒంటరిబాలుడు రాజేశ్వరావు తనకందుబాటులో ఉన్న జీవితాలగురించి ఆలోచించసాగాడు. తనలోతానే మథనపడ్డాడు. తనచుట్టూ పరుచు కున్న జీవితంవెనుక దాగిన చీకటిలోయల్లోకి తొంగిచూడడానికి ప్రయత్నం చేశాడు. "ఎర్రచీర" కథల సంపుటిలో ఆ ఆరాటం, వెతుకులాట మనకు కనిపిస్తాయి.

అప్పటి సాహిత్యంకూడా ఇట్లా వెతుకుతూ, ఉన్నదారి కనుమరుగైపోయి దారీ తెన్నూగానక ఆదర్శవాదంతో, జాలితో బరువెక్కిపోయింది. ఈ జాలి తరువాత తరువాత కోపంగా మారుతుందని రమణారెడ్డి రాశారు. తర్వాత చరిత్ర అదే నిరూ పించింది.

ఈ కథల సంపుటిలో చిన్నవి పెద్దవి పన్నెండు కథలున్నాయి. ఈ కథలు చదివి రాజేశ్వరావు ఎలాంటివాడో తెలుసుకోవచ్చు.

"దేవుడినవ్వు"లోని పదమూడు సంవత్సరాలబాబు, "గాజుకళ్లు"లో తను చేయని దొంగతనానికి చావుదెబ్బలుతిని ఏడుస్తూ కూర్చున్న క్లీనర్ అబ్బాయి రాజేశ్వ రావుకు నకళ్లే. 'దేవుడిమనసు'లో తండ్రిజ్వరం తగ్గడానికి దేవునికి కొబ్బరికాయ కొట్టడానికి తల్లియిచ్చిన అర్ధరూపాయి తనదగ్గరి పదిపైసలుకలిపి ఆకలి బిచ్చగానికి దానంచేసిన జాలి జాలి జాబిల్లిలాంటి అబ్బాయి రాజేశ్వరావే. ఇట్లా దేవునిమీద ఆలోచనలుచేస్తూ జాలిజాలిగా ఎదిగిన ఈ అబ్బాయికి అందరబ్బాయిల్లాగే ప్రేమ చుట్టు కున్నది.

కాని ఈ ప్రేమ అచ్చంగా సినిమాప్రేమకాదు. "కథల్లో ఎక్కువసార్లు, కలల్లో తక్కువసార్లుచూసిన" ఈ ప్రేమ నిజజీవితంలో ఎట్లాఉంటుందో యువకుడైన రాజేశ్వరావు చెప్పుతాడు.

'ఎర్రచీర'లో విశాలాక్షి- పట్నంలో చదువుతున్నా తెల్లగావున్నా అంతఅందంగా ఉండని విశాలాక్షికి ఓ ప్రేమ లేఖ వొచ్చింది. "ఆ అబ్బాయి తనను ప్రేమిస్తున్నాడు కాబోలు- ప్రేమించకపోతే అలా ఎందుకు రాస్తాడు" అనుకొని ఆ అబ్బాయి ప్రేమను అందుకోవడానికి తనదికాని ఎర్రచీర కట్టుకొని బీచికి వెళ్లలేక- అనుకోని అవాంతరా లొచ్చి సమయానికన్నా ఆలస్యంగా బీచి చేరుకుంటుంది.... విశాలాక్షి మిత్రురాలు ఎర్రచీర సరళతో తిట్లుతిని ప్రేమికుడు విశాలాక్షి చూస్తుండగానే వెళ్లిపోతాడు. వచ్చిన ఒక్కప్రేమ అవకాశం 'ఎర్రచీర' మూలకంగా చివరకు రసాభాస అవుతుంది.

"మంచిమనసు - చెడ్డమనిషి"లో మంచి మనసుగల నాగరాజు తన మంచి తనానికి లోకంలో చెడ్డతనం ఎదురుపడడం చూస్తాడు. చివరకు తనను ప్రేమించిన మేన మరదలు సుమతి తనతో లైంగిక సంబంధం పెట్టుకొని కూడా తనను తిరస్కరించి తనకంటె ఆర్థికంగా ఓమెట్టు పైవాన్ని పెళ్ళాడుతుంది.

'ప్రేమ' అనే కథలో క్రిష్ణారావనే అబ్బాయి ప్రేమ అనే అమ్మాయి ప్రేమ కోసం తనకిష్టంలేనివన్నీ చేస్తాడు.... చివరకు తను అనుకున్నస్థాయిలో అతడు మాడర్నైయిణు కానందుకు ప్రేమ అతన్ని తిరస్కరిస్తుంది. 'చీకటి' కథలో కృష్ణ మూర్తి ప్రేమించిన మంజరి చేమంతి పూవుకోయబోయి మేడ మీది నుండిపడి అవిటిదై కృష్ణమూర్తికి సుఖాన్నివ్వలేనని యెంచి నిద్రమాత్రలు మింగి చనిపోతుంది. అదేరోజు అతని చెల్లెలు ప్రేమలో దగాపడి కడుపుతెచ్చుకొని విషంమింగి చనిపోతుంది.

ఇట్లా రాజేశ్వరావు ప్రేమ కథలన్నీ దగాపడ్డ ప్రేమికుల కథలే....

రాజేశ్వరావు ఎదుగుతున్నకొద్దీ అతని చూపు విశాలమైంది. 'దరిద్రం ప్రేమించే దేశంలో- అన్నం పెట్టని సర్కారుపాలనలో' రేపుడిగ్రీ లొచ్చిన తరువాత ఎదురయ్యే నిరుద్యోగం అతన్ని కలవరపరిచింది. "దేవుడు రాయనిడైరీ" కథలో నిరుద్యోగి కలలు కనిపిస్తాయి.

అప్పటికే 'మేడ' కథలో ఇంట్లోనుంచి వెళ్లిపోయిన కొడుకు లాగా ఆలోచిస్తు న్నాడు- ఈ దరిద్రం, ఈ ఒంటరితనం, ఈ నిరుద్యోగం, నుండి పలాయనం చేయ డం గురించి ఆలోచనది.... అదే పట్నంలోని బీదజనం నిస్సహాయస్థితికి గాభరాపడుతూ వుంటాడు-

ఇట్లా ఈ పన్నెండు కథల్లో వచ్చిన పాత్రలన్నీ ఏదోరకంగా దగాపడ్డవాళ్లే- 'కుడియెడమల దగాదగా - వెనుకముందు దగాదగా' అని రాజేశ్వరావు గ్రహిస్తున్నా డన్నమాట- నిజానికి ఈ దగాకు వెనుకగల సామాజిక పరిస్థితుల గురించి ఆలో చిస్తూనే- ఇట్లాదగాపడినవాళ్ల మీద వెన్నెల లాంటి జాలికురిపిస్తాడు.

అన్యాయాలు, అక్రమాలు చేసి బతుకుతున్నవాళ్ళకు "ఇప్పటికైనా బుద్ధితెచ్చు కొని బతకండి- మీరుతిని పేదవాళ్లకింత పెట్టండి" అంటాడు 'దేవుడు' కథలోహీరో- 'చలి'కథలో ప్రభాకరం తన పంచప్రాణమైన తెల్లకోటును చలికి వణకుతున్న బిచ్చ గాడికిచ్చేసి ఆనందాన్ననుభవిస్తాడు. సరిగ్గా గాంధీ "ధనవంతులు తమన్యాయమైన సంపాదనలో బీదవాళ్ళకు దానధర్మాలు చేయాలన్న"ట్లుగానే. అట్లా ఎవరన్నాచేస్తారా?

ఎందుకట్లా చేయలేరు? అనే ఆలోచన అప్పుడు రావిశాస్త్రిగారికి, రామారావుగారికి కొత్త కాకపోవచ్చు. కాని ఈ యువరచయితకు కొత్తే. కొత్త కొత్తగానైగా ఆలోచిస్తున్నాడు. "సెట్టిగారిల్లు బంగారబ్బోను. ఆయన భార్య చుంచెలుక. ఆయనో ఎలుక. పంజరంచుట్టూ పకడ్బందీగా దానం, వుపకారం లాంటి పురుగులు వాలకుండా కరంటు. (దేవుడు చూడని కథ)" అదీ ఆయన ఆలోచన. "నిఖార్సయిన విషాన్నొండ బెట్టి దానికి పాలిష్‌కొట్టి, హిట్లర్ మీసాలు తగిలించి, నూరో నంబరు నూలుపంచె, ఖద్దరులాల్చీవేసి చేతికి ఓ కర్రిస్తే" (అదేకథ.) ఎలాంటి మనుషులవగలరో అలాంటి మనుషుల చేతుల్లో దేశమున్నదని అప్పుడప్పుడే గ్రహిస్తున్నాడు.

ఈ సమస్యల సుడిగుండాల్లో మధ్యతరగతి ఏమాలోచిస్తుంది? "మిషన్లలాగా బతకడమేనా? కొంచెం చిరునవ్వులు, చల్లని సంతృప్తి ఇవి లేకపోతే ఎలాగా.... (దేవుడి మనసు)"

"ఎన్నో వేలమంది ఆర్తనాదాలనణచుకొంటూ చలికి వణికిపోతూ, ఆకల్ని అణచుకోలేక బాధల్ని భరించలేక వరదల్లాంటి కన్నీళ్ళతో ఏమీతోచక అలమటించి పోతున్నారు.... వాళ్ల గతేంకావాలి.... (చలి)"— ఇదీ రాజేశ్వరావు వెతుకులాట.

ఈ బాధలు పోవాలంటే మానవుడు తను సృష్టించిన తిండి, బట్ట, గూడు పొందాలంటే జాలితప్ప మార్గంలేదా? అది ఈ రచయితకు ఊహకందలేదు.

రాజేశ్వరావు ముందుగా దేవున్నడుగుతాడు. 1967 కు ముందు ఎదిగీ ఎదగని మనసుగల మధ్యతరగతి యువకుడు దేవున్ని ప్రశ్నించడం వింతకాదు. ఏడు కథల్లో ఏదో ఒక సందర్భంలో దేవున్ని నిలదీస్తాడు. కొన్నిసార్లు దేవునికేసి మొగ్గుతాడు. మరికొన్నిసార్లు దేవుని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తాడు. "కనిపించని దేవుడికన్నా కాఫీ నయం". అంటాడు "దేవుడురాయనిడైరీ"లో నిరుద్యోగి,

విశాఖ కథారచయితల్లో చాలామంది మీదలాగే కథనంలో, శైలిలో భాషలో రావిశాస్త్రి ముద్ర కనిపిస్తుంది.... ఈ కథలు చదివి పక్కనపెడితే కథల్లోనిపాత్రలు మనలను ఎటాక్‌చేయవు. రచయిత ఎటాక్‌చేస్తాడు. 'రచయిత మాటకారితనం' గురించి విస్తుపోతాం.

రాజేశ్వరావు నాన్నగారు భయపడ్డట్టుగానే అతి చిన్నవయసులోనే ఇతనిలో చీకటిగూడు కట్టుకపోయింది. ఆ చీకటి ఎంత భయంకరమైందో 'చీకటి' కథలోని కృష్ణమూర్తిలో మనంచూస్తాం.

రాజేశ్వర్రావు అతి పిన్నవయసులోనే లాస్యం, హాస్యం, కన్నీళ్లు, కోపం, వ్యంగ్యం, వెటకారం, అన్యాయం, అధర్మంయెడల కథకుడికివుండే కసిని ప్రదర్శించి వెళ్లిపోయాడని రావిశాస్త్రిగారు చెప్పినమాట నిజమే.

రాజేశ్వర్రావు ఇల్లువిడిచి వెళ్లిపోయిన తరువాత మూడేండ్లకు విశాఖ, శ్రీకాకుళంలో జనజీవితం పోటెత్తింది ... ఆంధ్రాయూనివర్సిటీ విద్యార్థులు (రాజేశ్వర్రావు మిత్రులేనేమొ ?) రచయితలను 'మీరెటని' నిలదీశారు. విప్లవ రచయితలసంఘం 1970లో ఏర్పడింది.

లోకంలో జరిగే అన్యాయాలకు అక్రమాలకు మూలమేమిటో రచయితలు గ్రహించారు. జాలినుండి కోపం, కసి పుట్టాయి. ఫిర్యాదులూ, పిటూరీలస్థానే- పునాదుల కదలికలగురించి వర్ణించారు. ఆదర్శవాదం, వ్యక్తిచైతన్యంస్థానే వర్గపోరాట మొచ్చింది. ఇవ్వాళ కథ పోరాట ఆయుధంగా మారింది. పట్నాల్లోని మధ్య తరగతినుండి గ్రామాల్లోని ప్రజలదగ్గరికి వెళ్ళడానికి కథ తన బుడి బుడి అడుగులతో బయలుదేరింది.

మరి రాజేశ్వర్రావు ఏమయ్యాడో ? అతను ఇంకా ప్రజల్లోఉంటే, వర్గపోరాటంలో ఉంటాడని నేననుకుంటున్నాను. "అంత చిన్నవయసులోనే దేవుడి గురించి ఆలోచించినవాళ్లు తరువాత్తరువాత ఎన్నెన్నో దూరాలు, దృశ్యాలు చూడగలరు" మరి....

రాజేశ్వర్రావనే యువకుడి వెన్నెలలాంటిమనసే ఈ కథల పుస్తకం. కథల పుస్తకాలు కరువైనకాలంలో విశాఖ రచయితలసంఘం ఈ కథలువేయడం హర్షించదగిన విషయమే.

ఎర్రచీర, కథలసంపుటి- శ్రీరంగం రాజేశ్వరరావు, ప్రచురణ : విశాఖ రచయితల సంఘం (ఏప్రిల్ 1980) 148 పేజీలు, ఐదురూపాయలు ప్రతులకు : శ్రీరంగం సుబ్బారావు, 25-40-15, గానుగలవారివీధి, (లక్ష్మిటాకీసువద్ద) విశాఖ పట్నం 530 001.

గీతాయుధం

సిరా

విప్లవ సాహిత్యం ఎందరో సాహిత్యకారుల్ని చైతన్యవంతుల్ని చేసి, వాళ్ళ దృష్టిని పేదప్రజల జీవితాల్లోని బాధలవైపు, సమస్యలవైపు, వాళ్ళ పోరాటాలవైపు మళ్ళించింది. ఇలాంటి వారిలో "గీతాయుధం" కవి కె. అంజయ్య ఒకరు. "ప్రగతి శీల భావాలను ఆహ్వానించి, సమాదరించి ప్రచారం చేయటం" తన లక్ష్యంగా పెట్టు కున్నాడు, కాబట్టే ఆయన "నా శరీరాన్ని ఢమరకగా మోగిస్తూ సంచలనం రేపుతా" నంటున్నాడు.

"గీతాయుధం" పేరు చూడగానే యిదేదో భగవద్గీత లాంటిది అనుకోవటం పొరపాటు. కవితల్లోకి వెళ్తే రక్తజ్వలనం కనిపిస్తుంది, వినిపిస్తుంది. ఈ కవితా సంకలనంలో 46 కవితలున్నాయి. కొన్ని కవితల్లో అస్పష్టత, అయోమయం ఉన్నప్ప టికీ ఎక్కువ భాగం గేయాలు స్పష్టంగా, సూటిగాఉన్నాయి. మాటల్ని పొదుపుగా అర్థవంతంగా వాడటం యీ కవితల్లో ఒక సుగుణం.

ముందుగా యీ కవితల్లోని కొన్నిలోపాల్ని చర్చిద్దాం. కొన్ని కవితల్లో కవి, పాఠకులకు అర్థంకాని అస్పష్టభావాలు, భావచిత్రాలు నిరాశవాద ధోరణులు ప్రద ర్శించాడు. "స్వేచ్ఛాగీతం"లో కవి ఏరకమైన స్వేచ్ఛను కోరుకుంటున్నాడో అర్థం కాదు. ఆయన కోరుకుంటున్నది ఆర్థికస్వేచ్ఛా, సాంఘిక స్వేచ్ఛా, భావస్వేచ్ఛా లేక యివన్నీ కలగలిసిన స్వేచ్ఛా? ఆయన కోరుకుంటున్నది ఎలాంటి స్వేచ్ఛో పాఠకులకి స్పష్టం కావాలి. అస్పష్టంగా 'నేను స్వేచ్ఛను కోరుకుంటున్నాను' అంటే సరిపోదు. 'కాంతి కళ' కవిత అర్థం వరకు సజావుగా సాగి అక్కడి నుండి అస్ప ష్టంగా, అయోమయ భావచిత్రాలతో నడుస్తుంది. క్రమంలేదు. భావం తెగిపోయింది కొన్ని కవితల్లోని సింబాలిజం ఒక పట్టాన అర్థంకాదు. ఉదాహరణకి 'బ్యాండేజ్' కవిత ఈ కవితలో కవి ప్రతీకగా చేసిన "అరచేయి" దేనికి ప్రతీకో పాఠకులకి అర్థం కావటం కష్టం. ఇందులోనే "టింగ్ టింగ్ మని / పచ్చి విషాన్ని ఇంజెక్ట్ చేస్తున్న గడియారపు ముళ్ళు" అంటాడు కవి. గడియారపు ముళ్ళని విషాన్ని ఇంజెక్ట్‌చేసేవిగా చెప్పటం ప్రతికూల ధోరణి. గడియారపు ముళ్ళు దొర్లిపోతున్న క్షణాల్ని, మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తాయి.

'పిరికివాడు', 'సృష్టికావ్యం' లాంటి గేయాలు అర్థంకాని భావచిత్రాలతో కూడవున్నాయి. ఇట్లాగే "కిరణ సంగీతం"లో "అంతరాత్మ భూమితో / మంతనాలు దున్ని" అనే అర్థంకాని భావచిత్రం వ్యర్థం. 'భయం' కవితలో చావంటే జడవడం

మామూలే / ఆఖరికి విప్లవమైనా సరే"- అని చెప్పటం, కవికి విప్లవం గురించి, విప్లవకారుల త్యాగాల గురించి సరైన అవగాహన లేకపోవటం వల్లనే. విప్లవకారులు చావుకు భయపడరు. విప్లవంలో ప్రాణత్యాగం అనివార్యం. ఆ త్యాగాల చాలుల్లోనే సమసమాజం మొలకెత్తుతుంది. విప్లవ కారులకి పిరికితనం ఆపాదించటం మంచిది కాదు. "మార్క్సిస్టు కన్ను" గేయంలో కవి "తీవ్రవాది దోచిందంతా పంచుతాడని అందరికీ తెలుసు" అన్నాడు. విప్లవకారుల్ని తీవ్రవాదులని, వీరు ప్రజల్ని దోచు కుంటారని పాలకవర్గాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. వీళ్ళు వాడిన పదాలను, భావా లను 'గీతాయుధం' కవి వాడటం శోచనీయం. 'మూల్గు'లో కవి "ఎదిరించలేని / తలలపై పాగాలు మోపెడి / మనుజుల చూచి / నా యెద / బాధతో మూల్గుతుంది అనటం సరైంది కాదు. దోపిడిపై తిరగబడుమని ప్రజలకు చెప్తూ కవి ఓమూలన మూల్గుతూ కూర్చుంటే ఎలా? కవి జనంలో భాగం కావాలి.

పైనచెప్పిన లోపాలున్నా, 'గీతాయుధం' కవితా సంకలనంలో మంచిగేయాలు ఉన్నాయి. కొన్నిగేయాల్లో కవి తన భావాల్ని చాలపటిష్టంగా, మనసుకు హత్తుకునేట్లు వ్యక్తంచేశాడు. 'చైతన్యరేఖ' కవితలో "కవిత్వాన్ని / అగ్గిపెట్టెగామార్చి / గీతాల పుల్లలు / గీపెడి నాజాతి / అరచేతిరాపిడిలో రాలిన / వడ్లపొట్టునుండి / జ్వాలల్ని రేపు తుంది"అని, కవి పీడితజనంలోని పోరాటపటిమను చాటుతున్నాడు. 'కాంతికళ' కవితలో "వెన్నెలనాచులో / మనసు కాలుజారిందా / ఇంతవరకు / నింగిన సవితలావెలిగిన ఆశ యాలు / పాడెపై పవళిస్తాయి"అని కవి మనల్ని హెచ్చరిస్తున్నాడు. 'చరిత్రచువ్వలు' కవితలో "అడవి కౌగిట్లో దాక్కున్న / నిప్పును / జనం గుండెల్లో దాక్కున్న బడ బాగ్నిని / గుర్తించలేనివాడు / స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని అమ్ముకున్న బానిసజాతివాడు" అని, బానిస మనస్తత్వం కలవాళ్ళని ఎద్దేవా చేస్తాడు. ఈ గేయంలోనే, నియంతల రాక్షసత్వాన్నిగూర్చి చెప్తూ కవి, వీళ్ళనిఎదిరించి, నాశనంచేయాలంటే జనం చేతులు కలిపి ఎదురుతిరగాలని లేకుంటే యీ మురుగుడు చరిత్ర యిలాగే కొనసాగుతుందని హెచ్చరిస్తాడు, జనాన్ని / 'ఎండ' గేయంలో జీవితంలోని స్తబ్ధతని నిరసించి చైతన్యం నింపుకొమ్మని యిలా ఉపదేశమిస్తాడు- "మెదడులోని / ప్రతి అణువులో / బాంబులు బద్దలౌతున్నట్లు/తెగని ఆలోచనలు / చాకిరేవు బండల్లా/ఎన్నాళ్ళీజీవితాలు" 'విప్లవం' గేయంలో కవి, దోపిడీ దారుల్నిగూర్చి "దోసిళ్ళతో నెత్తురుతాగిన గుండె/పిడికిళ్ళతో/ మెతుకులు విదిలిస్తుంది"అని గొప్పభావం వ్యక్తంచేశాడు. 'నక్కజిత్తుల కుక్కలో-' "ఎదురుతిరగటం చేతగాకుంటే కాలం పిచ్చికుక్కై కరుస్తుందనటం బాగుంది.

పుస్తక స్వీకారం

1. ఏది మినీ కవిత? వ్యాసం- రావి రంగారావు- స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్నం ప్రచురణ [ఏప్రిల్ 81] 12 పేజీలు- 25 పైసలు-
2. గుడ్ మార్నింగ్- రావి రంగారావు మినీ కవిత- స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్నం ప్రచురణ [మే 81] పేజీలు : 48 + xii, వె : రు. 8-00 ఈ రెండు పుస్తకాలూ ప్రతులకు : స్పందన సాహితీ సమాఖ్య, 26-162, బుట్టాయిపేట, మచిలీపట్నం - 521001
3. ఎర్రగాలి విప్లవకవితలు- జైరామ్ జులై 81 పేజీలు : 70 + xvi, వెల : రు. 6-00 ప్రతులకు: జైరాం, 20/142, హనుమేశనగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.
4. ఉప్పెన - నవల - సరిపల్లి కృష్ణారెడ్డి - హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ [మార్చి 81] పేజీలు: 150 + viii, వెల : రు. 5-00, ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3-6-695, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500029
5. హేతువాదం ఎందుకు? - హేతువాదవ్యాస సంకలనం - నెల్లూరుజిల్లా హేతువాద సంఘం ప్రచురణ [జులై 81] పేజీలు : 62 + iv, వెల : రు. 3-00 ప్రతులకు : జె. మార్కండేయులు, 21/542, భాష్యకార్లవారివీధి, పెద్దబజారు, నెల్లూరు 524001 (లేక) పి. కొండలరావు, C/o పి. భీమన్న, 36-25-21, సప్పావారివీధి, ఇన్నీస్‌పేట, రాజమండ్రి - 533102
6. రోడ్డుమీద సూర్యుడు- కవితా సంకలనం- కె. రాంమోహన్‌రాజు- [ప్రచురణ ఆగస్టు 1981] పేజీ : 36 + viii, వెల : రు. 3-00, ప్రతులకు : సృజన, హనుమకొండ - 506001.

'బొగ్గు', 'సంచలనం', 'కళ్ళనది', 'మరొక్కమారు వేదాంతంలోకి', 'నిప్పు చూపు', 'పరిష్కారం', 'మరో ఉదయం', 'పిచ్చినమ్మకం', 'జ్వాలానాదం', 'ఆవిష్కార'- గేయాలు బాగున్నాయి.

స్ఖలిత స్వప్నాలు, మానాల్నినాకటం, ధూమిస్తనాలులాంటి పదచిత్రాలు కవి వదులుకుంటే మంచిది.

బూగోడాపట్టటం, దండుగుపడేసుకోవడం, గూత, గూళాడులాంటి పదాలకు అర్థాలు యిచ్చివుంటే బాగుండేది.

గీతాయుద్ధం, కవితాసంపుటి- కె. అంజయ్య, ప్రచురణ జనవరి 1981, ప్రతులకు ; చైతన్యసాహితి, 5-2-85, పారిపల్లివీధి, సిద్దిపేట, 502103, 64 పేజీలు వెల రు. 4-00

సాహిత్యం మార్క్సిజం - చర్చ

సురేంద్రరాజు

త్రిపురనేనిని విమర్శిస్తూ నేను రాసిన వ్యాసానికి సమాధానంగా కె బాలగోపాల్, సి. రామచంద్రారెడ్డిగారలు రాసిన వ్యాసాల్లో ఎదుటివాడిని అజ్ఞానిగాతలంచి తమ నిశ్చితాభిప్రాయాల్ని ఉపన్యాస ధోరణిలో ఏకరువు పెట్టడంతప్ప వేరొకగుణం నాకు కనిపించలేదు. నేనురాసిన విషయాల్ని సరిగ్గా చదవకుండా, అర్థంచేసుకోకుండా తమ తమ పూర్వాభిప్రాయాల్ని ఏకరీతిలో వల్లించడం మినహా వాళ్లు సాధించిందేమీ లేదు.

రొటీన్‌కు వ్యతిరేకంగా మాట్లాడేసరికి నన్ను యధావిధి తమ శత్రువుక్రింద జమకట్టి గుడ్డిగా నిందించడంలో వాళ్లు కృతకృత్యులయ్యారు. వాళ్లభ్యసించిన భాషలో మాట్లాడితేతప్ప అర్థంచేసుకోలేని వాళ్ల కుబ్జత్వాన్ని గర్హిస్తున్నాను. వీరిద్దరు నేను ప్రతిపాదించిన కొన్నివిషయాల్ని 'నిర్ద్వంద్వంగా' ఖండించారు. దోల్డెంత ఆనంద మేసింది. ఇప్పుడు తిరిగి వాళ్ళవిమర్శలకి నేను ఓపిగ్గా సమాధానాలివ్వాలనుకుంటే, నా వ్యాసాన్ని తిరగరాసి పంపడంమినహా మరోమార్గంలేదు. కనుక వాళ్లు తప్పుగా అర్థంచేసుకున్న సందర్భాల్ని, లేనిఅర్థాల్ని కల్పించి వాళ్లుచేసిన వ్యర్థప్రసంగాల్ని హితబోధచేయబూనిన సందర్భాల్ని, ఇంకా అనేకానేక సర్కస్‌ఫీట్లనీ, యుద్ధవిన్యాసాల్నీ, వారి ప్రతిభాచాతుర్యాల్నీ ఎత్తిచూపే ప్రయత్నం మాత్రమే చేస్తాను.

వీరిద్దరి రాసే పద్ధతిలోనే, శైలిలోనే చర్చకుగాని, సంభాషణకుగాని తావులేదు. వాళ్లవి అంతిమ అభిప్రాయాలు, నిర్ణయాలు, తీర్పులుకూడా. (ultimate judgements) నా అభిప్రాయాల్ని తిరిగి ఈ రూపంలో స్పష్టంగా చెప్పాలని ఈ ప్రయత్నం.

కె. బాలగోపాల్ వ్యాసపరీక్ష :-

1. కార్యకారణసంబంధాలకు సంబంధించిన భాషలో (cansal termes) మాట్లాడ్డానికి అలవాటుపడ్డ కె. బి. గారికి ఆ కారణాల ఫలితాలనుగూర్చి రాసిన నా భాష ఎట్లా అర్థమౌతుంది ? (in terms of effects). పునాది (Base) లో జరిగే మార్పులగురించి మాట్లాడ్డంతప్ప ఈ మార్పులు ఉపరితలాన్ని ప్రభావితం చేయడం వల్ల కలిగే ఫలితాలగురించి ఆలోచించడం మరిచిన కె. బి నన్ను తప్పుగా అర్థచేసు కోవడంలో పెద్దగా ఆశ్చర్యపోవాల్సిందేమీలేదు. పునాదిగురించి తెలీకకాదు, ఆర్థిక (ఉత్పత్తి) సంబంధాల్లో ఏర్పడ్డమార్పుల్ని పేర్కొనంది అట్లా మాట్లాడ్డంవల్ల ఏ

ప్రయోజనమూ లేదని నా అభిప్రాయం. అందువల్లే పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషి కృత్రిమవిలువల్ని పాటిస్తాడని, పరాధీనుడుగా, శకలంగా, ఏకాకిగా మారతాడని నేనంది. మారకపువిలువ (exchange value) వాడకపువిలువ (use value) స్థానాన్ని ఆక్రమిస్తుందని నాకుతెలీకకాదు నేనీ 'పొరపాటు' చేసింది. ఉపరితలాన్ని (Super structure) పునాది నిర్ణయిస్తుందనే విషయంలో నాకెట్టి అనంగీకారమూలేదు. (cansal terms) లో మాట్లాడినంతకాలం మనమేం మాట్లాడీ వృధా. పాఠకుడికి మీ 'సాంకేతిక పరిభాష' (Jargon) అర్థంకాదు. జీవితంపై ఆ వ్యవస్థ ప్రభావాన్ని, దని ఫలితాల్నిచెపితే పాఠకుడికి ఏమన్నా ఉపయోగం.

2. పెట్టుబడిదారీ వ్యవస్థలో పాలకవర్గ భావాలు మనుషుల్ని అంధులుగా, వెధవలుగా, సామాన్యులుగా మారుస్తాయని నేనన్నదాన్ని ఖండించడానికి కె. బి పెట్టుబడిదారీ వ్యవస్థకు కావల్సింది అంధులు, వెధవలుకారు, శాస్త్రజ్ఞులు, సమర్థవంతులు కావాలన్నారు. వీళ్ళు అంధులు, వెధవలుకారనా మీ ఉద్దేశ్యం. వ్యవస్థను పరిరక్షించే వాడెవడైనా వెధవేఅవుతాడు. "సంస్కారహీనులు" (philistines and conformists) అనే అర్థంతో నేనామాటలు వాడింది. మీరలా భుజాలు తడుముకోవడం దేనికో అర్థంకాదు. అంధులు, వెధవలుకనకే వాళ్లాపనులన్నీ చేయగల్గేది. మీకింకా అర్థంకాకపోతే నేనేంచెయ్యలేను.

3. నా విమర్శలో నాగొంతు (tone)ను అర్థంచేసుకోకుండా దేవదాసు ఫక్కీని నాలో పసిగట్టారు. ఆందోళన, కసి, దుఃఖం, తపన ఇత్యాది లక్షణాలున్నవాళ్లు దేవదాసుకాక తప్పదన్న మాట మీనిఘంటువులో।

4. రైల్వే కార్మికులసమ్మె ప్రస్తావన, నక్సలైట్లపిరోచిత మరణాల ప్రస్తావన మన చర్చలో అనవసరం. సాంస్కృతికంగా పాలకవర్గం మనుసుల్ని ఎట్లా దోపిడీ చేస్తుందనేదే ఇక్కడ చర్చనీయాంశం. సురేంద్రరాజు ప్రపంచంలోని పాలకవర్గం దోపిడీవర్గంగా కె. బి.కి కనిపించకపోవడం చాలావిచారకరం. ఆర్థికంగా రాజకీయంగా జరిగే దోపిడీ గురించి ప్రస్తావించనంత మాత్రాన సురేంద్రరాజు ప్రపంచం వింతైనదిగా కనిపించింది; మనం దేనిగురించి మాట్లాడుతున్నామో మర్చిపోయి అసంబద్ధంగా మాట్లాడంవల్ల ప్రయోజనం శూన్యం. ఆ విషయాల్ని మరో, వేదికపై తిరిగ్గా చర్చించుకోవచ్చు.

5. ఆందోళన, కసి, వగైరా భావాల్ని కల్గించే వాస్తవాన్ని కోపంతో స్వీకరించచాలిగాని ఆనందంగా స్వీకరించడమేమిటని ఆశ్చర్యపోయారు కె. బి. పైగా

ఆనందంగా స్వీకరించడానికి వెనకవున్న గూఢార్థాన్ని మార్క్సిసాయంతో కనుక్కోగల్గారుకూడా. ఆనందంగా.... అంటే నాదృష్టిలో ధైర్యంగా, బలంగా, వెనుకాడకుండా, [withease] స్వీకరించడమని. అంతకుమించివేరే వక్రార్థాలు ఏంలేవు.

6. విప్లవభావాలు భౌతిక, సామాజిక వైరుధ్యాలనుండి జనిస్తాయని కె. బి. నాకు చెప్పక్కర్లేదు. అయితే ఆభావాలు గాల్లోవూరేగవు. ఆ భావాల్ని ప్రతిబింబించే మనుషుల్లేకుండా ఆభావాలకు అస్తిత్వం లేదు. వాస్తవాన్ని అవగాహనచేసుకున్న మనుషులు మాత్రమే ఆ భావాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. అట్టి భావాలు ఆయా వ్యక్తుల నిర్ణయాల కతీతంగా వాళ్ల జీవితాల్లోకి, ఆలోచనల్లోకి ఎట్లా ప్రవేశిస్తాయో కె. బి. వివరిస్తే తెలుసుకొని సంతోషిస్తాను. ఆ భావాలకు ప్రతినిధులుగా (Human Subjects) జీవించాలని నిర్ణయించుకున్నది వాళ్లే కాబట్టి ఆ నిర్ణయం (decision) వెనక దాగివున్న వైరుధ్యాలాన్ని నేను 'నైతిక బాధ్యత' అని అన్నాను. ఆ పేరుతో గాక దాన్ని మరోపేరుతో పిలవడానికి నాకెలాంటి అభ్యంతరాలు లేవు.

7. 'క్షీణబూర్జువా' సాహిత్యం ఎదురుతిరిగింది సామ్రాజ్యవాద పూర్వ యుగపు బూర్జువా విలువలకు (హేతువాదం, ప్రగతివాదం వగైరా) గాని, బూర్జువా విలువలకు కాదు అని ఓ గొప్పసత్యాన్ని ప్రవచించారు కె. బి. యదార్థవాద, ప్రగతివాద, హేతువాద ప్రస్తావనలేకుండా బూర్జువా విలువల్ని తిరస్కరించిన సాహిత్యం 20వ శతాబ్దంలో పుష్కలంగావుంది. కావాలంటే సెలిన్, బెకెట్, సార్త్రె, కాఫ్కా, ఆర్తాడ్‌లను ఇంకా అనేకుల్ని చదవండి తెలుస్తుంది; అనవసరంగా సాల్‌బెల్లో అనే ఓ దగుల్బాజీ ప్రస్తావన దేనికి? నేనుదహరించిన రచయితల్ని వదలి Bellow ను ప్రస్తావించడం దేనికో మీకేతెలియాలి. ఏవో 'సిద్ధాంతాల్ని' ఆసరాచేసుకుని అర్థంలేని అవగాహనలనేర్పుకోవడంలో మీకుమీరే ('మార్క్సిస్టులు') సాటిఅని ఈ సూత్రీకరణ మరోసారి రుజువుచేసింది.

ఓ పక్క 'నిర్ద్వంద్వంగా' ఖండిస్తూనే మరోపక్క 'సీరియస్'గా పరిశీలించాల్సిన అవసరంవుందనడంలో ఏదో అమోఘమైన 'ప్రయోజనాన్ని' కాంక్షిస్తున్నారనుకోక తప్పడంలేదు.

క్షీణసాహిత్యాన్ని సృష్టిస్తున్న రచయిత క్షీణవిలువల్ని ప్రతిబింబిస్తున్నాడేతప్ప వాటిని కాపాడాలనుకోవడంలేదు. ఆ విలువల్ని ప్రచారాలనుకోవడంలేదు. ఆ రచయితలు వాళ్ళు చిత్రించేవాస్తవాన్ని వాంఛిస్తున్నారనే భ్రమల్లో వుండడంవల్లే మార్క్సిస్టులు క్షీణసాహిత్యాన్ని విమర్శించడం జరిగింది పైగా సైద్ధాంతికంగా సమస్యల్ని

పరిష్కరించలేని 'దుస్థితి' వారిది ఇంతఘోరమైన అపగాహన ఏర్పర్చుకోవడం బహుశా ఎవరికీ సాధ్యంకాదనుకుంటాను.

8. చివరగా చిన్న సవరింపు : 19వ శతాబ్దం చివరిభాగపు బూర్జువాకు ప్రపంచం అందంగా కనిపించిందనడానికి మీరు 16వ శతాబ్దపు Ben Jonson ను కోట్ చేశారు. మన్నించాలి. ఆ మాటలన్నది 19వ శతాబ్దపుకవి పేరు రాబర్ట్ - బ్రౌనింగ్ (Browning).

సి. రామచంద్రారెడ్డి వ్యాస పరీక్ష :- నేను వ్రాసిన అన్ని విషయాల్ని వక్రీక రించి (misinterpretation) నా ఆలోచన వక్రమైనదని, కుంచించుకుపోయిందని ఋజువుచేశారు రెడ్డిగారు ఉదాహరణలు కోకొల్లలు.

1. "ఉత్పత్తి చేయబడిన రచనతన పాఠకుల్ని సృష్టించుకుంటుంది" (మార్క్స్) అన్న నా అభిప్రాయాన్ని "అర్థంచేసుకోగల కొందరి కోసమే సాహిత్యం సృష్టించ బడుతుందనేది" నా అభిప్రాయంగా వక్రీకరించారు. సాహిత్యం 'కొందరి కోసం' కనుక అది అయోమయంగా, ఆత్మాశ్రియపరంగా, కూడవుంటుంది. అయోమయంగా రాస్తేతప్ప గొప్పరచన కాదన్నది నాఅభిప్రాయమని వీరివుద్దేశ్యం. ఆ అయఃపిండా లేమిటో" ఎట్లా వుంటాయో నాకైతేతెలీదు. ఇట్లా నేను ఉద్దేశించని అర్థాల్ని వెలికి తీయాలని వీరి తాపత్రియం, ప్రియత్నం. నా అభిప్రాయాలు Critical గా పరిశీ లించాలి తప్ప ఇట్లా వక్రీకరించడంవల్ల ఏమిటి ప్రియోజనం ? నావ్యాసాన్ని మరో సారి చదువుకోవడం శ్రేయస్కరం.

2. "శాస్త్రప్రగతి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే పరాకాష్ఠనొందింది" అని నేను రాసిన వాక్యంలో సోషలిస్టు వ్యవస్థలో శాస్త్రప్రగతి జరగాల్సిందేమీ వుండదనే అర్థం ఆయనకు గోచరించడం నిజంగా గొప్ప విషయం. ప్రతిచోటా సదవగాహన వారిసొత్తు, అనవగాహన, వీలైతే దురవగాహన నా వంతు. దీని ఫలితంగా నా కోసం సవివరంగా ఓచిన్న ప్రసంగపాఠం చేశారు. చాలా శ్రమపడ్డారు.

3. భౌతికావసరాల పరిధిలో జీవించే మనిషి కళల్ని ఆనందించలేడని, భౌతి కావశ్యకత నుండి స్వేచ్ఛపొందినప్పుడు మాత్రమే మనిషిలోని కళాకారుడు స్వేచ్ఛగా బహిర్గతుడౌతాడని నేనన్నదాన్ని పూర్తిగా వక్రీకరించడానికి ఆకలేస్తే భోంచేయని వాళ్లని, శారీరకావసరాల్ని లెక్కచేయని వాళ్ళని గాలిభుజించే ఋషుల్ని ప్రవేశ పెట్టారు" స్వంతఆస్తి రద్దుకావడంతో మానవులకు భౌతికావశ్యకతలు వుండవని,

ఆ అవసరానికి అతీతులై పోతారని నేననుకున్నానని ఆయననుకుని నాకు హితబోధ. నేనురాసిన ప్రతిదాన్నీ వక్రీకరించి నన్నునిందిస్తే తప్ప ఆయనకు తృప్తి కల్గేలాలేదు.

4 సాహిత్యాన్ని ఆనందించాలనుకునేవాడికి సహజంగావున్న 'అవయవాలు' పనిపోతాయని వీరి ఉవాచ. దీన్నే 'క్షుద్ర భౌతికవాదం' (Vulgar materialism) అంటారు. "సాహిత్యానికిచెందిన ఇంద్రియాలు" అని నేనన్నదాన్ని వీలైనంత దిగజార్చి అవి ఎక్కడ లభిస్తాయో చెప్పమని కోరుతున్నారు. సాహిత్యానికి చెందిన ఇంద్రియాలు అంటే నాపుద్దేశ్యం literal గా ఇంద్రియాలనికాదు, సాహిత్యాన్ని ఆనందించగల సంస్కారం, మానసికపరిణతి, జీవితంపట్ల ప్రగాఢమైనప్రేమ, సాహిత్యాన్ని జీర్ణించుకోగల జీర్ణశక్తి, సాహిత్యంపట్ల తీవ్రఅనురక్తి వగైరా వగైరా వుండాలని సాహిత్య ఇంద్రియాలంటే సాహిత్యానికి స్పృశించగల గ్రహణ శక్తి స్పందించగల జిజ్ఞాసగా అర్థంచేసుకోవాలి. ఆ ఒక్క వాక్యం సరిగ్గాలేదు. దానిని ఈ క్రిందివిధంగా ప్రచురిస్తే బాగుంటుంది. సాహిత్యఇంద్రియాలంటే సాహిత్యాన్ని స్పృశించగల గ్రహణశక్తి, సాహిత్యానికి స్పందించగల జిజ్ఞాసగా అర్థంచేసుకోవాలి.

5. చలం 'లాంటి' రచయితల్లోని 'అభ్యుదయాంశను' మార్క్సిస్టులు 'మెచ్చుకున్న' సంగతి జగద్విదితం- ఈమధ్య 'సృజన' వేసిన చలం ప్రత్యేకసంచిక తెరచిచూస్తే వాళ్లర్థం చేసుకున్న ధోరణి ఇట్టేబోధపడుతుంది. చలం సాహిత్యం నిర్వర్తించాల్సిందేమీలేదని, చలం గతానికి చెందినవాడని, చలం ప్రభావం ఇవ్వాళ లేదని, ఆ అవసరంకూడాలేదని, చలంకన్నా ఇవ్వాళ సాహిత్యం అనేకరెట్లు ఎదిగిందని చలం తన బాల్యాన్ని అధిగమించలేదని (కె. వి. రమణారెడ్డి), ఇంకా ఎన్నెన్నో ఆరోపణలు, సూత్రీకరణలు, నిశిత పరిశీలనలు. చలానికి ఇంతవరకూ ఏమార్క్సిస్టు న్యాయం చేకూర్చలేదని నా ఆరోపణ. కొందరేమో తమ అంతరంగాల్లో ఆరాధించినా ఉపన్యాసాల్లో, వ్యాసాల్లోమాత్రం తమ సిద్ధాంత నిష్ఠాగరిష్ఠతకు భంగం వాటిల్లకుండా కొసరి కొసరి మార్కులు వేస్తారు. కనుక ఇవ్వాళ చలాన్ని చలంలాంటి రచయితల్ని మార్క్సిస్టులు గుర్తించారంటూ 'మార్క్సిస్టులు' తరఫున వకాల్తా పుచ్చుకోవడంలో అర్థంలేదు.

6. బూర్జువావిలువల్ని ధ్వంసంచేసి గతాన్ని పునః ప్రతిష్ఠిస్తామని బోదలేర్, వైల్డ్‌లు రెడ్డిగారికి కల్లోకనిపించి చెప్పివుంటారు. ఎవరు ఏ ఏ విలువల్ని ప్రతిష్ఠిస్తారనేది వీరేనన్నమాట నిర్ణయించేది. వాళ్లను కనీసం చదవకుండా ఇట్లా judge చెయ్యడం నేరాల్లోకెల్లానేరం. వీరి 'శబ్దార్థచంద్రిక'లో మార్క్సిస్టులుతప్ప మిగతా

వాళ్లు బూర్జువావిలువల్ని తిరస్కరించిన ప్రతిసారీ గతాన్ని, భూస్వామ్యవిలువల్ని పునః ప్రతిష్ఠిస్తారన్నమాట.

7. నన్ను వ్యక్తివాదిగా, ఆత్మాశ్రయవాదిగా, ఆధ్యాత్మిక, భావవాదిగా చిత్రించారు వీరు. వారి భాషకనుగుణంగా మాట్లాడని వారిని అట్లా దిగజార్చక తప్పదన్నమాట. 19వ శతాబ్దంలోనే అదృశ్యమైన 'వ్యక్తి - సమాజ' పరిభాషను నన్ను విరసించడానికి ప్రత్యేకంగా పునరుద్ధరించి నేనుద్దేశించని అర్థాల్ని నా వ్రాతకు ఆపాదించి సంతోషించారు పాపం.

నా వ్యాసంలో 'వ్యక్తి' అంటే చైతన్యవంతుడైన, క్రియాశీలుడైనవాడు, ముఖ్యంగా కవి, కళాకారుడి (creative Artist) దృష్టి (point of view) నుండి రాశాను కనుక 'వ్యక్తి' అనాల్సివచ్చింది. వ్యక్తికీ, సమాజానికీ అంతరం నశించిన ఈ కాలంలో వ్యవస్థ, చరిత్రలకతీతంగా 'వ్యక్తి' వుండడానికి వీల్లేదనే నేననుకుంటున్నాను. కవికి (వ్యక్తికి) అతని పరిసరాలకి (సమాజానికి) మధ్యగల దూరం నశించిన నేటికాలంలో కవి అనివార్యంగా సమాజచట్రంలో స్వేచ్ఛగా వూపిరిపీల్చుకోలేని మనిషి గురించి మాత్రమే రాస్తాడు. వ్యక్తి వ్యవస్థనుండి పూర్వంమాదిరి ఇవ్వాళ కూడా పారిపోగలడని మార్క్సిస్టులు అనుకోవడంవల్లే వాళ్లకింకా ఆత్మాశ్రయవాదం, భావవాదం వగైరా మాటలక్కర్లు కనిపిస్తున్నాయి. అయితే ఇవ్వాళకూడా కాల్పనికులు వుండడానికి కారణం వాళ్ళు గతం రుచిమరిగినవారు, గతంలో జీవించేవారు కావడం. They are victims of false consciousness. కవి, వ్యక్తి అనేమాటలు కవి, రచయితల దృష్టి నుండి(stand point)ఉపయోగించబడ్డాయి. సాహిత్యచర్చల్లో మార్క్సిస్టు ఆర్థిక, సామాజిక పరిభాష అదేపనిగా వాడడం నా కిష్టంలేదు. మీభాషలో మాట్లాడ్డానికి అంగీకరించనివారంతా బూర్జువాలు, భావవాదులు కాకతప్పదని తెలుసుకున్నాను.

8. సర్రియలిస్టు రచనలకీ, అస్తిత్వవాద రచనలకి నాకు భేదం తెలియదనే గొప్పసత్యాన్ని కనుక్కొన్నారు. వాటిమధ్యవున్న భేదాన్ని నా వ్యాసంలో పేర్కొనే అవసరమే లేనప్పుడు ఆ భేదం నాకు తెలిదనడంలో ఏమిటి వీరి ఉద్దేశ్యం. మార్క్సిస్టులు క్షీణసాహిత్యంక్రింద ఈ రెంటినీ విమర్శిస్తారు కనుక వాటిని ప్రక్క ప్రక్కనే పేర్కొన్నానుతప్ప వాటిమధ్య భేదాలనుగూర్చినచర్చ దేనికి ? నేను రాసిన విమర్శా వ్యాసం 'మార్క్సిజం - సాహిత్యం' గురించి తప్ప 'సర్రియలిజం - అస్తిత్వవాదం' గురించికాదని వీరు గుర్తిస్తే సంతోషిస్తాను.

ఈయన చేసిన కువిమర్శకు ఇవీ కొన్ని స్పష్టమైన ఉదాహరణలు.

వీరికి 'సాంకేతిక పరిభాష'లో తప్ప అన్యభాషలో మాట్లాడేవాళ్లంతా శత్రువులు, అస్పృశ్యులు, బూర్జువాలు. మార్క్సిజానికి వాళ్లిచ్చిన వ్యాఖ్యానాల్ని అంగీకరించని వాళ్లంతా మార్క్సిజానికే శత్రువులు. వాళ్లు నిర్ణయించిన రీతిలో పయనించని వాళ్లు శిక్షార్హులు. ఇదీ వీరిగురించి స్థూలంగా. జనానికర్థమయ్యే భాషలో సాహిత్యం వుండాలని కోరేవీరు విమర్శలు మాత్రం అత్యంతక్లిష్టంగా రాస్తారు. అర్థమైతే తమ ముసుగులు తొలగుతాయనే భయంకాబోలు.

వారి అంతిమ, శాశ్వతాభిప్రాయాల కొలబద్దలతో ఇతరుల్ని కొలిచి, లోపాల్ని చూచి, తృప్తిగా నిద్రించడానికి అలవాటుపడ్డవీరు మాట్లాడిన భాష 'సంభాషణ' (conversation)కు చెందిందికాదు. వీరిది మోనోలాగ్ (Monologue) లేదా ఏకపాత్రాభినయం, డైలాగ్ (dialogue) కాదు.

ముగింపు: మన మేకప్‌లలో, ముసుగుల్లో (masks) మన నాటకీయతల్లో మనం (మీరు, మీతోపాటు నేను) కలకాలం సుఖంగా ఇట్లాగే జీవిద్దాం.

మన కార్యకలాపాలు ఈ స్వప్నావస్థలోనే నైనే నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతాయి. కనుక మేలుకొవడాన్ని (awakening) సమిష్టిగా వ్యతిరేకిద్దాం.

నేను 'సాహితీ' శత్రువునుకాదు. (సాహితీ) మిత్రుడినేనని నన్ను నేను సమర్థించుకోవాల్సిన అగత్యంగాని, రుజువుచేయాల్సిన అగత్యంగాని నాకులేదు. ఓరకంగా, నేను మీకు "శత్రువు"నవడం మీ ఆరోగ్యానికి, నా ఆరోగ్యానికి మంచిది.

రచనలకోసం విజ్ఞప్తి

ఆర్థికఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనలవిషయంలో కూడ తీవ్రమైనకొరతను ఎదుర్కొంటున్నది. కళావిలువలులేని వినోదప్రాయమైన పాటలు కవితలు, మూసలోపోసిన ఫార్ములాపద్ధతికథలు, ఇతర భాషల్లోని మంచి రచనలకు (చెడ్డ) అనువాదాలుతప్ప మౌలికమైన ఉత్తేజకరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సమీక్షలు, మౌలికమైన సృజనాత్మకరచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలుపంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాం.

— 'సాహితీమిత్రులు'

దక్షిణ ఢిల్లీ ఆంధ్ర సంఘం వారు శ్రీ ఎం. చలపతిరావుగారి సంపాదకత్వాన 1976 లో గురజాడ స్మారక సంచిక ప్రకటించారు. ఈసంచిక డా॥ కొవ్వూరి రమేష్ బాబు విశేష కృషి ఫలితం. గురజాడ సంచికలాగే గిడుగు స్మారక సంచిక కూడా తయారుచేయటానికి అతను ప్రణాళిక తయారు చేసుకున్నాడు. పురిపండా అప్పల స్వామిగారితోనూ, నాతోనూ, ఆవిషయాలు చాలాసార్లు మాట్లాడాడు. కాని చేద్దామను కున్నపని ఒక దారికి రాకుండానే డా॥ రమేష్‌బాబు 1979 మే నెల ఆఖరులో శాశ్వ తంగా కన్నుమూశాడు.

రమేష్‌బాబు సంకల్పించిన ఈపనిని నిర్వహించటానికి ఇప్పుడు మళ్ళీ పూను కున్నాం. పురిపండా అప్పలస్వామిగారు ఈ సంచికకు ప్రధాన సంపాదకులుగా వ్యవహరిస్తారు. సంచికా నిర్మాణానికవసరమైన రోజువారీ పనులు నేను చూసు కుంటున్నాను.

ఈ సంచికలో 1) ఇంతకుముందు అచ్చయిన గిడుగు సంపుటాల్లో రాని ఇంగ్లీషు, తెలుగు వ్యాసాలు 2) గిడుగుపైన ఈపాటికే ఇతరులు రాసిన ఇంగ్లీషు, తెలుగు వ్యాసాలు, 3) గిడుగుపైన కొన్ని కొత్త వ్యాసాలు 4) గిడుగు ఇతరులకు కాని, ఇతరులు గిడుగుకి కాని రాసిన ఉత్తరాలు ప్రధాన భాగాలుగా ఉంటాయి.

గిడుగు రామమూర్తిగారిని గురించి కేవలం వ్యావహారిక భాషావాదిగానే ఎక్కువ మందికి తెలుసు. ఈ సంచికలో ఆయన బహుముఖ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించ దల్చుకున్నాం.

ఈ సంచికకు సలహాలను ఆహ్వానిస్తున్నాం. పైన పేర్కొన్న వ్యాసాలు, ఉత్తరాలు ఆచూకీ తెలిసినవారు వివరాలు మాకు తెలియపరచవలసిందిగా కోరు తున్నాం. ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ క్రింది అడ్రసుకు రాయగోరుతాను.

— చేరా

చేకూరి రామారావు, లింగ్విస్టిక్స్ డిపార్టుమెంటు,
ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాదు - 500 007

లూసన్ శతజయంతి సంస్మరణ:

విప్లవంకోసం అవిప్లవకరమైన అదుర్దా

లూసన్

ఒక గొప్ప విప్లవసైన్యం నిజంగానే గొప్ప విప్లవసైన్యం కావాలంటే ముందుగా అందులోని పోరాటకారులు యావన్మందికీ పరమసవ్యమైన స్పష్టమైన భావాలుండితీరా లంటారు కొందరు- అలా లేనిపక్షానఅది గడ్డిపోచకూడా చెయ్యదంటారు. ఇది బహు సమంజసంగానూ సాకల్యంగానూ ఉన్నట్టు మొదట్లో అనిపిస్తుందిగాని, నిజానికి ఇది వట్టి గొంతెమ్మకోరిక, పనికిమాలిన వాగుడు, విప్లవాన్ని విషమయం చేసేందుకు పంచదార పూతపూసిన గుళిక.

ముఖాలు కళకళలాడుతూ చేతులుకట్టుకు వంగి వంగి దండాలుపెడుతూ జనం ప్రవర్తించేలా, "నిఖిలజగతి విపులశాంతి" ననుభవించేలా సామ్రాజ్యవాదుల ఏలుబడిలో సమస్తదేశానికి "సార్వజనిక ప్రేమను" బోధించడం ఎంత అసంభవమైన విషయమో, సరిగ్గా ఇదీఅంతే. విప్లవవిరోధుల ఏలుబడిలో, సవ్యంగా ఆలోచించేలా దేశ ప్రజలందరినీ మాటలద్వారానో చేతలద్వారానో మార్చుజూడడంకూడా అసంభవమైన విషయమే. కొత్త విప్లవసైన్యంలోని పోరాటకారులను కలిపికట్టే ఏకైకభావం యథాస్థితికి వ్యతిరేకత. వారి అంతిమలక్ష్యాలు పరస్పరభిన్నమైనవి. సమాజంకోసం తిరుగుబాటుచేసేది కొందరైతే, మరికొందరు ఒక ముఠాకోసమో, స్త్రీ కోసమో, తమకోసం మాత్రమో, లేదా ఆత్మహత్యకు సులభోపాయంకోసమో, అయినాసరే, విప్లవసేన ముందుకుపోతుంది. ఈ పోరాటకాండలో శత్రువును సమిష్టివాది తుపాకీగుండెంత బాగా చంపగలదో, వ్యష్టివాదిదీ అంతబాగానే చంపగలదు. చనిపోయిన, లేదా గాయపడిన యోధుడు ఎలాంటివాడైనా కావచ్చుగాక, సైన్యానికిగల పోరాటశక్తికి అందుమూలంగా ప్రాప్తించేనష్టం ఒకేవిధంగా ఉంటుంది. అంతిమలక్ష్యాల విషయంలోగల భేదాలమూలంగా, పోరాటక్రమంలో కొందరు జారుకోవచ్చు, కాలికి బుద్ధిచెప్పవచ్చు, ఉత్సాహం ఉడిగిపోవచ్చు, విద్రోహం తలపెట్టవచ్చు. అయినా, తాము ముందుకు వెళుతున్నంతమేరకు, తమసైన్యం క్రమక్రమంగా తన సంకీర్ణతను కోల్పోతూ మరింత సుశిక్షితమౌతూ ఉంటుంది.

ఎహ్ యుంగ్-చెన్ నవల "పదేళ్ళమాత్రమే"కి నేను పీఠిక రాసినప్పుడు సమాజంకోసం ఒక మనిషి తాను చేయగలిగింది చేసినప్పుడు, జరిగేది ఇదేనని భావించాను. ఈ నవలలో నాయకుడు యుద్ధరంగానికివెళ్ళి, (తుపాకీ పేల్చడమెలాగో తనకు ఎవరూ నేర్పకపోయినా) గస్తీ పనిచేశాడు. మోకాళ్లమీద చేతులానించి రోదించడమో లేక తమ కోపతాపాలగురించి రాయడమోచేసే విద్యాంసులకంటె ఇతడు ఆచరణశీలా

ఎంతో మెరుగు. పోరాటకారులందరికీ సవ్యమైన అభిప్రాయాలుండాలనీ, వాళ్లు ఉక్కులా గట్టిగా ఉండాలనీ కోరడం, పరమ అహేతకమూ అవాస్తవికమూ అయిన వెర్రికల.

'షన్‌పావో'లో ఈ నవలగురించి తీవ్రమైన అసంతృప్తి ప్రకటిస్తూ మరింత కరుకైన, తీవ్రభావాలతోకూడిన విమర్శ చదివాను. కథానాయకుడు స్వార్థబుద్ధికొద్దీ సైన్యంలో చేరాడని విమర్శ. ఈ పత్రిక శాంతిఅంటే చెవిగోసుకుని విప్లవమంటే మండిపడుతుంది కాబట్టి ఈ విమర్శ ఆ పత్రికలో పరమ అసందర్భంగా మొదట్లో తోస్తుంది. తీవ్ర విప్లవకారుడుగా కనిపించేమనిషి- నిజానికి పరమ అవిప్లవకరమైన, లేద విప్లవవ్యతిరేకమయిన వ్యక్తివాద వ్యాఖ్యాత ఇలాంటిపత్రికకు తగ్గవిధంగా ఇలాంటివిమర్శను ఎలా చెయ్యగలడో వివరిస్తాను.

క్షీణతాగుణం గలవాడు ఒక రకం. నిశ్చితమైన ఆదర్శాలుగానీ సామర్థ్యం గానీ లేకుండా, క్షణికమైన వినోదంకోసమని అతడు నిలిచినచోట నిలవకుండా త్వరలో ఇలాంటి స్థిరమైన ఆనందాలంటే ముఖంమొత్తి, కొత్త కొత్త ఉద్రిక్తతకోసం వెదుకు లాడుతూ ఉంటాడు- అత్యంతగాఢమైన అనుభూతిని మాత్రమే అతడు అందుకొని ఆనందించగలడు. విప్లవం అతని పాలిటికి ఇలాంటి కొత్త అనుభూతి. ఆబగామెక్కి నాలుకసపిచెడి ఒళ్లుమందగించిన తిండిబోతు అరగిన్నాడు అన్నం తినాలన్నాసరే, ముందుగా మిరియాలో పరాకటో ఔషధప్రాయంగా సేవించి చెమటలు కక్కాలి. ఈ రచయిత స్థితికూడా ఇలాంటిదే, సర్వసాకల్యమైన, అతివిప్లవకరమైన రచన కావాలని కోరుకుంటాడు. యుగానికి సంబంధించిన దోషాలేవైనా కనిపించీ కనిపించక ముందే, ముఖం చిట్లించి, ఈ రచనాసరి గడ్డిపోచాసరి అనుకుంటాడు. తనకు ఆనందం కలిగించేంతదాకా నువ్వు సత్యాన్ని తుంగలో తొక్కినా అతనికి ఫర్వాలేదు. విప్లవానికి స్వాగతమేమోచెప్పి, తీరా అది జరిగి తన భ్రష్ట జీవితానికి ఎసరుపెట్టే సరికి విప్లవమంటే ద్వేషం చూపెట్టసాగిన క్షీణతాగుణంగల ఫ్రెంచికవి బాద్‌లేర్ గురించి అందరికీ తెలిసిందే. కాగితం విప్లవకారులు- విప్లవం జరగకముందు మాత్రం సర్వసాకల్యంగానూ మహోత్సాహంతోనూ విప్లవాన్ని కోరేవారు- సదరు విప్లవం ఆగమించేసరికల్లా, ముఖాలకు తాము తగిలించుకున్నామనే స్పృహైనా లేకుండా తగిలించుకున్న మేలిముసుగులను చించివేసుకుంటారు. చాలా చిన్న ఎదురుదెబ్బ తగిలిందోలేదో, తమకేదైనా ఒక హోదా (లేదా డబ్బు) ఉంటే, తూర్పుగా టోక్యోకో పశ్చిమంగా పేరిస్‌కో 'బతుకుజీవుడా!' అనుకుంటూ కాలికిబుద్ధిచెప్పే బెంగ్ ఫాంగ్-వూలాంటి "విప్లవ రచయితల"కు ఇలాంటి పూర్వోదాహరణలు గుర్తుచెయ్యాలి.

మరొకరకంఉంది. దీన్ని వర్గీకరించడం కష్టం. వీరికిగల ప్రముఖమైన లక్షణ మేమిటంటే, విశ్వాసాలేవీ తమకు లేకపోవడం; అందుచేత తాముతప్ప తక్కినవారం దరిదీ తప్పనీ, తమదొక్కరిదే ఒప్పనీ వీరుభావిస్తూ ఉంటారు. యథాస్థితితోటి పరమ సంతృప్తి చెందుతారు. విమర్శకులుగా నోరువిప్పితే, ఎదుటివాళ్లనోరు మూయడానికి దేన్నైనాసరే నోటబెడుతూ ఉంటారు. పరస్పర సహాయ సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేసేందుకుగాను, జీవనసంగ్రామం గురించి ప్రసంగిస్తారు; జీవనసంగ్రామ సిద్ధాంతాన్ని పీటుగొట్టేందుకు పరస్పర సహాయసిద్ధాంతాన్ని సమర్థిస్తారు. శాంతివచనాలను వ్యతిరేకించేందుకు వర్గపోరాటాన్ని వెనకేసుకువస్తారు; మరి దీన్ని తక్కువజేసేందుకు సార్వజనిక ప్రేమను పైకెత్తుతారు. భావవాదితో వాదించేప్పుడేమో భౌతికవాద దృక్పథం అవలంబిస్తారు; భౌతికవాదిని కాదనేందుకు భావవాదులుగా మారుతారు. రష్యన్ 'వెర్స్ట్'లను కొలిచేందుకు ఇంగ్లీషురూలర్లను, అంగుళాలను కొలిచేందుకు ఫ్రెంచి రూలర్లనువాడి, ప్రమాణానికి సరివచ్చేవాడెవ్వడూ లేడనే విషయాన్ని కనిపెడతారు. ప్రమాణానికి సరిరాగల మనిషంటూ లేడుకాబట్టి, మధ్యేమార్గానికి తాము ఏకైక సమర్థకులుగా ఉన్నట్టు భావిస్తూపోవచ్చు, ఎల్లకాలం ఆత్మసంతుష్టి ననుభవిస్తూ ఉండవచ్చు. లోపమున్నదేదీ పనికేరాదని వీరిభావం. ప్రపంచం నూటికి నూరుపాళ్ళు సవ్యంగా ఉండలేదు గనక, భద్రంగా ఉండాలంటే ఉనకాసనంవేసి పడుకోవాలి అయినా ఇలా పడుకోవడం కూడా పెద్దపొరబాటే. వీరి దృక్పథం గురించి సూక్ష్మంగా చెప్పాలంటే, ఈ ప్రపంచకంలో జీవించడమే అత్యంత కష్టభూయిష్టం; విప్లవకారుడు కావడమంటే ఇంకా మరీని.

[రచనాకాలం 1930]

వామపక్ష రచయితల సమాఖ్య గురించి కొన్ని ఆలోచనలు

లూసన్

ఇతరులిప్పటికే మాట్లాడిఉన్న విషయాల గురించి నేను మళ్లీ మాట్లాడవలసిన పనిలేదు. నా అభిప్రాయంలో, నేటి "వామపక్ష" రచయితలు "దక్షిణపక్ష" రచయితలుగా మారడం చాలా సులువు. మొదటి విషయం; యథార్థమైన సామాజిక సంఘర్షణలతో సంబంధం పెట్టుకోకుండా, రాసుకుందామనో చదువుకుందామనో గాజుకిటికీల వెనకాతల కూర్చునేపనైతే, మీరెంత తీవ్రవాదులుగా "వామ"పక్షవాదులుగానైనా ఉండడం సులభం. వాస్తవం ఎదురుకాంగానే మీ భావాలన్నీ ముక్కలుముక్కలైపోతాయి. మూసిన తలుపులవెనకాతల తీవ్రవాద భావాలను వెలయించడం మహాసులభం; "దక్షిణపక్ష" రచయితగా మారడమూ అంతే సులభం. పశ్చిమ

దేశాలలో "శాలన్ - సోషలిస్టులు" అనే మాటకు ఇదే అర్థం. "శాలన్" అనేది ఇంట్లో కూర్చునేగది. అమలుపెట్టే విషయాన్ని పట్టించుకోకుండా, సోషలిజం గురించి చర్చిస్తూ ఆసీనులు కావడం, ఎంతో కళాత్మకమైనది, ఎంతో నాజూకైనది. రచనను వృత్తిగాచేసుకోని ముస్సోలినీ మినహా, కార్మికుల్నీ కర్షకుల్నీ బానిసలుగామార్చాలి, చంపాలి, దోచాలి అంటూ, సోషలిస్టు భావాలే లేని రచయితలుగానీ కళాకారులుగానీ ఈ రోజుల్లో చాలా అరుదు. (అసలే లేరని కూడా మనం చెప్పలేము. ఉదాహరణకు, చైనాలోని 'క్రిసెంట్‌మూన్' ముఠాకు చెందిన సాహిత్యవసులు, పీద పేర్గాన్న ముస్సోలినీ అభిమానపాత్రుడైన డి. అన్నుంజియో.)

రెండోది: విప్లవానికిగల యథార్థమైన స్వభావాన్ని గనుక నువ్వు బోధపరచుకోలేకపోయావంటే, "దక్షిణపక్షం" కావడం తేలిక. మురికితోను నెత్తుటితోనూ కలగలిసి మహావికృతంగా ఉంటుందిగాని, కవులు భావించేలా విప్లవం పరమ మనోహరంగానో నిర్వక్రసుందరంగానో ఉండదు. ప్రయాసతోగూడిన చిన్నచిన్న పనులేన్నోకూడిన అతిమామూలు వ్యవహారంలాగా ఉంటుంది గాని, కవులు భావించేట్టు కాల్పనికంగా ఉండదు. విప్లవంలో విధ్వంసనం ఉండనే ఉంటుంది. అయితే నిర్మాణం దానికి మరీ అవసరం. విధ్వంసనం తేలిక, నిర్మాణం కష్టసాధ్యం. విప్లవం గురించి కాల్పనిక స్వప్న పరవశులైనవాళ్లు దానితో సన్నిహితమైన పరిచయం కలిగేసరికల్లా, అది యథార్థంగానే సాగేటప్పటికల్లా, భ్రమలు పోగొట్టుకుంటూ ఉంటారు. "దివిలోనూ భువిలోనూ విప్లవం వర్ధిల్లాలి!.... నేను బోల్షివిక్కును!" అంటూ రష్యన్‌కవి ఎస్సెనిన్ అక్టోబరు విప్లవానికి మొదట్లో స్వాగతం పలికాడంటారు. కాని, కొంతకాలానికి, తాను ఊహించినదాని కంటె వాస్తవం పూర్తి భిన్నంగా పరిణమించేసరికి, భ్రమలుకోల్పోయి క్షీణత ప్రదర్శించసాగిందీ అతడే. తదనంతరకాలంలో అతని ఆత్మహత్యకు ఇది ఒకానొక కారణమట కూడా! పిల్న్యాక్, ఎహ్రెన్‌బర్గ్‌లు ఈ విషయాన్నే నిరూపిస్తారు. మన 1911 విప్లవ క్రమంలో కూడా ఇలాంటి తార్కాణాలు కనిపిస్తాయి. 'సౌత్‌సొసైటీ' వంటి వాటికి చెందిన రచయితలు మహావిప్లవకరంగా మొదలయ్యారు; మంచూలను తరిమివేసిన తక్షణం "వెనకటి మంచి రోజులు" తిరిగివస్తాయని, వదులైన రెట్టలు చొక్కాలూ ఎత్తైన తలటోపీలూ వెడల్పాటి నడుముకట్లూ ధరించి, ఠీవిగా అంగలేస్తూ నడవవచ్చునని ఏవేవో భ్రమలుపెట్టుకున్నారు. మంచూ చక్రవర్తిని తరిమివేసి రిపబ్లిక్‌ను నెలకొల్పాక తామాశించిన దానికీ వాస్తవానికీ పొత్తేలేదని గ్రహించి ఆశ్చర్యచకితులయ్యారు. కాబట్టి భ్రమలు విడిపోయాయి.

కొత్త ఉద్యమాన్ని వ్యతిరేకించారు. విప్లవానికిగల నిజమైన స్వభావాన్ని గ్రహించక పోతే, మనకూ అదే ప్రాప్తిస్తుంది.

మరొక తప్పు అభిప్రాయం ఏమిటంటే, కవులూ రచయితలూ అధికులనీ, తదితరమైన ఏపనికంటేనూ వీరిది ఉన్నతమైనదనే భావం. ఉదాహరణకు హాయనే కవులు మానవోత్తములని, భగవంతుడు మహాన్యాయపక్షదని, కవులు మరణించాక దేవుని వద్దకువెళ్ళి పక్కనకూర్చుని దేవుడిచ్చే చిరుదిండిని స్వీకరిస్తారని భావించాడు. దేవుడు నోటికందించగల చిరుదిండి విషయంలో ఈనాడెవ్వరికీ నమ్మకం లేదుగాని, ప్రస్తుతం కార్మిక విప్లవాన్ని బలపరిచే కవులకూ రచయితలకూ విప్లవపరిసమాప్తి తర్వాత దివ్యమైన ప్రతిఫలం ముట్టుతుందని, ప్రత్యేకమైన కార్లలో తిరుగుతూ ప్రత్యేకమైన భోజనం ఆరగిస్తూ ప్రత్యేకమైన మన్ననపొందుతారని కొందరికింకా నమ్మకం ఉంది. "తమరు మా కవీశ్వరులు, అంచేత దీన్ని ఆరగించండి!" అంటూ కార్మికులు వీరికి రొట్టే, వెన్నా తినబెట్టుతారట కూడా. ఇది ఇంకో భ్రమ. ఇలాంటి దేదీ జరగదుగాక జరగదు. బహుశా నేటికంటె విప్లవం తర్వాతనే పరిస్థితి మరింత కష్టంగా ఉంటుంది. రొట్టే, వెన్నా అటుంచి, రష్యన్ విప్లవం తర్వాత ఒక సంవత్సరమో రెండు సంవత్సరాలో జరిగినట్టుగా, నల్లరొట్టైనా గగనంకావచ్చు, దీన్ని గ్రహించలేకపోయామంటే, మనం "దక్షిణపక్షం"గా తయారుకావడం తేలిక, లియాంగ్ షిహ్ - చియూగారు వర్ణించినట్టు "యోగ్యులైన" వారైతేతప్ప, కార్మికు లెవరూ మేధావులంటే ప్రత్యేక గౌరవం చూపెట్టరు. నేను అనువాదం చేసిన ఫెడయేవ్స్ రచన "పందొమ్మిదిమంది"లో మెటిక్ అనే మేధావి సంగతి చూడండి; గనికార్మికులు తరచూ అతన్ని హేళనచేస్తారు. మేధావుల కర్తవ్యాలు మేధావులకు ఉన్నాయి, వాటిని తక్కువ చేయగూడదని చెప్పడం అనవసరం; అయితే, కవులకుగాని రచయితలకుగాని ప్రత్యేకాభిమానంతో గూడిన ఆదరణను చూపడం కార్మికవర్గ కర్తవ్యమేం కానేకాదు.

మనం మనస్సుపెట్టి చూడవలసిన అంశాలను కొన్నిటిని ఇప్పుడు పేర్కొంటాను'

మొదటగా, పాతవ్యవస్థకూ పాతశక్తులకూ వ్యతిరేకంగా మనం పట్టుదలతో నిరంతరాయంగా పోరాడితీరాలి, మనబలాన్ని బాగా వినియోగపెట్టుకోవాలి. పాత సమాజం వేళ్ల బాలాలోతుకి తన్నుకుని ఉన్నాయి; మన కొత్తఉద్యమం అంతకంటె బలంగాఉంటేనేగాని మనం దాన్ని కదిలించివెయ్యలేము. అంతేకాదు, తానుమాత్రం రాజీకి దిగిరాకుండానే, మన కొత్తశక్తులను రాజీకి లొంగదీసుకొనే సాధనాలేవో

పాతసమాజానికి చేకూరి ఉన్నాయి. చైనాలో కొత్త ఉద్యమాలు అనేకంగా తలెత్తాయి గాని ప్రతి ఒకటీ పాతదాని వాతబడిపోయింది. నిర్దిష్టమైన సాధారణ లక్ష్యాలులోపించి, కోరికలు మరీ కొద్దిపాటివై ఉండినందుచేత అతితేలికగా అవి సంతుష్టిచెందడమే దీనికి కారణం. వాడుకభాషకోసం సాగిన ఉద్యమాన్నే చూడండి, పాతసమాజానికి చెందిన శక్తులు దాన్ని ప్రారంభంలో వ్యతిరేకించాయి. అచిరకాలంలోనే వాడుకభాషా రచనలకు అవి అనుమతినిచ్చాయి, దౌర్భాగ్యపు హోదానొకదాన్ని దయచేశాయి, వ్యావహారికంలో రాసిన వ్యాసాలను వార్తాపత్రికల మారుమూలల్లో అచ్చువేసుకోనిచ్చాయి. కొత్తది పరమ ఉపద్రవరహితమైందని తాము భావించబట్టి ఈ అవకాశం కలగజేశాయి. వ్యావహారికం బతికి బట్టగట్టగలిగిందికదా అని మురిసిపోబట్టి కొత్తది తృప్తిపడింది. గత రెండేళ్లగా సాగుతున్న శ్రామిక సాహిత్యోద్యమమూ ఇంతే. కార్మికవర్గ రచన ముప్పేమీకాదని పాతసమాజం దీనికి ఆమోదముద్రవేసింది- నిజానికి వారుకూడా ఇలాంటిరచన చేసేందుకు పూనుకుని దాన్ని ఒక అలంకారంగా వాడుకచేశారు. ఇంటి చావిడిలో పాత పింగాణీపాత్ర పక్కనే ఒక పనివాడి మొరటైన మూకుడుపెట్టడం ఎంతో అపూర్వ ప్రతిభావంతమైన విశేషం కాదూమరి? సాహిత్యలోకంలో కార్మికవర్గ రచయితలకు కాస్త జాగాదొరికి, తమ రచనల లిఖితప్రతులను వారుకూడా వెలవేసుకోగలిగాక, పోరాడడం మాని వేశారు; "శ్రామికవర్గ సాహిత్యం విజయవంతమైందహో!" అంటూ వీరి సిద్ధాంతకారులు జయగీతాలాలపించారు. అయితే, ఎవరో కొందరి విజయాన్ని అటుంచిచూస్తే, శ్రామికవర్గ సాహిత్యానికి ఒరిగిందేమిటి? విముక్తికోసం సాగే శ్రామిక వర్గపోరాటంలో సహజమైన అంతర్భాగమై, కార్మికవర్గ దారుఢ్యంతో బాటుగా అది ఎదుగుతూపోవాలి. సామాజికంగా శ్రామికవర్గం అట్టడుగున పడిఉంటే సాహిత్యంలోకంలో శ్రామికవర్గ సాహిత్యానికి ఉన్నతమైన స్థానం సమకూరిందనే విషయం తెలియజేసేదల్లా, శ్రామికవర్గంతోటి తెగదెంచుకుని అది పాతసమాజం వైపుకు వెళ్లిపోయిందని మాత్రమే.

రెండవది, మనం మన యుద్ధరంగాన్ని విస్తరింపజేసుకోవాలి. నిరుడూ అంతకుముందటేడూ సాహిత్యంలో మనకుకొన్ని యుద్ధాలైతేజరిగాయిగాని కొద్దిపాటి ఎత్తున్నే జరిగాయి. పాతసాహిత్యం, పాతభావాలు - వీటి పనిబట్టేబదులు పాతవాళ్ల పక్కననిలిచి వినోదం తిలకించేట్టుగా, మన కొత్తరచయితలు ఒక మూలచేరి కుమ్ములాడుకోసాగారు. మూడవది, ఈనాడు మనకు సరిపడా చేతుల్లేవు కాబట్టి కొత్తపోరాట కారుల దండును మనం లేవదీయాలి. పత్రికలెన్నో ఉన్నాయి, పుస్తకాలూ చాలా

అచ్చుపడుతున్నాయి; అయితే అదేరచయితలు కొద్దిమంది వీటన్నిటిలోనూ కన్పిస్తున్నారు. అందుచేత విషయసంపదలో ఇవి పలచనౌతున్నాయి. ప్రత్యేక విషయాలలో ప్రావీణ్యం సంపాదించేవాడు ఎవడూలేడు; అనువాదం, కథా రచన, విమర్శ, కవిత్వంకూడా - వీటన్నిటిలోనూ వేలుబెట్టేవాడే ప్రతిఒకడూ. ఫలితంగురించి మరిచెప్పాలా ? దీనికి కారణమంతా రచయితలు కరువు కావడమే. మరింతమందిఉంటే, అనువాదకులు విమర్శమీద దృష్టి కేంద్రీకరించేవాళ్లు; అప్పుడుగనక మనం విరోధితో తలపడిఉంటే, వాళ్లను సునాయాసంగా మన్నుగరిపించగలంతటి బలం మనకు సమకూరిఉండేది. ఈవిషయమై ఒక ఉదంతం. నిరుడుగాక ఆ ముందరేడు సృజనసమాజమూ సన్ సమాజమూ నామీద విరుచుకు పడినప్పుడు, అది వాస్తవంగా పరమదుర్బలంగా ఉండేది; నాకుగూడా కొంతకాలానికి ఆసక్తి చచ్చి ఎదురుదెబ్బకొట్టడం అనవసరం అనిపించింది, "ఖాళీనగరం ఎత్తుగడలు" వేస్తున్నారని నాకు అర్థమైంది.[1] శత్రువు తన సైనికులను కవాతు చేయించడం జనులు గగ్గోలుపెట్టడానికే తన బలాన్నంతటినీ వినియోగించాడు. నన్ను పడదిట్టుతూ అనేకవ్యాసాలు వచ్చినప్పటికీ, అన్నీ మారుపేర్లతో రాసినవేనని ఇట్టేచెప్పవచ్చు- బండెడు తిట్లన్నీకలిపి ఒకేవిధమైన విమర్శలకు దిగిపోయాయి. మార్క్సిస్టు విమర్శా పద్ధతిలో సిద్ధహస్తుడైనవాడెవడైనా విమర్శిస్తే బాగుండునని నేను వేచిచూశానుగాని అలాంటి మనిషెవడూ కనిపించలేదు. పోరాటకారులలో కొత్తతరానికి తర్ఫీదివ్వడం ముఖ్యమని మొదటినుంచీ నా అభిప్రాయం. అనేక సాహిత్యబృందాలను రూపొందించాను; కాని, అవేవీ పెద్దగా లెక్కలోకిరాలేదు. ముందు ముందు మనం ఈ విషయాన్ని మరింత శ్రద్ధగా పట్టించుకోవాలి.

కొత్త పోరాటకారుల దండును సమకూర్చుకోవడం మనకు తక్షణావసరంకాగా, సాహిత్యరంగంలో ఇప్పటికే నిలిచిఉన్న వాళ్లం, బండబారిపోకుండా పరిస్థితులకు అనువుగా మారగలిగిఉండాలి. అంటే, పరీక్షవ్యాసాలను "తలుపులు తెరిపించే ఇటుక"గా ప్రయోగిస్తూ వచ్చిన చింగ్ వంశం నాటి పండితుల్లా తయారు కమ్మని నా ఉద్దేశం కాదు. పరీక్షల్లో నెగ్గి చింగ్ రాజవంశ ప్రభుత్వంలో ఉద్యోగులయేందుకు పండితులకు ఈ వ్యాసాలే సాధనంగా ఉండేది. "ఉపోద్ఘాతం, వివరణ, భిన్నవైఖరి,

1 మూడు రాజ్యాల కాలంనాటి సుప్రసిద్ధ వ్యూహరచయిత, చుకోలియాంగ్, అరక్షితమైన ఒకానొక నగరంలోపలికి శత్రువును రమ్మని ఆహ్వానించగా ఇదేదో మోసమనుకున్న శత్రువులోపలికి వెళ్లేందుకు సాహసించలేదు.

ఉపసంహారం"[2] -వీటిసాయంతో నువ్వు పరీక్ష నెగ్గావంటే, మరి దానితో నీకుపనేమీ ఉండదు, బతికినన్నాళ్లా నువ్వు దాని ముఖమే చూడనక్కర్లేదు. అందువల్లనే దాన్ని "ఇటుక" అన్నారు. తలుపు తెరుచుకునేంతదాకానే దాని ఉపయోగం; ఆ తర్వాత దాన్నింకా మోయడమెందుకు? విసిరెయ్యవచ్చు, ఈనాటికీ అలాంటి పద్ధతులువాడుకలో ఉంటున్నాయి. ఒకటి రెండు కావ్యాలనో కథాసంపుటులనో వెలువరింపజేశాక సదరు రచయితలు మరి కనుమరుగైపోవడం మనం చూస్తున్నాము. ఎక్కడికిపోతారు వీళ్లందరూ? ఒకటి రెండు గ్రంథాలను వెలువరింపజేసినందువల్ల కొద్దోగొప్పో పేరు ప్రఖ్యాతులు సమకూర్చుకున్నాక, వీళ్లు ఆచార్యులో మరొకటో అవుతారు. లబ్ధప్రతిష్ఠులై రాయవలసిన పని మరి లేనందుచేత, ఇక కనిపించరు. సాహిత్యంలోనేమి విజ్ఞానశాస్త్రంలోనేమి, చైనాదేశం లోకానికి చూపగలిగింది తక్కువ కావడానికి ఇదే కారణం. మనకు కొన్ని రచనలు అవసరం: వాటివల్ల ఉపయోగంఉంది. (రష్యాదేశపు చేతిపనులను చెక్కుచెదరనీకుండా నిలపాలని లూనచార్‌స్కీ సూచించాడు. రైతులు తయారుచేసిన వస్తువులను విదేశీయులు కొంటే వచ్చేడబ్బు అవసరానికి వస్తుంది. సాహిత్యంలోనూ విజ్ఞానశాస్త్రంలోనూ మనం కృషిచేశామంటే, సామ్రాజ్యవాదుల నుంచి బయటపడేందుకు మన రాజకీయ ఉద్యమానికి కూడా అది తోడ్పడుతుందని నా నమ్మకం.) అయితే, సాహిత్యంలో దేన్ని సాధించాలన్నా, మనం బండబారకుండా పరిస్థితులకు తగ్గట్టు మారగలిగి ఉండాలి.

చివరగా, సాధారణ లక్ష్యం ఒకటి ఐక్యసంఘటనకు అవసరమని నేను భావిస్తున్నాను. "అభివృద్ధినిరోధకులకు ఈవరకే ఐక్యసంఘటన ఒకటి ఉంది, లేనిదిప్పటికీ మనకే"నని ఎవరో అంటే, విన్నట్టుగుర్తు. నిజానికి, వాళ్లది సంకల్పపూర్వకమైన ఐక్యసంఘటనేమీ కాదు; సాధారణలక్ష్యమొకటి ఉండి సుసంబద్ధంగా వాళ్లు నడుచుకుంటున్నందుచేత వారికొక ఐక్యసంఘటన ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. మనం ఒకటిగా లేమన్నది లక్ష్యాల విషయంలో మనకు భేదాలున్నట్లు చూపెడుతూ ఉంది- కొందరం ఒక ముఠాకోసం మరి కొందరం ఒక వ్యక్తికోసం పనిచేస్తున్నాం. కార్మికులకూ కర్షకులకూ సేవచెయ్యాలని మనమందరమూ కోరుకున్నట్లయితే, మన యుద్ధరంగం సహజంగానే సమైక్యంకాగలుగుతుంది.

[1930 మార్చి 2న వామపక్ష రచయితల సమాఖ్య ప్రారంభసభలో చేసిన ప్రసంగం]

---

2 పరీక్షవ్యాసానికి ఇవి నాలుగూ ముఖ్యమైన అంగాలు.

కనుమ దాటడానికి

లూసన్

లావోజు[1] తెలివిలేని కర్రిమొద్దులా చలనం లేకుండా కూచున్నాడు.

"గురువుగారూ, కుంగ్‌చియు[2] మళ్ళీవస్తున్నాడు!" అన్నాడు కోపంతో అతని శిష్యుడు కెంగ్ సాంగ్ చు లోపలికి వస్తూ.

"అతన్ని లోపలికి రమ్మను...."

"ఎలావున్నారు గురువుగారూ?" అడిగాడు కన్‌ఫ్యూషియన్ గౌరవసూచకంగా తలను వంచుతూ.

'ఎప్పటిలాగే' జవాబిచ్చాడు లావోజు 'మరినువ్వు?' "మన లైబ్రెరీలోని పుస్తకా లన్నీ చదివావానువ్వు?"

"ఆ కాని...." మొదటిసారిగా కన్‌ఫ్యూషియస్ కలవరపడుతూ కనిపించాడు. "నేను పాటలు, చరిత్ర, సంగీతం, మార్పు, కర్మకాండ, వసంతరుతువు ఆకురాలు కాలముల చరిత్ర మొదలయిన ఆరు సారస్వతగ్రంథాలు చదివాను. ఇన్ని రోజులు నేను వీటిని కూలంకషంగా చదివి ఆకళింపు చేసుకున్నాను. నేను డెబ్బయిరెండు మంది రాజకుమారులను కలిసాను. వాళ్ళెవరికీ నాసలహా అవసరం లేదు. ఇతరులకు అర్థం చేయడం చాలాకష్టం. బహుశా వివరించాల్సిన పద్ధతి కష్టంగావుంది."

"నువ్వు తెలివైన రాజును కలుసుకోకపోవడం అదృష్టం" జవాబిచ్చాడు లావోజు. "ఈ ఆరు సారస్వత గ్రంథాలు పురాతన రాజులకు కొట్టినపిండి. నీమాటలు పాదరక్షలు నడిచిన దారివలె ఉన్నాయి. కాని పాదరక్షలు మార్గంకాదుగదా" కొంచెం ఆగిన తరువాత మళ్ళీ మొదలుపెట్టాడు "తెల్లనారాయణ పక్షులజంట ఒకదానినొకటి రెప్పలార్పకుండ చూస్తూవుంటాయి. ఆడపక్షి గర్భందాలుస్తుంది. పురుగులలో మగది గాలివీస్తున్నవైపు నుండి పిలుస్తుంది. ఆడది ఇటునుండి సమాధానమిస్తుంది. అది గర్భందాలుస్తుంది. స్త్రీ, పురుష స్వభావచేష్టలు కలిగిన జంతువుల్లో ఒక ప్రాణి స్వయంగా గర్భందాలుస్తుంది. ప్రకృతి మార్పులకు గురికాదు, గమ్యం మారిపోదు; కాలం ఆగిపోదు. మార్గం నిరోధింపబడదు. నీకు మార్గం ఉంటే అన్నీ సాధ్యమే. నువ్వు అది పోగొట్టుకుంటే ఏదీ సాధ్యంకాదు."

---

1. తొలిచైనావేదాంతి. 'ఏమీచేయవద్దు' అన్న ఆలోచనా పాఠశాల స్థాపకుడు
2. కన్‌ఫ్యూషియస్

తన శక్తి అంతా కోల్పోయినట్టుగా కన్‌ఫ్యూషియస్ తెలివిలేని కర్రిముద్దులా కూర్చున్నాడు.

ఎనిమిది నిమిషాలు గడిచాయి. అతడు గాఢంగా ఊపిరిపీల్చుకొని లేచినిలబడి సెలవు తీసుకోవడానికి గురువుకు యథావిధిగా మర్యాదగా కృతజ్ఞతలు చెప్పాడు అతని ఉపదేశాలకు.

లావోజు అతన్ని ఆపలేదు. చేతికర్రి ఆసరాతో నిలబడుతూ అతన్ని లైబ్రిరీ గేటు దాకా సాగనంపాడు. కన్‌ఫ్యూషియస్ తన బండి ఎక్కేంతవరకు చూసి అప్పుడు వృద్ధుడు యాంత్రికంగా గొణిగాడు.

"నువ్వు తప్పకుండా పోవాలా? తేనీరు తీసికోవా?"

కన్‌ఫ్యూషియస్ 'కృతజ్ఞతలు' చెప్పి బండినెక్కాడు. కట్టీవైపు వంగుతూ జోడించిన చేతులను గౌరవంగా పైకెత్తాడు వీడ్కోలు చెప్తూ. జాన్‌యు [1] గాలిలో కొరడాను ఝళిపిస్తూ "పరుగెత్తు" అని అరిచాడు. బండి బయలుదేరింది. అది పది గజాలు పోయిన తరువాత లావోజు తనగదిలోకి పోయాడు.

"ఈరోజు చాలా హుషారుగా ఉన్నారు గురువుగారు" అన్నాడు కెంగ్‌సాంగ్‌చు. లావోజు తనకుర్చీలో కూర్చున్న తరువాత చేతులు కట్టుకుని అతని ప్రక్కన నిలబడుతూ "మీరు పెద్ద ఉపన్యాసం ఇచ్చారు".

"అవును" అన్నాడు లావోజు బలహీనంగా నిట్టూరుస్తూ "నేను చాలా మాట్లాడాను" ఏదో ఆలోచన తట్టింది అతనికి "కుంగ్‌చియు నాకిచ్చిన అడవిబాతు ఏమయింది? అది ఉప్పుతో ఎండబెట్టబడిందా? అయితే ఉడకబెట్టి తినుదాన్ని. నకెట్లాగూ పళ్ళులేవు కనుక పనికిరాదు".

కెంగ్‌సాంగ్‌చు బయటకుపోయాడు. లావోజు మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు. కెంగ్‌సాంగ్‌చు అడవిబాతును వేలాడదీయడానికి చూరుకున్న వెదురుబొంగు గీకుతున్న చప్పుడుతప్ప లైబ్రిరీఅంతా నిశ్శబ్దంగా ఉంది.

మూడు నెలలు గడిచాయి లావోజు ఇదివరకులాగే తెలివిలేని కర్రిముద్దులా చలనంలేకుండా కూచున్నాడు

"గురువుగారు! కుంగ్‌చియు మళ్ళీవచ్చాడు!" ఆశ్చర్యంతో ప్రవేశించాడు అతని శిష్యుడు కెంగ్‌సాంగ్‌చు. "అతడు ఇక్కడికి రాక చాలారోజులయింది ఇప్పుడు రావడంలో అంతరార్థమేమిటో నాకు ఆశ్చర్యంగా ఉంది...."

---

1. కన్‌ఫ్యూషియస్ శిష్యుడు.

"అతన్ని లోపలికిరమ్మను" మామూలుగా అన్నాడు లావోజు ఇంకా ఏమీ మాట్లాడకుండా.

"ఎలావున్నారు గురువుగారూ?" అడిగాడు కన్‌ఫ్యూషియస్ మర్యాదగావంగి నమస్కారంచేస్తూ.

'ఎప్పటిలాగే' సమాధానమిచ్చాడు లావోజు. "నిన్నుచూడక చాలారోజు లయింది. నీఇంట్లో నువ్వు బాగాకష్టపడి చదువుతున్నావనడానికి సందేహంలేదు."

"ఎంతమాత్రంలేదు" వినయంగా అన్నాడు కన్‌ఫ్యూషియస్ "ఇంట్లోనేను ఆలోచిస్తూఉన్నాను. కొంచెంగా అర్థంచేసుకోవడంలో సఫలమయ్యాను. కాకులు, కోకిలలు ఒకదానినొకటి ముక్కుతో పొదుచుకుంటాయి. చేపలు ఒకదానినొకటి తమ లాలాజలంతో తడుపుకుంటాయి. తమ్ముడు గర్భందాల్చినప్పుడు అన్న ఏడుస్తాడు. అయితే పరిణామ చక్రంనుంచి వేరుచేయబడ్డనేను ఇతరులను పరిణామం చెందించ డంలో ఎలా సఫలమవుతాను?

"అలాగా" అన్నాడు లావోజు "నీవు అర్థం చేసుకుంటున్నావు."

వేరేమాటలేమీ జరగలేదు. వాళ్ళిద్దరూ తెలివిలేని కర్రిమొద్దుల్లా కూర్చున్నారు. ఎనిమిదినిమిషాలు గడిచాయి. అతడు గాఢంగా ఊపిరిపీల్చుకొని లేచి నిలబడి సెలవు తీసుకోవడానికి గురువుకు యథావిధిగా మర్యాదగా కృతజ్ఞతలు చెప్పాడు అతని ఉపదేశాలకు.

లావోజు అతన్ని ఆపలేదు. చేతికర్రి ఆసరాతో నిలబడుతూ అతన్ని లైబ్రరీ గేటుదాకా సాగనంపాడు. కన్‌ఫ్యూషియస్ తన బండి నెక్కేంతవరకు చూసి అప్పుడు వృద్ధుడు యాంత్రికంగా గొణిగాడు.

"నువ్వు తప్పకుండా పోవాలా? తేనీరు తీసికోవా?"

కన్‌ఫ్యూషియస్ కృతజ్ఞతలు చెప్పి బండినెక్కాడు. కడ్డీవైపు వంగుతూ జోడించిన చేతులను గౌరవంగా పైకెత్తాడు వీడ్కోలుచెప్తూ. జాన్‌యు గాలిలో కొరడాను ఝళిపిస్తూ "పరుగెత్తు" అని అరిచాడు. బండి బయలుదేరింది. అది పదిగజాలు పోయిన తరువాత లావోజు తన గదిలోకిపోయాడు.

"ఈరోజు ఉత్సాహంగాలేరు గురువుగారు" అన్నాడు కెంగ్‌సాంగ్‌చు లావోజు తన కుర్చీలోకూర్చున్న తరువాత చేతులుకట్టుకుని అతని ప్రక్కన నిలబడుతూ "మీరు తక్కువ మాట్లాడారు...."

"అంతే" అన్నాడు లావోజు బలహీనంగా నిట్టూరుస్తూ. "కాని నీకు అర్థం కాలేదు. నేను వెళ్ళిపోవాల్సి ఉన్నది."

"ఎందుకు?" ఒకవేళ ఆకాశం నుంచి పిడుగు మీదపడ్డా చలించకపోయేవాడు కెంగ్‌సాంగ్‌చు.

"కుంగ్‌చియు నా భావాలు అర్థంచేసుకున్నాడు. అతడికి తెలుసు నేనొక్కడినే అతడిని చదివేయగల సమర్థుడనని. ఇది అతన్ని వ్యాకుల పరిచుండాలి. ఒకవేళ నేను పోకపోతే ఇబ్బందికరంగా ఉంటుంది...."

"కాని అతడు అదే దారికి చెందినవాడు కదా మీరెందుకు పోవాలి?"

"లేదు" లావోజు అనంగీకారంతో చేయిఊపాడు. "మనది అదే దారికాదు. మనం అదేరకమైన పాదరక్షలు ధరించవచ్చు, కాని నావి ఎడారిగుండా ప్రయాణం చేయడానికి పనికి వచ్చేవి. అతనివి రాజాస్థానానికి పోవడానికి."

"కాని మీరు అతనికి గురువు"

"ఇన్ని సంవత్సరాలనుంచి నాతోఉన్నా ఇంకా నీవు అమాయకంగానే ఉన్నావా?" లావోజు తనలోతానే నవ్వుకున్నాడు." ప్రకృతి మార్పులకు గురికాదు. గమ్యం మారిపోదన్నది ఎంత నిజం! కుంగ్‌చియు నీలాగాకాదన్న విషయం నీవు తెలుసుకోవాలి, అతడు ఎప్పుడూ తిరిగిరాడు. నన్ను గురువుగారు అని మళ్ళీ పిలవడు. అతడు నాగురించి "ఆముసలాడు" అని చెప్తుంటాడు. నావెనక జిత్తులు పన్నుతాడు."

"నేను అట్లా ఎన్నడూ ఆలోచించలేదు. కాని గురువుగారూ మనుషులగురించి అంచనావేయడంలో మీరెప్పుడూ సరియే...."

"లేదు. మొదట్లో తరుచుగా నేనూ తప్పులుచేసాను."

"మంచిది అట్లయితే" కెంగ్‌సాంగ్‌చు కొంతసేపు ఆలోచనతరువాత అన్నాడు" మనం అతనితో ఈ విషయంలో పోట్లాడుదాము."

లావోజు మళ్ళీ తనలోతాను నవ్వుకొని నోరును పెద్దగాతెరిచాడు.

"చూడు, నాకెన్ని పళ్ళుమిగిలాయి?"

"ఏమీలేవు".

"నా నాలుకసంగతేమిటి?"

"అది ఇంకాఉంది"

"నీకు అర్థం అయిందా?"

"అంటే మీరనేది గురువుగారూ ఏదిగట్టిగా వుంటుందో అది మొదలుపోతుందని, ఏది మెత్తగా ఉంటుందో అది చివరికని."

"సరిగ్గాచెప్పావు. నువ్వు నీ సామాన్లన్ని మూటగట్టుకుని ఇంటికి నీ భార్య దగ్గరకుపోతే బాగుంటుందనిపిస్తున్నది. కాని మొదలు నా నల్లఎద్దును శుభ్రించేసి జీనును జీనుబట్టను ఎండబెట్టు. నాకు రేపు అవి మొదటకావాలి "

హన్‌కు మార్గం 1 వద్దకువచ్చిన తరువాత అక్కడికి సూటిగానున్న రహదారి గుండా పోకుండా లావోజు తనఎద్దు కళ్ళాన్ని అపి పక్కదారిలోకి మళ్ళించాడు గోడ చుట్టు తిరిగిపోవడానికి. అతడు దాన్ని ఎక్కదామనుకున్నాడు. గోడ చాలా ఎత్తుగా లేదు. ఎద్దువీపుమీద నిలబడి గోడమీదికెగబాకగలిగేవాడు. కాని దానివల్ల ఎద్దును లోపలే వదలాల్సివచ్చేది. దాన్నిదాటి బయటకు పోవాలంటే ఒక కేక అవసరం. లుపాన్ 2 కానిమోటి 3 కాని ఈ సమయంలో జన్మించలేరు. లావోజు స్వయంగా ఇటువంటి విచిత్రమైన పరికరం గురించి ఊహించలేడు. సూక్ష్మంగా చెప్పాలంటే అతడు తన వేదాంతబుర్రను ఎంతకష్టపెట్టినా బయటకుపోవడానికి దారి ఆలోచించలేక పోయాడు.

అతడు పక్కదారిలోకి తిరిగినప్పుడు ఒక గూఢచారి అతనిని గమనించి ఆ విషయం ఆ మార్గం అధికారికి చెప్పాడన్నవిషయం లావోజు గ్రహించలేదు. అతడు ఇర వైగజాలు ముందుకుపోకముందే ఒక అశ్వికదళం అతన్ని వెంబడించింది. ముందు గూఢచారి తరువాత ఆ మార్గంఅధికారి సి, నలుగురు కానిస్టేబుళ్ళతో ఇద్దరు కస్టమ్ అధికారులు అతన్ని వెంబడించారు.

"ఆగు" అందులోకొందరు అరిచారు.

లావోజు అనాలోచితంగా తన నల్లఎద్దు కళ్ళాన్ని బిగబట్టి దిగి తెలివిలేని కర్ర మొద్దులా చలనంలేకుండా ఉండిపోయాడు.

"మంచిది ! మంచిది !" అధికారి ఆశ్చర్యంతో ముందుకు పరుగెత్తి అత డెవరో చూసాడు. అతడు గుర్తింమించి దుమికి గౌరవంగా ముందుకువంగాడు. "ఎవరోనని ఆశ్చర్యపోతున్నాను నేను- అయితే లావోజు ముఖ్యగ్రంధాలయాధికారి అన్నమాట- ఇదిచాలా ఆశ్చర్యకరమైన విషయం".

---

1. ఈ మార్గం గుండా పురాతనకాల మనుష్యులు ప్రయాణం చేసారు.
2. కుంగ్‌షుపాన్ అన్న పేరుకూడాకల నైపుణ్యంగల చిత్రకారుడు: లు పట్టణాన్ని కనుగొన్నవాడు.
3. పురాతనకాలపు చైనా వేదాంతి.

లావోజు తొందరగా కష్టంతో ఎద్దుమీదికి ఎక్కడానికి ప్రయత్నంచేస్తూ తన మూసినకళ్ళతో అధికారివైపుచూస్తూ అస్పష్టంగా అన్నాడు 'నాజ్ఞాపకం మందగిస్తున్నది'

"కావచ్చు- చాలాసహజం మీరునన్ను గుర్తుపెట్టుకోలేరు- నేను అధికారి సిని- నేను కొంతకాలంక్రితం లైబ్రిరీకి 'పన్నులువేయుట-దానిసారాంశము' చూడడానికి వచ్చినప్పుడు మిమ్మల్ని కలిసాను"

ఈలోపల కస్టమ్‌అధికారులు జీనును, జీనుబట్టను బాగావెతకడం మొదలు పెట్టారు- ఒకతను తనదగ్గరున్న పనిముట్టుతో రంధ్రించేసి వేలుపెట్టి కెలుకసాగాడు- తరువాత అతడు నిశ్శబ్దంగా దూరంజరిగి తిరస్కారంగా చూస్తూ నిలబడ్డాడు-

"మీరు గోడచుట్టు ప్రదక్షిణం చేయడానికి బయలుదేరారా" అడిగాడు సి.

"లేదు నేను గాలిసూర్పుకోసం బయటకు పోదామనుకుంటున్నాను".

"చాలామంచిది. నిజంగా చాలామంచిది. ఇవ్వాళరేపంతా అందరూ ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్నారు- ఆరోగ్యం చాలాముఖ్యం, కాని ఇదిమాకు చాలాఅరుదుగా వచ్చిన అవకాశం- మాకు మిమ్మలను తప్పకుండా కస్టమ్ ఇంటిలోకివచ్చి కొన్ని రోజులుండి మీ ఉపదేశాలవల్ల మాకు జ్ఞానంవచ్చేట్టు చేయమని కోరాలనిఉన్నది."

లావోజు సమాధానం చెప్పకముందే నలుగురు కానిస్టేబుళ్ళు ముందుకువచ్చి అతన్ని పైకెత్తి ఎద్దుమీద కూర్చోబెట్టారు. ఒక కస్టమ్ అధికారి తనదగ్గరున్న కర్రతో ఎద్దు పిరుదులమీద కొడిచాడు. ఎద్దు తోకనుజాడిస్తూ ఆదారిగుండా ముందుకుపోయింది.

అక్కడికిపోయిన తరువాత వాళ్ళు అతన్ని ఇంటిలోని మధ్య గదిలోకి తీసుకు పోయారు. ఈ గదిలోని కిటకీల గుండా ఆకాశం వైపువంగి ఉన్న పచ్చని ఎత్తైన మైదానం తప్ప ఏమీ కనిపించదు. ఆకాశం నీలంగా ఉంది. గాలి స్వచ్ఛంగా ఉంది.

వాళ్ళు పులియని రొట్టెను తిని కొన్నివేడి నీళ్ళు తాగారు- తరువాత లావోజు కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత అధికారిసి- అతన్ని ఉపన్యసించడానికి పిలి చాడు- తిరస్కరించడం అన్నప్రశ్నేలేదు కనుక లావోజు అంగీకరించాడు- హాలంతా ప్రేక్షకులు సర్దుకునికూర్చోవడంలో సందడిగాను గందరగోళంగాను ఉంది- అతన్ని తీసుకువచ్చిన ఎనిమిది మంది కానిస్టేబుళ్ళ కాక ఇంకా నలుగురు కానిస్టేబుళ్ళు, ఇద్దరు కస్టమ్ అధికారులు, ఐదుగురు గూఢచారులు, లేఖకుడు, అకౌంటంట్ మరియు ఒక వంటతను ఉన్నారు. కొంతమంది బ్రష్షులు, కత్తులు, కర్రపలకలు,[1] తెచ్చుకున్నారు.

1. కాగితం కనిపెట్టబడక ముందు వెదురుతోచేసిన కర్రపలకలు ఉపయోగించే వారు. తప్పులను కత్తితో చెరిపేవారు.

లావోజు మధ్యలో తెలివిలేని కర్రబొమ్మలా కూర్చున్నాడు. దీర్ఘ నిశ్శబ్దం తరువాత అతడు కొన్నిసార్లుదగ్గి తన తెల్లగడ్డం వెనకనున్న పెదిమలు ఆడించడం మొదలుపెట్టాడు. వెంటనే అందరూ శ్వాసనాపి శ్రద్ధగా వినడానికి ఉపక్రమించగా అతడు మెల్లగా మొదలుపెట్టాడు.

చెప్పవలసిన దారి అజాగ్రత్తలేని దారి కాదు.
పేరు పెట్టవలసిన పేర్లు పేరుపేర్లుకావు.
పేరులేని దాంట్లోంచి ఆకాశం, భూమి ఊడిపడ్డాయి.

వింటున్న వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు. ఎవ్వరూ రాసుకోవడం లేదు. లావోజు కొనసాగించాడు.

నిజంగా, ఎవ్వరు తమంత తాముగా కోరికలనుంచి ఎప్పటికీ బయటపడితే మాత్రమే రహస్య సారాంశాలను చూడగలుగుతారు.

ఎవ్వరు తమంత తాము కోరికలనుంచి బయటపడరో వాళ్ళు ఫలితాలు మాత్రమే చూస్తారు.

ఈ రెండు విషయాలు ఒకే రూపంనుంచి వచ్చినవి కాని పేరులో భేదం ఉంది.
"ఒకేరూపం" మనం దాన్ని రహస్యంఅని పిలవవచ్చు.
లేక ఇంకామంచిగా "ఏ రహస్యంకన్నా గాఢంగా".
ద్వారం ఎక్కడనుండి అన్ని రహస్య సారాంశాలను జారీచేసింది.

బాధాచిహ్నాలు అందరి ముఖాల్లోను కనబడ్డాయి. కొంతమందికి కాళ్ళుచేతులు ఎక్కడ పెట్టుకోవాలో తెలవలేదు. ఒక కస్టమ్ అధికారి పెద్దగా ఆవలించాడు. లేఖకుడు పడుకున్నాడు తన బ్రష్షులు, కత్తులు, కర్రపలకలు నేలమీద చప్పుడయ్యేట్టు పడవేసి.

లావోజు ఇది గమనించినట్టులేదు. గమనించినా ఇంకా వివరాల్లోకి పోయాడు. అతనికి పళ్ళులేవు కాబట్టి ఉచ్చారణ స్పష్టంగాలేదు. అతనినుండి ఇదివరకంటె వాళ్లు ఎక్కువ తెలుసుకున్నదేమీలేదు. కాని అతడు ఎక్కువ వివరణలలోకి పోతున్నకొలది వాళ్ళబాధ ఎక్కువయ్యింది.

చూడడానికి అది వింటున్నట్టు ఉండాలి- కొందరు పడుకొని, కొందరు కాళ్ళు చేతులు బార్లాచాపుకొని పక్కకువంగి వాళ్ళ స్వంత ఆలోచనల్లోనే ఇరుక్కుపోయి వట్టున్నారు. చిట్టచివరకు లావోజు ముగించాడు.

"జ్ఞానియొక్కమార్గం కష్టపడకుండా పనిచేయడం."

అతడు మౌనంగాఉన్నా ఎవ్వరూ కదలలేదు- లావోజు ఒక్కక్షణం ఆగి "అంతే" అన్నాడు.

దీనితో వాళ్ళు దీర్ఘ నిద్రనుండి లేచినట్టు కనపడ్డారు- చాలా సేపునుంచి కూర్చో వడం వల్ల కాళ్ళు తిమ్మిరిపట్టి వెంటనే లేవలేకపోయారు. వాళ్ళ మనస్సుల్లోమాత్రం ఖైదీలకు క్షమాభిక్ష దొరికినంత సంతోషంగాఉంది.

లావోజు పక్కగదిలోకి విశ్రాంతి తీసుకోవడానికి తీసుకపోబడ్డాడు; కొన్ని గుక్కెళ్ళు మరిగించిన నీళ్ళు తాగినతరువాత అక్కడ తెలివిలేని కర్రమొద్దులా చలనం లేకుండా కూర్చున్నాడు.

ఈ లోపల బయట వాగ్వివాదాలు జరిగాయి. దాని సారాంశం ఏమంటే అతడు చాలావేగంగా మాట్లాడడంవల్ల, ఉచ్చారణ అర్థంగాకపోవడంవల్ల ఎవ్వరూ రాసుకో లేక పోయారు- ఏమీ రికార్డు లేకుండా పోవడం విచారించదగ్గ విషయం. కాబట్టి వాళ్ళు అతన్ని ఉపన్యాస అంశాలను రాసివ్వాలని కోరడానికి నలుగురిని అతని దగ్గరకు పంపారు.

"అతడు దేనిగురించి మాట్లాడాడు? నాకు ఒక్కముక్కకూడా అర్థంకాలేదు" మొత్తుకున్నాడు అకౌంటెంట్ తన సంకర ఉచ్చారణతో.

"మీరు మొత్తంరాస్తే బాగుంటుంది." అన్నాడు లేఖకుడు సూక్ష్మమాండలికంతో మాట్లాడుతూ "ఒకసారి రాసివేస్తే మీరు మాట్లాడేదేమీ ఉండదు."

లావోజుకు వాళ్ళు చెప్పిందేమీ అర్థంకాలేదు. కాని మిగతా ఇద్దరు బ్రష్, కత్తి, కర్రపలకల దొంతర అతని ముందు పెట్టడంవల్ల వాళ్ళకు ఉపన్యాసం యొక్క సారాంశం కావాలని ఊహించాడు. తిరస్కరించడం అన్న ప్రశ్నే లేదు కనుక అంగీకరించాడు. అప్పటికే రాత్రిఅయింది కనుక మర్నాడు ఉదయం మొదలుపెడ్తా నని వాగ్దానం చేసాడు. వచ్చిన బృందం తృప్తిచెంది బయటకుపోయింది.

మర్నాడు తెల్లవారినా మబ్బులు క్రమ్ముకుని ఉండడంవల్ల చీకటిగా అని పించింది. లావోజుకు అస్వస్థతగా ఉన్నట్టు అనిపించినా పనిచేయడానికి కూర్చున్నాడు. వీలయినంత తొందరగా అక్కడి నుండి పోవాలి. కర్రపలకల దొంతర వైపుచూసి ఇబ్బందిగా ఫీలయ్యాడు.

కాని ముఖంలో ఏమీ మార్పులు లేకుండా కూర్చుని నిశ్శబ్దంగా రాయడం మొదలుపెట్టాడు. తన మనస్సును క్రితం రోజు చెప్పిన విషయాలమీద లగ్నంచేసి

గుర్తున్నట్టుగా ప్రతి వాక్యాన్నీ రాసాడు. అవి కళ్ళజోడు కనిపెట్టబడని ముందు రోజులు. అతని కాంతిలేని కళ్ళు చీటలువారేదాకా శ్రమపడ్డాయి. మరిగించిన నీళ్ళు తాగడానికి, రొట్టె తినడానికి మాత్రమే ఆపి మొత్తం రోజున్నరలో అయిదువేల అక్షరాలకన్న రాయలేకపోయాడు.

"ఇక్కడ నుండి పోవడానికి ఇది సరిపోతుంది" అతను అనుకున్నాడు. అతడు పలకలన్నిటినీ దగ్గరకు చేర్చి తాడుతో కట్టాడు. తరువాత చేతికర్ర ఆసరాతో అధికారి ఆఫీసుకు తన లిఖిత గ్రంధాన్ని అందజేయడానికి, వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోవా లని చెప్పడానికి వెళ్ళాడు.

సి చాలా సంతోషపడ్డాడు- చాలా మెచ్చుకున్నాడు- చాలా విచారపడ్డాడు అతడు వెళ్ళిపోతాడని విని- అతన్ని కొంతసేపు ఆపడానికి వ్యర్థప్రయత్నం చేసి దుఃఖంతో తన సమ్మతి తెలియచేసి కానిస్టేబుళ్ళకు అతని నల్లఎద్దును జీనుతో సిద్ధంచేయమని అజ్ఞాపించాడు- తనే స్వయంగా షెల్ఫ్ నుంచి ఉప్పుపొట్లం, నువ్వులపొట్లం, పది హేనుకేకుల రొట్టె తీసుకున్నాడు- వీటిని అదివరకే జప్తుచేసుకున్న తెల్లసంచిలోపెట్టి లావోజుకు దారిలో తినడానికి కానుకగా ఇచ్చాడు- అతడు ఈ ప్రత్యేకమైన శ్రద్ధ పెద్ద రచయితలకే ఉంటుందన్న విషయం తెలియచేసాడు- చిన్న రచయితలకు పదికేకులు మాత్రమే ఇస్తారు.

అనేకసార్లు కృతజ్ఞతలు తెలియచేసి లావోజు సంచితీసుకున్నాడు- అందరూ వెంటరాగా అతడు ఇంటినివదిలి బయటకుపోయాడు- మార్గందగ్గర అధికారి సి అతడు ఎక్కేంతవరకు ఉన్నతరువాత వీడ్కోలుచెప్పుతూ ఎద్దును కదిలించాడు ఆ మార్గంగుండా లావోజు.

ఎద్దు పెద్దపెద్ద అంగలువేస్తూ దూరమవుతూండే అందరూ మార్గంగుండా చూస్తూవున్నారు. లావోజు ఏడెనిమిది గజాలు పోయినా వాళ్ళు అతని తెల్లవెంట్రుకలు పసుపుపచ్చగౌను, నల్లఎద్దు మరియు తెల్లసంచి చూడగలిగారు. తరువాత దుమ్ము మనిషిని ఎద్దును కప్పేసింది. ప్రస్తుతం వాళ్ళు దుమ్మునుతప్ప ఏమీ చూడలేక పోయారు.

ఇంట్లోకి వచ్చిన తరువాత అందరూ భుజాలమీంచి బరువులు దిగిపోయినట్టు పెదవులు చప్పరించారు లాభంపొందినట్టు. చాలామంది అధికారి సి తో ఆఫీసులోకి వెళ్ళారు.

"ఇదా లిఖితగ్రంథం?" తాడును తీసివేస్తూ కర్రపలకను తిరగేస్తూ అన్నాడు అకౌంటెంట్. కనీసం శుభ్రంగా రాయబడింది. నేను ధైర్యంగా చెప్పగలను మార్కెటులో ఇది కొనగలవాడు దొరుకుతాడని.

లేఖకుడుకూడా ముందుకువచ్చి మొదటిపలకను చదివాడు "చెప్పబడినమార్గం అజాగ్రత్తగల మార్గంకాదు! .... బా! అదే పనికిరానిచెత్త తలనొప్పిరావడానికి ఇది సరిపోతుంది."

"తలనొప్పినివారణ నిద్రపోవడం" అక్కౌంటంట్ అన్నాడు పలక కింద పెడుతూ.

"ఆహ!.... నేను నిద్రపోతాను. నిజానికి నేను అక్కడికి అతడు తన ప్రేమవ్యవహారాలు చెప్తాడని అనుకొనిపోయాను. నాకు మనమంతా పనికిరాని సోది వినడానికి పోతామని తెలిసిఉంటే గంటలకొద్దీ బాధపడుతూ అక్కడ కూర్చోవడానికి పొయ్యేవాడినికాను."

"నీమనిషిని గురించి సరిగ్గా అంచనా వేయలేకపోవడం నీ తప్పు" అధికారి సినవ్వాడు "అతడికి ప్రేమ వ్యవహారాలేముంటాయి? అతడు ఎన్నడూ ప్రేమలో పడలేదు."

"మీకెలాతెలుసు?" లేఖకుడు ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు అతడు చెప్తుంటే వినలేదా 'మందకొడిగా ఉంటూ ప్రతిదాన్ని చురుకుగా చేయవచ్చు'. నువ్వు నిద్రపోవడం నీతప్పు ఆ వృద్ధుడికి 'అత్యాశలు ఆకాశం లాగా ఎత్తయినవి, అదృష్టం కాగితంలాగా పలుచనిది'. అతడు ఎప్పుడయితే ప్రతీది చురుకుగా చేయవచ్చు అనుకోవడంలో అతడు 'మందకొడి'గా కుంచించుకు పోయాడు. ఒకవేళ అతడు ఎవరినయినా ప్రేమించడం మొదలుపెడితే అతడు ప్రతి ఒక్కరినీ ప్రేమించాల్సి ఉంటుంది. కనుక అతడు ఎట్లా ప్రేమలో పడగలడు? అతడు ఎట్లా ధైర్యం చేయగలడు? నీ సంగతేచూడు. నువ్వు ఒక అమ్మాయిని అందంగాఉన్నా లేకున్నా ఆమెవైపు కన్నునిలిపి నీ భార్యన్నట్టుగా చూసావు. మన అకౌంటెంట్‌వలె పెళ్ళిచేసుకున్న తర్వాత నువ్వు మంచిగా ప్రవర్తిస్తావనుకుంటాను."

బయట గాలివీచింది, వాళ్ళకు చలిగా అనిపించింది. "కాని వృద్ధుడు ఎక్కడికి పోతున్నాడు? అతడు ఏమి చేద్దామనుకుంటున్నాడు?" లేఖకుడు విషయాన్ని మార్చడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకున్నాడు.

"అతడు చెప్పిన దాన్నిబట్టి ఎడారికిపోతున్నాడు." చెప్పాడు సి. "అతడు ఎప్పుడూ అలా చేయాలేదు. అతడికి అక్కడ ఉప్పుకాని, పిండికాని దొరకదు. నీళ్ళు కూడా కరువే. అతనికి ఆకలేసినప్పుడు తప్పక వెనక్కి తిరిగి వస్తాడనడంలో నాకు అనుమానంలేదు."

"అప్పుడు మనం అతనితో మరొక గ్రంథం రాయించవచ్చు" అకౌంటంట్ ఉత్సాహంగా అన్నాడు. "కాని అతడు రొట్టె విషయం తేలికగా తీసికోవాల్సివుంటుంది. మనం అతనితో చెప్పుదాం పద్ధతులు మారిపోయాయని, మనం యువరచయితలకు ప్రోత్సాహమిస్తున్నామని. మనం అతనికి రెండు కట్టల పలకలకు అయిదుకేకుల రొట్టె మాత్రం ఇద్దాం."

"దానికి అతడు ఒప్పుకోకపోవచ్చు, గొడవచేస్తాడు."

"అతడు ఆకలితో ఉంటే గొడవ ఎలాచేయగలడు?"

"నాకు భయంగా ఉంది. ఎవ్వరూ ఇటువంటి చెత్తచదువాలనుకోవద్దు." లేఖకుడు ఒకచేత్తో అభినయం చేసాడు. "మనకు ఐదుకేకుల ధరకూడా దొరకదు. ఉదాహరణకు అతడు చెప్పిందే నిజమైతే మన అధికారి తన ఉద్యోగం వదిలెయ్యాలి. అదొక్కటే పద్ధతి మందకొడిగా తయారుకావడానికి.

"విచారించకు" అన్నాడు అకౌంటంట్. "కొంతమంది అది చదువుతారు. చాలామంది రిటైరయిన అధికారులు, ఇంకా అధికారులు కాని సన్యాసులులేరా?"

బయటగాలివీచి పసుపుపచ్చని దుమ్మంతా ఆకాశం సగానికీ వ్యాపించి మబ్బు పట్టినట్లయ్యింది. అధికారి ద్వారంవైపు చూసి అక్కడ చాలామంది కానిస్టేబుళ్ళు, గూఢచారులు మాట్లాడుకుంటూ ఉండడం గమనించాడు.

"అక్కడ నిద్రపోతున్నారా?" అరిచాడు "చీకటి పడుతున్నది. గోడమీది నుంచి ఈ సమయంలోనే కదా నిషేధించబడిన వస్తువులను దొంగతనంగా ఎగుమతి దిగుమతి చేసేది. పోయి అక్కడ నిఘావెయ్యండి."

బయటఉన్న మనుషులు వెళ్ళిపోయారు. లోపల ఉన్నవాళ్ళు నిశ్శబ్దంగా ఉన్నారు. లేఖకుడు, అకౌంటంట్ మాటలు ఆపేసారు. అధికారి సి తన చొక్కాతో డిస్కుమీద దుమ్ముదులిపి తరువాత రెండు దొంతరల పలకలను కుప్పలుగాఉన్న ఉప్పు, నువ్వులు, బట్టలు, చిక్కుళ్ళు, రొట్టె ఇంకా ఇతరజప్తు చేయబడిన వస్తువులున్న షెల్ఫులమీద పెట్టాడు.

పుస్తకపరిచయం :

లూసున్ సాహిత్య జీవితం

లూసున్ శతజయంతి సందర్భంగా విప్లవ రచయితలసంఘం లూసున్ జననం (25 సెప్టెంబర్ 1881) కుటుంబం, విద్య, ఉద్యోగం మొదలైన జీవితవిశేషాలు, ఈ జీవితం ఏ విధంగా చైనా నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంతో పెన వేసుకొని మునుసాగిందో వివరించే విధంగా ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

లూసున్‌ది సాహిత్యజీవితం. లూసున్‌ది జీవితసాహిత్యం. చైనాప్రజల ప్రజాస్వామిక పోరాటాలతో ఎదిగి తీగెసాగింది ఆయన జీవితమైనా, సాహిత్యమైనా.

ఈ పుస్తకంలో మొదటిసారిగా ఇంతవరకు తెలుగులో వెలుగుచూడని ఫెంగ్ సు యే ఫెంగ్ రచన 'లూసున్- అతని జీవితవిశేషాలు' కొడవటిగంటి కుటుంబరావు అనువాదం చోటుచేసుకున్నది. 21 పేజీల ఈ వ్యాసంలో లూసున్ ఎప్పుడు, ఎక్కడ పుట్టి ఎట్లా పెరిగి విద్యాబుద్ధులు గరచాడనిచెప్పే పద్ధతికాకుండా ఈ ఎప్పుడు, ఎక్కడ, ఎట్లాలు చైనాలో ఆనాడున్న భౌతిక పరిస్థితులకు, పరిసరాలకు ఏ విధంగా ప్రభావాన్ని చూపాయి ఆ క్రమంలో లూసున్ వ్యక్తిత్వం, సాహిత్య వ్యక్తిత్వం ఎట్లా రూపొందాయి అనే విశ్లేషణ మనకు లభిస్తుంది.

"చిన్నతనంలో చదివిన చదువూ, వ్యసనాలూ, సంపర్కాలూ, లూసున్ అనంతరకాలంలో సాహిత్య రంగంలోనూ విప్లవానికీ చేసిన కృషికీ కొంతవరకు పునాదిగా వుండటంలో ఆశ్చర్యంలేదు. కాని ఆకాలపు సామాజిక పరిస్థితిదృష్ట్యా లూసున్‌ని విప్లవందిశలోకి నెట్టినది దేశంమీద విదేశీ సామ్రాజ్యవాదం చేసినదాడీ, చీనాలోని ఫ్యూడల్ వ్యవస్థ పతనం చెందనారంభించటమూనూ...." (పే 6)

జపాన్‌లో విద్యార్థిగా గడిపిన ఎనిమిదేళ్ళు ఆయనలో దేశాభిమానం విజృంభించటమేగాక, సమగ్రంకూడ అయింది. తనదేశపు పరిస్థితులు తలచుకొని మండిపోయి, లూసున్ తనదేశపు గౌరవప్రతిష్ఠలను పునస్థాపించటంకోసం తన జీవితమంతా ధారపోయాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఎనిమిదేళ్ళు ఆయన తరువాతి భావలకూ, రచనలకూ మంచి పునాదివేసాయి.

1911లో చైనాలో విప్లవం జరిగింది. అది మంచూ పరిపాలనను అంతం చేసిందేకాని, సామ్రాజ్యవాదాన్ని ఫ్యూడలిజాన్ని స్పృశించలేదు. అందువల్ల లూసున్‌కి ఈ విప్లవం సంతృప్తినివ్వలేదు ఈ అసంతృప్తి నిజానికి ఆయనకు బూర్జువా వర్గం పట్లవున్న అసంతృప్తే. అయితే ఫ్యూడలిజంతో రాజీపడే సంస్కరణ ధోరణిని నిరాకరించి, బూర్జువా ప్రజాస్వామ్యం తాలూకు విప్లవభావాన్ని పూర్తిగా అర్థంచేసుకున్నప్పటికీ 1917 రష్యన్ అక్టోబరు విప్లవం, చైనా 1919 మే 4 ఉద్యమం తర్వా

ఈ విప్లవాన్ని ఎవరునడపాలి, ఏశక్తి దాన్ని సాధించాలి, ఏశక్తులపై ఆధారపడాలి మొదలైన అంశాలు ఆయనకు స్పష్టంకాలేదు. మే 4 ఉద్యమం ఆరంభంకాబోతుండగా లూసున్‌లో మార్పుజరిగింది. చైనా ప్రజాస్వామిక విప్లవంలో పాతదశకూ కొత్తదశకూ మధ్య విభజనరేఖ ఈ మే నాలుగు ఉద్యమం. ఇది ఒక నూతన సంస్కృతీ ఉద్యమంకూడ. "....ఫ్యూడల్ సంస్కృతికి పూర్తిగా విరుద్ధమైన ఉద్యమం. చైనాచరిత్ర ప్రారంభమయ్యాక ఇంతగొప్ప, సమగ్ర సాంస్కృతిక విప్లవం జరిగి వుండలేదు పాతనీతిని వ్యతిరేకించి కొత్తనీతిని పెంపొందించండి, పాతసాహిత్యాన్ని వ్యతిరేకించి 'కొత్త సాహిత్యాన్ని పెంపొందించండి' అన్న రెండునినాదాలతో అది గొప్ప విజయం సాధించింది" అన్నాడు మావో. 1918 ఏప్రిల్‌లో లూసున్ 'పిచ్చివాడిడైరీ' అనే సుప్రసిద్ధకథను వాడుకభాషలో ప్రచురించాడు. ఈ కథ చైనాలోని ఫ్యూడల్ కుటుంబ విధానాన్ని, పాత కన్‌ఫ్యూషియస్ ఆచారాలనూ చావుదెబ్బ కొట్టింది. విషయరీత్యానూ, సాహిత్య ప్రక్రియగానూ ఇది సాంస్కృతిక విప్లవానికి తొలిశంఖారావం. ఈ సమయంలోనే లూసున్ సామాజిక సమస్యలను తీసుకొని వాడైన, విషయపూర్ణమైన, సంఘర్షణాత్మక వ్యాసాలు రాసాడు.

1923 లో ఆయన మొదటి కథా సంపుటం "సహన్" వెలువడింది. లూసున్ కథలలోని సృజన శక్తి సాహిత్య విప్లవానికి పునాదివేసింది. లూసున్ కలంతో పోరాటమే కాకుండా ఆ కాలపు యువకులకు చాల సన్నిహితంగా కూడ వున్నాడు. 1920 నుంచి 26 వరకు ఆయన అన్ని విద్యార్థి, యువజన ఉద్యమాలను బలపరిచి వాళ్ళతోపాటు నిలిచాడు. 1926 ఆగస్టులో తిరోగమన యుద్ధప్రభుతుల ప్రభుత్వం ఆయనను పేకింగ్ నుంచి వెళ్ళగొట్టింది. 1927 లో ఆయన షాంఘై వెళ్ళి 1937లో మరణించేదాకా అక్కడే వున్నాడు. ఆయన సర్వ శక్తినీ రచననూ సాహిత్య ఉద్యమానికే ధారపోశాడు. మార్క్సిజం-లెనినిజం తాలూకు సాహిత్య సిద్ధాంతాలు అనువదించాడు. ఇదేకాలంలో ఆయన కమ్యూనిస్టుపార్టీకి సన్నిహితుడై, అది సాగించే ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నాడు. 1930లో చైనా వామపక్ష రచయితలసంఘం ఏర్పడింది. ఇది చరిత్రాత్మకమైన ఘటన. దీని వ్యవస్థాపకులలో లూసున్ ప్రముఖుడు. 1932లో ఆయన చైనా పౌరహక్కుల సంఘంలో చేరాడు.

1936లో జబ్బుపడినప్పుడుకూడ యువరచయితలను ప్రోత్సహించడంలోనూ, విప్లవోద్యమానికి దోహదం చేయడంలోనూ ఆయన తరగని ఉత్సాహాన్ని చూపాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే లూసున్ సాహిత్యజీవితం భౌతికవాదంనుంచి విప్లవ చారిత్రిక గతితార్కిక భౌతికవాదానికి లంఘించటం- ఈ పరిణామాత్మక, గుణాత్మక పరిణామాన్ని అతని జీవిత విశేషాలద్వారా, ఎన్నికచేసి ప్రచురించిన వ్యాసాలద్వారా ఈ పుస్తకం మనకు సంక్షిప్తంగా పరిచయంచేస్తుంది. విప్లవోద్యమానికి, ప్రజాస్వామ్య భావాలకు అంకితమైన సాహిత్య, సాంస్కృతిక కార్యకర్తలకు ఈ పుస్తకం ఎంతో ప్రయోజనకరమైంది.

SṚJANA Telugu Monthly Sep. 81 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

(కవర్ పేజీ తర్వాయి)

మరీఎక్కువా మరీతక్కువా కాకుండా- ఇచ్చి కొంచెం మత్తుకలిగిస్తాడు. మనుషులకు ఇది ఎందుకిస్తాడంటే ఇది తాగినవాళ్ళు ఏడ్వమా ఏడుస్తారు, పాడనూ పాడతారు. మైకంలేనట్టూ కనబడతారు, తాగినట్టూ కనబడతారు. స్పృహలో ఉన్నట్టూ కనిపిస్తారు, స్పృహలో లేనట్టూ కనిపిస్తారు. బతకడానికి ఇష్టపడుతున్నట్టూ వుంటారు, చావడానికి ఇష్టపడుతున్నట్టూ వుంటారు. సృష్టికర్త బతుకడానికి ఇష్టపడేట్టు జీవులను తయారు చేయాలి. మనుషుల్ని నాశనంచేసే ధైర్యంఇంకా ఆయనకులేదు.

పాలిపోయిన నెత్తుటిమరకలు ప్రతిఫలించే కొన్ని పాడుబడిన శిథిలాలూ కొన్ని ఒంటరి సమాధులూ భూమిమీద అక్కడక్కడా వున్నాయి. మనుషులు తమదైన, ఇతరులదైన అస్పష్టబాధనూ, దుఃఖాన్నీ అక్కడే చవిచూస్తారు. ఏదేమైనా, ఏమీ లేకపోవడంకంటె ఏదోఒకటి వుండడం మంచిదనుకుంటూ బాధనూ స్వీకరిస్తారు. అంతేకాక బాధనూ దుఃఖాన్నీ చవిచూడడాన్ని సమర్థించుకోవడానికి తమనుతాము 'స్వర్గంచేత శిక్షితులు'అని పిలుచుకుంటారు. భయపెట్టేదైనప్పటికీ రాబోయే కొత్త బాధనూ దుఃఖాన్నీ వేదననూ అనుభవించాలనే కోర్కెతో వాళ్ళు భయంకరమైన నిశ్శబ్దంలో నిరీక్షిస్తుంటారు.

వీళ్ళందరూ సృష్టికర్తకు విశ్వాసపాత్రులయిన సేవకులు. వీళ్ళిట్లాగే వుండా లనేదే ఆయన కోరిక.

దృఢంగానిలిచి పాడుబడిన గత, వర్తమాన శిథిలాలనూ, ఒంటరి సమాధు లనూ తేరిపారజూసే ఒక తిరుగుబాటుయోధుడు మనుషుల్లోంచి పైకిలేస్తాడు. తీవ్రమైన, అనంతమైన వేదననంతా అతడు అవలోకిస్తాడు. గడ్డకట్టిన నెత్తుటి అడుసునంతా అతడు సరిగా పరిశీలిస్తాడు. మరణించిన దాన్నంతా, బతికిఉన్నదాన్నంతా అతడు అర్థంచేసుకుంటాడు. పుడుతున్నదాన్నంతా, ఇంకా పుట్టవలసిఉన్నదాన్నంతా అతడు అర్థంచేసుకుంటాడు. సృష్టికర్త లీలను గమనిస్తాడు. మానవజాతిని పునరుజ్జీవింప జేయడానికో, లేక సృష్టికర్తకు విశ్వాసపాత్రులయిన సేవకులను తుదముట్టించడానికో తిరుగుబాటుయోధుడు ఉదయిస్తాడు.

బలహీనుడైన సృష్టికర్త సిగ్గుతో తలదాచుకుంటాడు. ఆ తర్వాత యోధుని చూపులతో స్వర్గమూ పుడమీ కొత్తరంగులు దిద్దుకుంటాయి. [ఏప్రిల్ 8, 1926]

SṚJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs 20-00